# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# క్రీస్తుతో కొలిమిలో

## మూడవ త్రైమాసం



**జూలై, ఆగస్టు, సెప్టెంబరు - 2022**


గ్రంథకర్త :

**గావిన్ ఆంథోని**

అనువాదం :

**చింతా ప్రకాష్**

# విషయ సూచిక


1. గొఱ్ఱెల కాపరి యొక్క వేదన ............................................ జూన్ 25-జూలై 1

2. ఎదురయ్యే వేదనలు ............................................ జూలై 2-8

3. పక్షిని బంధించుటకు పంజరము ............................................జూలై 9-15

4. కంసాలి యొక్క ముఖమును చూడగలుగుట ............................................ జూలై 16-22

5. తీవ్రమైన వేడిమి ............................................ జూలై 23-29

6. బలముగా పోరాడుట ............................................ జూలై 30-ఆగష్టు 5

7. శాశ్వతమైన నిరీక్షణ ............................................ఆగష్టు 6-12

8. అదృశ్యుడైన వానిని చూచుట............................................ ఆగష్టు 13-19

9. స్తుతియాగము చేసే జీవితం ............................................ఆగష్టు 20-26

10. కొలిమిలో సాత్వికము కలిగియుండుట ............................................ఆగష్టు 27-సెప్టెంబరు 2

11. కొలిమిలో వేచియుండుట ............................................ సెప్టెంబరు 3-9

12. మొలకెత్తే విత్తనమువలె మరణించుట ............................................సెప్టెంబరు 10-16

13. శ్రమ కొలిమిలో క్రీస్తు ............................................సెప్టెంబరు 17-23

సంపాదక వర్గము

| | | |
|---|---|---|
| సంపాదకుడు | : | క్లిఫర్డు ఆర్.గోల్డు స్టెయిన్ |
| సహాయ సంపాదకుడు | : | సొరయ హుమయూని |
| సహ సంపాదకుడు | : | షారోన్ థామస్ క్రూస్ |
| ప్రచురణకర్త | : | లియో అలెగ్జాండర్ గ్రీవ్ |
| కళ మరియు కూర్పు | : | లార్స్ జెస్టినన్ |
| పసిఫిక్ ప్రెస్ కో-ఆర్డినేటర్ | : | ట్రిసి యావెగ్ |
| ఎలెన్ జి వైట్ ఎస్టేట్ | : | డ్వెయిన్ ఎస్ మాండ్ |

పెద్దల సబ్బాతుబడి బైబిలు అధ్యయన దర్శిని సెవెంతు-డె ఎడ్వెంటిస్టు జనరల్ కాన్ఫరెన్సు వారి ఆధ్వర్యమున తయారు చేయబడింది. ప్రపంచ వ్యాప్తంగా మన్న సబ్బాతుబడి మాన్యుస్క్రిప్ట్ ఇవాల్యుయేషన్ కమిటీ సభ్యులు కన్‌సల్టింగు సంపాదకులుగా వ్యవహరిస్తారు. అందువలన గ్రంథకర్త ఉద్దేశాలు, తలంపులు పూర్తిగా అధ్యయానికి రావు.

సులభంగా అవగాహన కొరకు సిద్ధపర్చబడిన ఈ పెద్దల సబ్బాతుబడి పాఠములు త్రీ ఏంజిల్స్ డెఫ్ మినిస్ట్రీస్, పోస్టుబాక్సు 1946, గ్రీన్‌బెల్ట్, ఎం.డి.20768 వారి సహకారముతో సిద్ధపర్చబడినవి.


సంపాదక కార్యాలయము

**12501 ఓల్డ్ కొలంబియా పైక్**

**సిల్వర్ స్ప్రింగ్, మేరీలాండు-2094**

వెబ్‌సైట్: http:./www.absg.adventist.org

సెవెంత్-డె ఎడ్వంటిస్టు తెలుగు సంఘాలకు వారి యాజమాన్యం తరఫున పంపిణీ నిమిత్తం ఈస్టు సెంట్రల్ ఇండియా యూనియన్ ఆఫ్ యస్.డి.ఎ. హైదరాబాద్, సబ్బాతుబడి శాఖ డైరెక్టర్ **పాస్టరు ఉదయ్ చంద్ర** గారి ద్వారా ముద్రించబడిన పెద్దల సబ్బాతుబడి పాఠాలు.

ఫోన్ : 040-23200079, 23201832

**డి.టి.పి, ముద్రణ :**

వంశీ గ్రాఫిక్స్ & ప్రింటర్స్, విజయవాడ.

# పరిశుద్ధ సబ్బాతుబడి కార్యక్రమము

**మొత్తము 90 నిమిషాల కార్యక్రమము ఉ॥ 9.30 నుండి 11 గం॥ల వరకు**

10 నిమిషాలు ప్రార్థన చేసి, 4 లేక 5 కీర్తనలు పాడించవలెను

| సమయము | కార్యక్రమము | సూచనలు | పాల్గొనే వారి పేరు |
|---|---|---|---|
| 2 నిమిషాలు | మౌన ప్రార్థన | | వేదిక మీద యున్నవారు |
| 3 నిమిషాలు | ఆహ్వానము | (ఆహ్వానించువారి పేరు) | ............................ |
| 3 నిమిషాలు | ప్రారంభ కీర్తన | (నెంబరు, పాట పేరు) | ............................ |
| 2 నిమిషాలు | వేద పఠనము | (చదువు వారి పేరు) | ............................ |
| 2 నిమిషాలు | ప్రారంభ ప్రార్థన | (చేయువారి పేరు) | ............................ |
| 15 నిమిషాలు | సాక్ష్యం, నేచర్ టాక్ | (చెప్పవారి పేరు) | ............................ |
| 3 నిమిషాలు | ప్రత్యేక కీర్తన | (పాడువారి పేరు) | ............................ |
| 10 నిమిషాలు | మిషన్ పొలపు వార్తలు | (చదువువారి పేరు) | ............................ |
| 3 నిమిషాలు | ప్రత్యేక పాట | (పాడువారి పేరు) | ............................ |
| 30 నిమిషాలు | సబ్బాతుబడి పాఠము | (చెప్పవారి పేరు) | ............................ |
| 3 నిమిషాలు | సబ్బాతుబడి కానుకలు, కీర్తన | | ............................ |
| 2 నిమిషాలు | కానుకల ప్రార్థన | (చేయువారి పేరు) | ............................ |
| 3 నిమిషాలు | ముగింపు కీర్తన, ప్రార్థన | (చేయువారి పేరు) | ............................ |

**సూచనలు :**

1. సభ్యులందరూ వారమంత సబ్బాతుబడి పాఠమును చదివి, అర్థము కాని విషయములను అడిగి తెలుసుకొనవలెను.
2. హాజరు తీసుకొని, ప్రార్థనతో ప్రారంభించి, క్లుప్తముగా అర్ధగంటలో పాఠమును బోధించి, ప్రార్థనతో ముగించవలెను.
3. పై కార్యక్రమమును సబ్బాతుబడి నాయకులు నడిపించవలెను.
4. సబ్బాతుబడి కానుకలను సబ్బాతుబడి ట్రెజరర్ లెక్కించి, క్రింద వ్రాయవలెను.

| | | | |
|---|---|---|---|
| తేది : ------------- | మొదటి వారము | రూ॥ | ------------- |
| తేది : ------------- | రెండవ వారము | రూ॥ | ------------- |
| తేది : ------------- | మూడవ వారము | రూ॥ | ------------- |
| తేది : ------------- | నాల్గవ వారము | రూ॥ | ------------- |

ట్రెజరర్ .................................................. పాస్టరు ........................................

# ఉపోద్ఘాతం :  సిలువ వేయబడిన సృష్టికర్త

"కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు" (యోహాను 1:3). సమస్తము యేసు మూలముగా కలిగెను. అయినప్పటికి "యేసు కన్నీళ్ళు విడిచెను" అని పరిశుద్ధ లేఖనము తెలియజేయుచున్నది. (యోహాను 11:35) సృష్టికర్త దుఃఖించుటయా? అంతమాత్రమే కాకుండా అతడు (యేసు) "అతడు తృణీకరింపబడినవాడును ఆయెను. మనుష్యులవలన విసర్జింపబడినవాడును వ్యసనా క్రాంతుడుగాను, వ్యాధినను భవించినవాడు గాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను. అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయకపోతిమి" (యెష 53:3). ఒకసారి ఆయన "నా దేవా నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని బిగ్గరగా కేకవేసెను" (మత్తయి 27:46).

ఈ విషయాలు ఎట్లు సంభవిస్తాయి? యేసు మన సృష్టికర్త మాత్రమే కాదు. ఆయన మన విమోచకుడు మరియు మనలను రక్షించు నిమిత్తము, ఆయన నరునిగా, మానవ స్వభావమును ధరించుకొని ఈ లోకములో జన్మించెను గనుక, ఆయనకు చెందని విషయాల కొరకు శ్రమలను ఎదుర్కొని చివరికి రోమా సంప్రదాయములకు చెందిన ఒక సిలువ మీద మరణపర్యంతము వ్రేలాడదీయబడెను.

ఆవిధముగా మనము ఎవరి యుందైతే బ్రదుకుచున్నామో, చలించుచున్నామో మరియు ఉనికి కలిగియున్నామో (అపొ.కా.17:28) ఆ సృష్టికర్త మనము ఎన్నడు శ్రమపడనంత విధముగా ఆయన స్వీకరించిన మానవ స్వభావములో శ్రమపడియున్నాడు. సిలువపై మనము పొందవలసిన శిక్షను ఆయన భరించెను.

"నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను సహించెను. అయినను మొత్తబడినవానిగాను, శ్రమనొందినవాని గాను మనమతనిని ఎంచితిమి" (యెషయా 53:4). ఈ విశ్వచరిత్రలో అదొక విస్మయముతో కూడిన చర్యయైయున్నది.

ఈ నేపథ్యంలో (సిలువ వేయబడిన దేవుడు మనముందే పైకెత్తబడిన) రాబోవు కొన్ని నెలల పాటు సిలువ వేయబడిన సృష్టికర్తను గూర్చి అగోచరమైన అనేక విషయాలను క్రైస్తవులుగా మనము ఎదుర్కొనబోయే శ్రమల ద్వారా గ్రహించుటకు మన అధ్యయనము ద్వారా ప్రయత్నము చేయబోవుచున్నాము. "క్లిష్టమైన విషయాలన్నింటిని గూర్చి మనకు సమాధానములు లభిస్తాయని అనుకొనుట లేదు గాని ఎవరి జీవితములను క్రీస్తుకు సమర్పిస్తారో వారికి ఎదురయ్యే అనుభవముల వెనుక దేవుని ప్రేమ" (1యోహాను 4:8) ఉన్నదనే మర్మమును బాధాకరమైన సంఘటనల ద్వారా గ్రహించగలుగుతాము.

ఈ త్రిమాసములో మనము చేసే అధ్యయనము ద్వారా దేవుని వాక్యము ప్రకారము ఇతర విశ్వాసులు వారికి ఎదురైన నిరాశ, నిస్పృహలను, మోసములను, బలత్కారములను ఏవిధముగా ఎదుర్కొన్నారో మరియు వాటి నుండి ఏమి నేర్చుకున్నారో అనే విషయాలతో పాటు అవి మనకు ఏమి బోధిస్తున్నాయనే విషయమును తెలుసుకొనబోవుచున్నాము. సిలువ నేపథ్యములో చూచినపుడు, మనము మన క్రైస్తవ అనుభవములో పొందిన శ్రమలను, మన సృష్టికర్త, మన విమోచకుడైన యేసుక్రీస్తు పొందిన శ్రమలతో పోల్చి చూచినపుడు అవి ఏమాత్రము ఆయన పొందిన శ్రమలకు సాటిరావు.

మన దేవుడు శ్రమలను అనుభవించిన దేవుడు. నిజానికి ఒక క్రైస్తవుడే కాని ఆల్బర్టు కామస్ అనే గ్రంథకర్త సిలువ యొద్ద దేవుడు ఎదుర్కొనిన శ్రమలను గూర్చి ఈ విధముగా వర్ణించాడు. ఆ రాత్రి సమయములో గొల్గొతాపై మానవచరిత్రలో ఒక అసాధారణమైన సంఘటన చోటు చేసుకున్నది. "అక్కడ దైవత్వమునకు సహజముగా ఉన్న ఆధిక్యతలు విడిచి పెట్టబడినవి మరియు మరణ సంబంధమైన వేదన, నిరాశలను చివరి బొట్టు వరకు పానము చేయబడెను" ది రిబెల్ (న్యూయార్కు : వింటేజ్ ఇంటర్నేషనల్ 1991)

"మొద్దు బారిన మన మనస్సుతో సిలువ వేదనను మనము గ్రహించలేకపోవచ్చును గాని పాపము ప్రవేశించినప్పటి నుండి అది దేవుని యొక్క హృధయమునకు గాయమును చేయుచునే యున్నది" –విద్య, పుట 263.

ఈ లోకములో పాపమున్నను, దేవుడు మంచివాడే అనే విధముగా మన పాఠాలు వెల్లడిచేయుట కాదు గాని, శ్రమలన్నవి తప్పని పరిస్థితులలో ఎదురవుతాయి కాబట్టి వాటిని ఏవిధముగా ఎదుర్కొవాలనే ప్రయత్నమే ఈ పాఠాలు చేయుచున్నవి. అనగా మనకు శ్రమలు, వేదనలు ఎదురైనపుడు దేవుడు మనలను విడిచిపెట్టినందున అవి మనకు సంభవిస్తున్నవని కాదు గాని, ఆయన మనతో పాటు వేదన చెందాడనే విషయాన్ని గ్రహించబోవుచున్నాము. అయితే ఇక్కడ యేసు మనకనుగ్రహించే నిరీక్షణతో పాటు మన జీవితానికి ఒక గమ్యము ఒక భావమున్నదనే విషయాన్ని ఈ పాఠములు మనకు విశదీకరించనైయున్నవి.

"దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8:28). దేవుడు సమస్త సృష్టిని చేసియున్నను ఆయన అన్ని శ్రమలను కూడా ఎదుర్కొన్నాడు.

ఈ త్రిమాసము యొక్క సబ్బాతుబడి పాఠములను రచించిన గ్రంథకర్తగా విన్ ఆంధోని ఒక మిషనెరి బాలుడుగా శ్రీలంకలో పెరిగాడు. ఆయన ఇంగ్లండులో ఒక సంఘ పాదిరిగా పనిచేసి, తరువాత ఐస్‌లాండ్‌కు కాన్ఫరెన్సు అధ్యక్షుడుగా పనిచేశాడు. ఆ సమయములో ఈ పాఠములను వ్రాసాడు.

1వ పాఠం జూన్ 25-జూలై 1

# గొఱ్ఱెల కాపరి యొక్క వేదన

## సబ్బాతు మధ్యాహ్నము జూన్ 25

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యాలు : కీర్తన 23; రోమా 12:18-21.**

**కంఠతవచనం : "నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతిమార్గములలో నన్ను నడిపించుచున్నాడు" (కీర్తన 23:3).**

సోఫీ తన పడక గది తలుపునకు ఆనుకొని కన్నీళ్ళను కార్చుతూ నెమ్మదిగా నేల మీదకు జారి కూర్చున్నది. దుఃఖమును ఆపుకొనలేక వెక్కి వెక్కి ఏడ్చుచున్నది. "తన యెడల అతడు ఆవిధముగా ఎట్లు ప్రవర్తించగలడు? అనే ప్రశ్న ఆమెను వేదనకు గురి చేస్తున్నది. తన హృదయము పగిలిపోయే ఒక వార్త అప్పుడే అందుకున్నది. ఆమె ఎంతగానో నమ్మి, గౌరవించిన స్నేహితుడు ఆమెకు గౌరవభంగము కలిగే రీతిలో భయంకరమైన కాలక్షేపపు మాటలు ప్రచారము చేస్తున్నాడు. ఆవేదనలో తన పడక మీదున్న బైబిలును తానందుకొని దానిని తెరచినప్పుడు బాగా పరిచయమైన కొన్ని మాటలు ఆమె కంటపడినవి.

"నా ప్రాణమునకు ఆయన సేదదీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతిమార్గములలో నన్ను నడిపించుచున్నాడు. గాడాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను నీవు నాకు తోడైయుందువు. నీ దుడ్డు కఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును" (కీర్తన 23:3,4).

ఆ మాటలు తనకు ఊరటనిచ్చుటలేదు. గాని వాటిలోని భావమునుండి తప్పించుకొనలేకపోవుచున్నది. ఆ కీర్తనలో పేర్కొనబడిన గొఱ్ఱెల కాపరి తన గొఱ్ఱెలను నీతిమార్గములో నడిపించుటకు ప్రయత్నిస్తున్నాడు కాని ఆ మార్గములు కూడా మరణ ఛాయలు గల గాడాంధకారపు లోయలలోనికి దారి చూపిస్తున్నాయి. అయితే తనను మోసము చేయుచున్న ఒక స్నేహితుని వలన ఎదురౌచున్న గాఢాంధకారపు లోయకు సంబంధించిన అనుభవము ద్వారా దేవుడు తనను నీతిమార్గములో నడిపించుటకు సహాయపడుతున్నాడా? అనే ఆలోచన ఆమెలో కలిగింది.

**ఈ వారం పాఠం యొక్క ముఖ్య తలంపు :** నీవు ఆత్మీయముగా ఎప్పుడు ఎక్కువగా ఎదిగావు? సుఖమైన సమయములలోనా? లేక కష్ట సమయాలలోనా?

– జూలై 2, సబ్బాతుదినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి?

## ఆదివారం జూన్ 26

**యాత్రలో నడిపించుటకు : గొఱ్ఱెలకాపరి**

**"యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు" (కీర్తన 23:1)**

దేవునికి సంబంధించిన ఒక చిత్ర పటాన్ని గీయమని కొంతమంది చిన్న పిల్లలని అడిగారు. అందరూ కూడా ఒక గుండె కాయను ఆ చిత్రములో ఏదో ఒకచోట చూపిస్తూ దేవుని బొమ్మ వేసారు. ఎందుకు ఆవిధముగా వేసారని ఆ చిన్న పిల్లలనడిగినప్పుడు వారిలో అందరూ "దేవుడు ప్రేమయై యున్నాడు" అని జవాబిచ్చారు.

అన్నీ మంచిగా ఉన్నప్పుడు దేవునిని గూర్చి మంచి అభిప్రాయము కలిగియుండుట సర్వసాధారణమైన విషయమే. అయితే మనము వయస్సునందు ఎదిగే కొలది జీవితము కష్టాలను ఎదుర్కొనుచున్నపుడు దేవుని గూర్చిన మన అభిప్రాయము మారుతూ ఉంటుంది. అయితే దేవుడు మార్పు చెందేవాడు కాదు (హెబ్రీ 13:8; యాకోబు 1:17)గాని మనము మార్పు చెందుదుము.

పాతనిబంధన కాలములో ప్రజలు గుడారములలో జీవించుచు ఆయా ప్రాంతాలలో సంచరించుచూ జీవిస్తూ ఉండేవారు. ఆ నేపథ్యములో దేవుడు తన చిన్న బిడ్డలను నడిపిస్తూ కాపాడుచుండేవాడనే విషయాన్ని కీర్తన 23లో సాదృశ్యముగా ఒక గొఱ్ఱెలకాపరిని పరిచయము చేయడం జరిగింది. అయితే గొఱ్ఱెల కాపరి సాదృశ్యము పాతనిబంధన మరియు క్రొత్త నిబంధనకాలములో కూడా వర్తిస్తుంది. కీర్తన 23ను పరిశీలించకముందు గొఱ్ఱెలకాపరి యొక్క పనితీరును గూర్చి మరియు అతని స్వభావమును గూర్చి బైబిలంతటిలో ఏమి వ్రాయబడినదో తెలుసుకొనుట ఎంతైనా అవసరము.

**ఈ క్రింద ఇవ్వబడిన వాక్యములలో గొఱ్ఱెలకాపరిని గూర్చి నీవేమి నేర్చుకున్నావు?**

యెషయ 40:11 ..........................................................................

యిర్మియా 23:3,4 ......................................................................

యెహెజ్కేలు 34:12 ....................................................................

యోహాను 10:14-16 ....................................................................

1 పేతురు 2:25 .........................................................................

**గొఱ్ఱెల కాపరి తన గొఱ్ఱెలను సంరక్షించుట కొరకు అతడేమి చేస్తాడో తెలుసుకొనుటకు కీర్తన 23ను చదివి తెలుసుకొనండి.**

కీర్తన 23:2 ..........................................................................

కీర్తన 23:3 ..........................................................................

కీర్తన 23:4 ..........................................................................

కీర్తన 23:5 ..........................................................................

కీర్తన 23:6 ..........................................................................

**పైన పేర్కొనిన ప్రకారము నిన్ను సంరక్షించుటకు ఒకరున్నారని తెలుసుకొనుట ద్వారా**

**నీకు ఎటువంటి భావము కలుగుచున్నది? అతడు లేక ఆమె యొక్క స్వంత సమస్యల వలన దేవుని గూర్చి స్పష్టమైన అవగాహన లేని వారిని నీవెట్లు ప్రోత్సహించగలవు?**

సోమవారం జూన్ 27

## యాత్రలోని ప్రదేశములు

"నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతిమార్గములలో నన్ను నడిపించుచున్నాడు" (కీర్తన 23:3),

"నీతిమార్గములను" గురించి (కీర్తన 23:3) ఊహించుకోండి. మనముందు అవి చాలా దూరముగా ఉన్నట్లు కనిపిస్తాయి. ఆ మార్గము ఎక్కడ అంతమవుచున్నదో చూడలేము. కాని ఆ మార్గము యొక్క చివర దేవుని గృహమున్నది. కొంచెము సమీపముగా మీ మార్గము పరిశీలించినట్లయితే అది మిమ్ములను ఎక్కడికి నడిపిస్తుందో మీరు చూడగలరా? కొన్ని ప్రదేశాలను మీరు స్పష్టముగా చూడవచ్చును. అయితే కొన్ని ఇతర ప్రాంతములు కొన్ని కొన్ని అడ్డంకుల వలనను లేక ప్రమాదకరమైన ఆటంకములవలనను అవి మీకు కనబడకపోవును. కొన్ని సందర్భాలలో ఎత్తైన కొండల వరుస వలన ఆ మార్గము కనబడకుండా అదృశ్యమగును. కొన్ని మార్గముల వెంబడి సులభంగా నడవ వచ్చును. కొన్ని మార్గములు కష్టముగా ఉండును. అగమ్యగోచరమైన మార్గములలో ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి వాగ్దాన భూమికి నడిచి వెళ్ళారు. అటువంటి ప్రయాణమును గూర్చే ఈ కీర్తన వివరించుచున్నది.

**నీతిమార్గముల గుండా గొఱ్ఱెలు దేవుని గృహమువైపు ప్రయాణము చేయుచుండగా దావీదు కనుగొనిన ప్రదేశములను కీర్తన 23లో గుర్తించండి.**

..........................................................................................

..........................................................................................

అయితే ఈ మార్గములను "నీతిమార్గములు" లేక సక్రమమైన మార్గములు" అని ఎందుకు పిలువబడినవి. వాటిని ఆ విధముగా పిలుచుటకు 4 కారణములున్నవి.

1. అది నిజమైన గమ్యమునకు అనగా గొఱ్ఱెల కాపరి గృహమునకు నడిపిస్తాయి. కాబట్టి వాటిని సక్రమమైన మార్గములు అని పిలువబడెను.
2. అవి సరియైన వ్యక్తితో అనగా గొఱ్ఱెల కాపరితో మాత్రమే సామరస్యముగా ఉండుటకు సహాయపడును. కాబట్టి ఆ మార్గములు సరియైనవి.
3. అవి మనలను సరియైన వ్యక్తులనుగా అనగా గొఱ్ఱెలకాపరిని పోలిన వారినిగా తర్ఫీదు చేస్తాయి కాబట్టి అవి సక్రమమైన మార్గములని పిలువబడెను.
4. మనము దేవునికి మహిమను చెల్లించే సరియైన మనుష్యులనుగా చేయుటకు అవి సక్రమమైన సాక్ష్యమును మనకు అందిస్తాయి. కాబట్టి అవి సరియైనవి.

ఆ మార్గముల వెంబడి వెళ్ళునపుడు ఆ ప్రయాణం సులభమైనా లేక కష్టమైనా కావచ్చు గాని, అవి మాత్రము "నీతిమార్గములే" అందులో ఎట్టి సందేహము లేదు.

దేవుడు మనలను నడిపిస్తున్నాడు అంటే ఏదో ఒక వస్తువును జాగ్రత్తగా అది చేరవలసిన గమ్యమునకు చేర్చడము వంటిదికాదు. లేక మనకు త్రోవ చూపి సంరక్షించుట మాత్రమే కాదు. దేవుని యొక్క నడిపింపు చాలా విశిష్టతతో కూడుకున్నదైయుంటుంది. ఉదా: బైబిలులో దేవుడు అబ్రహామును తన వాగ్దానముల ద్వారా నడిపించాడు లేక ఇశ్రాయేలు ప్రజలను వారి త్రోవలో నడిపించుటకై పగటి వేళ మేఘ స్తంభములోను, వారికి వెలుగునిచ్చుటకై రాత్రివేళ అగ్నిస్తంభములోను ఉండి దేవుడు నడిపించెను. వారిని నడిపించేటపుడు అది వారికి ఎల్లపుడు నీతిమార్గమును అనుసరించి జీవించుటకు అవసరమైన తర్ఫీదును ఆయన అనుగ్రహించుచున్నాడని భావము.

**నీ జీవితమునకు నీతిమార్గములు అవసరమైయున్నవని గొఱ్ఱెల కాపరికి తెలుసు అని నీవు గుర్తించుచున్నావా? క్రీస్తు యొక్క స్వభావమును ప్రతిబింబించుటకు నీకు ఎదురయ్యే శోధనలు నీ జీవితమును ఏవిధముగా మార్పు చేస్తున్నవి?**

మంగళవారం జూన్ 28

## ఊహించని తిరుగు ప్రయాణం-1 : లోయ

"గాఢాంధకారపులోయలో నేను సంచరించినను, ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు నీ దుడ్డుకఱ్ఱయు నీ దండము నన్ను ఆదరించును" (కీర్తన 23:4).

చల్లని నీటి యోరన ఉన్న గడ్డి ప్రదేశములో నీతి మార్గములు వేయబడి ఉంటే, ఆ మార్గముగుండా ప్రయాణించుట ఎంతో ఆహ్లాదకరముగా ఉంటుంది. అయితే దావీదు వివరించిన మార్గము అటువంటిది కాదు. ఆ మార్గముల వెంబడి మరణఛాయలు గల లోయలున్నవి. అట్టి ప్రదేశమును సంచరించుటకు మనము ఏమాత్రము వేగిరపడము. ఇశ్రాయేలులో సంవత్సరములోని కొన్ని సమయాలలో ఎండిపోయిన ఏటి గర్భము మరియు కొండల సందులలో అకస్మాత్తుగా మెరుపు వరదలతో (వర్షాకాలము) నిటారుగా పైకి క్రిందకు ఉండి చీకటిగా ఉంటాయి. అందువలననే ఆ మార్గములను మరణఛాయలుగల గాఢాంధకారపు లోయలుగా వర్ణింపబడుచున్నవి.

**నీకు కలిగిన మరణఛాయగల లోయలలో సంచరించిన అనుభవమును గూర్చి ఆలోచించుము. అది ఏవిధముగా ఉంది? అక్కడ మీకు కాపరి అండగా ఉన్నా మీకు భయమేసిందా? ఆ సమయములో బైబిలులోని ఏ వాక్యాలు ప్రశస్తమైనవిగా అనిపించాయి? ఎందువలన?**

..........................................................................................

..........................................................................................

**గొఱ్ఱెలు ఆ లోయలలో చిక్కుకున్నాయని అనుకుంటున్నావా? ఆ గొఱ్ఱెలు వాటంతటవి**

**లోయలోనికి వెళ్తాయా? లేక కాపరే వాటిని ఆ ప్రదేశానికి నడిపించాడా? మీ జవాబును సమర్థించుకోండి.**

ఎలిజబెత్ ఇలియట్ ఈ విధముగా వర్ణించింది. మరణ ఛాయ కలిగిన లోయలోనికి వెళ్ళిన గొర్రెపిల్ల, అయితే తనను మోసపూరితముగా అక్కడకు కాపరి నడిపించాడని అనుకొనవచ్చును. భయపడకుండునట్లు నేర్చుకొనుటకు, ఆ గొర్రెపిల్లకు ఆ అనుభవము అవసరమైయుంది. ఆ స్థితిలో గొర్రెపిల్ల వెంబడి కాపరి ఉన్నాడు" –ప్రేమ కొరకు అన్వేషణము (గ్రాండ్ రాపిడ్. ఎమ్ ఐ, రెవెల్ బుక్సు 1996) పుట 218.

**ప్రమాదమనే లోయలోనికి నీవు మోసపూరితముగా నడిపింపబడినావని నీవెపుడైనా భావించావా? ఆ సమయములో నీవెట్లు దేవునికి జవాబిచ్చావు? గాఢాంధకారపు లోయలోనికి నడిపించినపుడు ఎందువలన కాపరిని నిందిస్తాము?**

బుధవారం జూన్ 29

## ఊహించని తిరుగు ప్రయాణం-2; భోజనము సిద్ధపర్చబడెను

"నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు. నూనెతో నా తల అంటియున్నావు. నా గిన్నె నిండి పొర్లుచున్నది" (కీర్తన 23:5).

మన జీవితాలలో ఏదో ఒక సమయాన్న అనివార్య పరిస్థితులలో శత్రువులమధ్యకు చేరుకుంటాము. వారితో నీవెట్లు ప్రవరిస్తావు? నీ పనిని నాశనము చేయాలని చూసేవారిపై లేక నిన్ను గాయపరచినవారిపై కక్ష ఎట్లు తీర్చుకోవాలని రాత్రింబవళ్ళు ఆలోచించిన సమయముందా? శత్రువులపై కక్ష ఏవిధముగా తీర్చుకోవాలో గ్రహించుటకు క్రైస్తవులకు కష్టమైన విషయమే.

**నీ జీవితములో నీకు ఎదురైన శత్రువులు ఏ విభాగమునకు చెందిన వారు? నిన్ను గాయపర్చాలని చూసే వారి యెడల లేక నీవు సంరక్షించేవారి యెడల నీవు ఏవిధముగా స్పందించావు? యేసు మత్తయి 5:44లో పలికిన మాటలకు లేక పౌలు రోమా 12:18–21లో పలికిన మాటలకు నీవు ఏవిధంగా స్పందించావు?**

..............................................................................................

..............................................................................................

కీర్తన 23:5లో శత్రువులతో మనము ఏవిధముగా ప్రవర్తించాలో దావీదు మనకు చూపిస్తున్నాడు. తన పక్షమున దేవుడు ఏమి చేయుచున్నాడో అనే విషయాల మీద తన దృష్టిని పెట్టి తన శత్రువుల యొక్క ఉనికే తనకు తెలియదన్నట్లు ఊరుకున్నాడు. అదే సమయములో దేవుడు అతనికి విందు భోజనమును తయారు చేయిస్తున్నాడు.

దావీదు మనకు తెలిపిన సంప్రదాయము ప్రకారము ఎవరైనా ఒక గౌరవనీయుడైన అతిథి విందు భోజనమునకు హాజరగుచున్న యెడల ఆ విందు యజమాని అతిథిగా వచ్చిన

వ్యక్తి తలపై నూనె పోసి అతనిని అభిషేకించి విందునకు ఆహ్వానిస్తాడు. అక్కడ వాడబడిన నూనె ఒలీవనూనె మరియు పరిమళ ద్రవ్యము యొక్క కలయికతో తయారు చేయబడినది. అటు తరువాత ఆ అతిథిని ఎన్నడూ ఏ ఒక్కరూ తినలేనంత ఆహారము ముందు కూర్చోబెట్టుదురు.

**ఇక్కడ కీర్తన 23:5లో పేర్కొనబడిన మూడు వస్తువుల పేర్లను గమనించినట్లయితే (భోజనపుబల్ల, నూనె, గిన్నె) చివరికి లోయలో కూడా దేవుడు మనకు ఏవిధముగా ఆహారమును సిద్ధపరుస్తాడో అనే విషయాన్ని జ్ఞాపకము చేస్తున్నాడు కదా?**

..........................................................................................

..........................................................................................

పౌలు మనకు గుర్తు చేస్తున్నట్లు "ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము (ఎఫెసి 6:12). మన శత్రువుల జాబితాలో కొందరు మన కంటికి కనిపించేవారు ఉంటారు. మనకు ఇష్టమున్నను, లేకున్నను మనమందరము ముట్టడి వేయబడియున్నాము. అయినప్పటికి మనము గొఱ్ఱెల కాపరితో ఉన్నప్పుడు, కనిపించే శత్రువైనను, లేక కనిపించని శత్రువైనను ఏ ఒక్కరు కాపరి మనకు అనుగ్రహించిన దానిని మననుండి దొంగిలించలేరు.

**నీవు శత్రువులతో ముట్టడించబడినపుడు ఏవిధముగా గొఱ్ఱెల కాపరి నిన్ను సంరక్షించాడో ఒకసారి ఆలోచించుకో. అట్టి కష్ట సమయాలలో కూడా కాపరికి వందనస్తుడవై యుండుటకు నీవేమి చూడగలిగితివి?**

## గురువారం జూన్ 30

## ప్రయాణము నిమిత్తమై ఒక వాగ్దానము చేయబడెను

"నేను బ్రదుకు దినములన్నియు కృపా క్షేమములే నావెంట వచ్చును చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" (కీర్తన 23:6)

మనము లోయలో ఉన్నప్పుడు లేక శత్రువులతో ముట్టడి వేయబడినప్పుడు ఒంటరిగా విడువబడితిమనే భావము మనలో కొందరికి కలుగవచ్చును. దేవుడు మనకు అవసరమునకు మించి చేస్తున్నాడనే విషయాన్ని మనము ఎల్లవేళలా గుర్తుంచుకోకపోవచ్చు. దేవుడు మనకు నిజముగా సహాయము చేయుచున్నయెడల మనము ఇప్పుడు ఈ పరిస్థితిలో ఎందుకుంటామని అనుకొనేవారుంటారు. అయితే దావీదు మాత్రము ఆ దృష్టితో ఎన్నడు చూడలేదు.

**దావీదుకెదురైన కష్ట సమయాలలో రెండు విషయాలు తప్పనిసరిగా జరుగుతాయని నమ్మి ఆయన కీర్తన 23:6లో వెల్లడించినవి ఏమిటి? ఎఫెసి 1:4, 2పేతురు 1:10 మరియు హెబ్రీ 11:13-15 కూడా చూడుడి.**

.................................................................................................

.................................................................................................

కొన్ని తర్జుమాలలో అదే విషయాన్ని “మంచితనము” మరియు “అపజయము పొందని ప్రేమ” అనగా దేవుని యొక్క నిబంధన వాగ్దానమునకు చెందిన ప్రేమ నా జీవితకాలమంతయు నన్ను వెంబడించును అని వ్రాయబడెను. అయితే మొదటి క్రియాపదము చాలా బలమైన భావమును కలిగియున్నది. హెబ్రీ పత్రికలో కూడా అదే క్రియా పదము వాడబడినది. ఇంకా ఆది 14:14; యెహోషువ 10:19 మరియు 1 సమూయేలు 25:29 కూడా చూడుడి.

**నిన్ను దేవుని మంచితనము మరియు అపజయము పొందని ప్రేమ వెంబడించుచున్నదనే భావము నీలో ఎటువంటి ఊహలకు దారితీస్తున్నది? ఈ విధముగా దేవుడు మనలను సంరక్షిస్తున్నాడని దావీదు వివరించుటలో ఆయన భావమేమైయున్నది?**

.................................................................................................

.................................................................................................

లోయ ఎంత లోతుగా ఉన్నను లేక శత్రువు ఎంత బలముగా ముట్టడి వేయుటకు ప్రయత్నించినను దేవుని యొక్క మంచితనము మరియు మన యెడల ఆయనకున్న నిబంధన సంబంధమైన ప్రేమ మనలను వెంబడించుచు మన జీవన యాత్ర చివరివరకు కాపాడుతూనే ఉంటుందని దావీదు సాక్ష్యమిస్తున్నాడు. అదే తలంపును మన హృదయములో భద్రపర్చుకొనవలసియున్నది.

కొన్ని సందర్భాలలో మనము సంరక్షించే వారిలో అనేక ప్రశ్నలు తలెత్తుతూ ఉంటాయి. వాటికి మనము వేదాంత సంబంధమైన జవాబుల కొరకు వెతకకుండా దావీదు కీర్తన 23:6లో చూపినట్లు దేవునియందు వ్యక్తిగత నమ్మకముతో మనము విశ్వాసమును బలపర్చవలసియున్నది.

**దేవుని యెడల నీకున్న వ్యక్తిగత జ్ఞానముతో ఆయన మంచితనము మరియు అపజయము చెందనటువంటి ఆయన ప్రేమ మనలను వెంబడించుచున్నదనే సత్యమును నీవు ఏవిధముగా చూపించగలవు? బైబిలు నుండి ఏ ఆధారమును నీ జవాబునకు జత చేయగలవు? అదే విషయాన్ని ఇతరులతో నీవెట్లు పంచుకొనగలవు? మనలను వెంబడిస్తున్న ప్రేమకు సిలువ అన్నిటికన్నా ఏవిధంగా మాదిరైయుంది?**

**శుక్రవారం** **జూలై 1**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 4లో నుండి “గృహములో మిషనెరీలు” పుట 143 మరియు “యుగయుగాల ఆకాంక్ష నుండి దైవికమైన గొఱ్ఱెల కాపరి” పుటలు 476-484.

“ఎవరైతే చివరికి విజయము సాధిస్తారో, వారి యొక్క మత సంబంధమైన జీవితములో

ఎన్నో శోధనలు ఎదురవుతాయి. అటువంటి స్థితిలో వారి యొక్క నమ్మకమును విడువకూడదు. క్రీస్తు యొక్క పాఠశాలలో వారు పొందే ఉపదేశము లేక తర్ఫీదులో ఇదొక భాగమైయున్నది. జీవితములో ఉన్న కల్మషమంతయు పరిశుద్ధము చేయవలసియున్నది. దేవుని సేవకుడు తన మీద శత్రువు కలుగజేయు దాడులన్నింటిని సహించవలసి యున్నది. "దేవుని సేవకుని మార్గములో సాతానుడు ఏర్పాటు చేసే అవరోధములను అధిగమించవలసియున్నది.

అయితే మీరు మీ కష్ట సమయాలలో క్రింద చూడకుండా పైకి చూచినయెడల మార్గమధ్యములో నీవు స్పృహ తప్పిపడిపోదువు. యేసు తన సంరక్షణాహస్తమును నీవైపు చాపి నిన్ను సాతాను యొక్క ప్రమాదములనుండి కాపాడును. ఆయనయందు నమ్మకముతో నీవు నీ చేతిని ఆయన చేతిలో పెట్టవలసియున్నావు. మరియు ఆయన నిన్ను నడిపించే విధముగా నీవు అనుమతించాలి. నీవు నమ్మకస్తుడుగా ఉన్నపుడు నీకు నిరీక్షణ కలుగను.

'క్రీస్తు యొక్క సహాయముతో నీవొక బలమైన వ్యక్తిగా మార్పు చెందెదవు. నీ ప్రవర్తన పరిపూర్ణమగును. దేవుడు తన ఏకైక కుమారుని మనకు అనుగ్రహించుట ద్వారా మనకు అత్యున్నతమైన వరమును అందించెను. ఆయన ప్రవర్తనలో ఉన్న పరిపూర్ణతను మనకిచ్చిన రాజ్యములో ఒక గృహము కొరకు మనలను సిద్ధము చేయును. ఎలెన్ జివైట్, యౌవనస్తులకు వర్తమానములు, పుటలు 63,64.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మన క్రైస్తవ జీవితములో ఎదురయ్యే శోధనలు క్రీస్తు పాఠశాలలో ప్రవర్తనా నిర్మాణమునకు సహాయపడేవై యున్నవని నీవు గుర్తించావా?

2. మనము లోయలో ఉన్న ఇతరులకు అందించే సహాయము, ప్రోత్సాహము మరియు సుఖము ద్వారా గొఱ్ఱెల కాపరి వారికి సహాయపడుతున్నట్లుగ పరిగణింపబడుతుందని మీకు తెలుసా? ఒక సంఘముగా ప్రభువు ఉపయోగించిన మార్గములను ఉపయోగించుకొనుట ద్వారా అవసరతలో ఉన్న వారికి సహాయపడవచ్చును. ఆవిషయాలేమిటి?

3. మీ తరగతిలో ప్రతి వారిని అడిగి వారి జీవితములో దేవుని మంచితనము మరియు కృప ఏవిధముగా వారికి సహాయపడినవో తెలుసుకోండి. ఒకరి అనుభవము నుండి మరొకరు ఏమి నేర్చుకొనగలరు?

4. క్రీస్తు శ్రమలలో ప్రవేశించిన తరువాత ఆయన గడిపిన చివరి గడియలను గూర్చి ఆలోచించుడి. ఆయన చూపించిన మాదిరి నుండి మనము ఏమి నేర్చుకొనగలము?

❖❖❖

**2వ పాఠం** **జూలై 2-8**

# ఎదురయ్యే వేదనలు

**సబ్బాతు మధ్యాహ్నము** **జూలై 2**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : 1పేతురు 4:12-19; 5:8-11; రోమా 1:21-32; యిర్మీయా 9:7-16; 2కొరింథి 12:7-10.**

**కంఠతవచనం: "ప్రియులారా మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదో యొక వింత సంభవించినట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలుపరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించునిమిత్తము క్రీస్తు శ్రమలలో మీరు పాలివారైయున్నంతగా సంతోషించుడి" (1పేతురు 4:12,13).**

రసాయన శాస్త్ర ప్రయోగశాలలో తరచుగ వివిధ రకాలైన పదార్థములను చిన్న గిన్నెలో వేసి అమితమైన వేడి వచ్చే వరకు ఆ గిన్నె క్రింద మంట పెట్టుదురు. ఆ గిన్నె వేడెక్కే కొలది, దానిలో ఉన్న పదార్థాలను బట్టి కొన్నిసార్లు అది కరగిపోవచ్చును. చుయ్ మని ధ్వని చేయవచ్చును. నురుగులాంటి స్రావంగా మారవచ్చు లేదా ప్రకాశవంతముగా కాలిపోవచ్చు. అట్టి ప్రయోగాలకు వాడే గిన్నెను మూస అని పిలుస్తారు.

ఒక మూసను గురించి నిఘంటువులో ఈ క్రింది విధంగా నిర్వచించబడెను.

1. పదార్థమును అధికమైన వేడి సహాయముతో కరగబెట్టుటకు ఉపయోగించెడి పాత్ర లేక గిన్నె.
2. తీవ్రమైన పరీక్ష లేక
3. ఒక విషయములో మార్పు చేయుటకు గాని లేక అభివృద్ధి చేయుటకు గాని తీవ్రమైన ఒత్తిడిని తీసుకొని రాగలిగే శక్తి కలిగిన బృందము చేయు ప్రయత్నము.

పైన పేర్కొనిన ఈ నిర్వచనాలు మన ఆధ్యాత్మిక జీవితములో ఏమి సంభవించవచ్చును అనే విషయముతో కొంత పరిజ్ఞానమును కలిగించుటకు సహాయపడును. మన నడవడికలోగాని, స్వభావములోగాని మార్పు తీసుకొనివచ్చుటకు ఉపయోగకరముగా ఉండే ఏవిధంగా మనంతట మనము తీసుకొనే నిర్ణయాలను బట్టి అది మనలను తీవ్రమైన ఒత్తిడిలోనికి నడిపించవచ్చును లేక తీవ్రమైన పరీక్షలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ విధముగా ఎదుర్కొనే పరిస్థితులకు కొన్ని కారణాలను ఈ వారం పాఠం ద్వారా అధ్యయనం చేయబోవుచున్నాము. దేవుడు మన జీవితాలలో ఏమి చేయుచున్నాడనే విషయములో కొంత వరకు తెలుసుకొనుట ద్వారా శోధనలో పడినప్పుడు, వేదనలు ఎదురైనపుడు వాటికి ఏవిధముగా స్పందించాలో అనే భావము కలుగుతుంది.

**ఈ వారం పాఠం యొక్క ముఖ్య తలంపు :** మన జీవితాలలో ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులకు కారణములు ఏమిటి?

– జూలై 9, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనం చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **జూలై 3**

## ఆశ్చర్యమును కలుగజేయు విషయాలు

"ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్ని వంటి మహా శ్రమను గూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి" (1పేతురు 4:12). అనేక రీతులలో ఆశ్చర్యమును, వేదనను కలుగజేయు విషయాలు రావచ్చు. నీవు నడచి వెళ్ళు మార్గములోనే ఒక కారు వేగముగా ఢీకొనవచ్చును. నీ ఉద్యోగం పోయిందనే వార్త నీకు అకస్మాత్తుగా తెలియపర్చబడుతుంది. నీవు చేయించుకున్న ఒక వైద్య పరీక్షలో నీవు ఊహించని చెడు వార్త వినిపించవచ్చును. నిన్ను ప్రేమించిన వ్యక్తి నీకు ద్రోహం చేయవచ్చు. ఈ విషయాలన్నీ కలిగించే బాధతో పాటు అవి అకస్మాత్తుగా సంభవిస్తాయి.

ఈ వారం ప్రత్యేకించి మనకు ఎదురయ్యే కొన్ని పరిస్థితులను గూర్చి లేక మూసలను గూర్చి ముఖ్యముగా అవి అకస్మాత్తుగా సంభవించకముందే మనము వాటిని అన్వేషించ బోవుచున్నాము.

మరొకసారి నేటి కొరకు ఏర్పాటు చేయబడిన పేతురు పత్రికలోని మాటలను పరిశీలిద్దాము. 1పేతురు 4:12లోని "ఆశ్చర్యపడకుడి" అనే మాటకు సమానమైన గ్రీకు పదానికి "పరాయి" లేక "ఇతరమైన" అనే భావమును కలిగియున్నది. ఇక్కడ పేతురు విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రైస్తవ అనుభవములో శ్రమలు లేక అగ్ని పరీక్షలు వంటివి ఉండవు. లేక అవి వారికి చెందనట్టివి అని నమ్మకూడదని చెప్పుచున్నాడు. అంతేకాక హేతుబద్ధముగా ఆలోచించినచో అవి క్రైస్తవ జీవితానికి సాధారణమైనవేయనియు అవి తప్పనిసరిగ వారికి సంభవిస్తాయని అనుకొని ఎదురు చూడాలి.

"అగ్ని పరీక్షలు" లేక "తీవ్రమైన శ్రమలు" అనే మాట వేరొక గ్రీకు పదము నుండి వస్తున్నవి. మరియు కాలుట అనే భావము ఆ మాటకుంది. ఆ భావము నిచ్చే మాటనే వేరొక చోట "కొలిమి" అని తర్జుమా చేయబడినది. మన విశ్వాసమును కాపాడుకొనుట కొరకు శ్రమలు అనుభవించవలసియుందనే "అనుభవము" లోహములను అగ్నితో శుద్ధి చేసే విధానమును పోలి ఉంటుంది. దానినే "మూస"లో వేసి కరిగించుట అని కూడా పిలుతురు.

**1పేతురు 4:12-19 చదువుడి. ఇక్కడ పేతురిచ్చే వర్తమానము ఏమిటి?**

జీవితములో శ్రమ కలగడమును గూర్చి మనలో అనేకులు ఆశ్చర్యానికి గురవుతుంటారు. క్రైస్తవ జీవితమును గూర్చి మన అభిప్రాయము కొంచెము వేరుగా ఉంటుంది. దానికి రెండు వైపులున్నవి. మంచివాడైన దేవుడు; చెడ్డవాడైన సాతానుడు. చాలాసార్లు మనకు మంచి అనిపించే వాటిని దేవుని ఖాతాలోనికి, చెడు అనబడే విషయాలను సాతాను ఖాతాలోనికి జమ చేస్తూ ఉంటాము. అయితే జీవితము మనము ఊహించినంత సుళువేమీ కాదు. పక్షాన ఏముండాలి?

సాతాను పక్షమున ఏముండాలని నిర్ణయించడానికి మన భావోద్వేగాలను ఉపయోగించరాదు. కొన్ని సమయాలలో దేవునితో నడచుట సవాళ్ళతో కూడుకొన్నది మరియు కష్టమైనది. సాతానును వెంబడించుట వలన గొప్ప ప్రతిఫలము లభించవచ్చును. యోబు నీతిమంతుడైనను ఎన్నో శ్రమలను ఎదుర్కొన్నాడు. యోబు దేవుడిని ఈవిధముగా ప్రశ్నించాడు. "భక్తిహీనులు ఏల బ్రదుకుదురు? వారు వృద్ధులై బలాభివృద్ధి ఏలనొందుదురు?" (యోబు 21:7).

**క్రీస్తు కొరకు విశ్వాసముతో నిలువబడుటవలన అగ్ని పరీక్షలు రావచ్చునని పేతురు హెచ్చరించాడు. అగ్ని పరీక్షలు వేరేవిధంగా కూడా రావచ్చును. అందులో సందేహము లేదు. శ్రమలతో కూడిన పరీక్షలను ఎదుర్కొనుటకు నీ స్నేహితులను సిద్ధపర్చుటకు 1 పేతురు 4-12-19 నీకెట్లు సహాయపడును?**

## సోమవారం జూలై 4

## సాతాను వలన కలుగు వేదనలు

"నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి. మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1పేతురు 5:8).

**పై వాక్యమును చదువుడి. దానిలో మనకున్న వర్తమానమేమి? ఆ మాటలను నేను ఎంత తీవ్రముగా పరిగణించాలి? అవి చాలా తీవ్రమైన మాటలని తెలియజేయుటకు నీ జీవితములో ఏమి చేస్తావు?**

ఆకలిగా ఉన్న సింహాన్ని మీరెపుడైనా చూసారా? ఆ దృశ్యము చూచుటకు చాలా భయంకరముగా ఉంటుంది. అది తినాలనుకున్నదేనినైనను బందీగా పట్టుకొని తినివేస్తుంది. మన విరోధియైన సాతానుడు కూడా గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడని పేతురు మనలను హెచ్చరించుచున్నాడు. మనలను హతమార్చాలనే గాఢమైన కోరిక సాతానుకుందని చుట్టు ప్రక్కలున్న పరిసరాల ప్రభావాలను బట్టి గ్రహించగలం. మరణము, వేదనలు, తగాదాలను సృష్టించే పరిస్థితులు మరియు నీతినియమములు ఉల్లంఘించుటకు అనువైన వక్రమార్గములు ప్రతిచోట ఉన్నవి. సాతాను యొక్క క్రియలను చూడకుండా తప్పించుకొనలేము.

**1పేతురు 5:8-11 చదువుడి. సాతాను యొక్క గర్జనలకు క్రైస్తవులు ఏవిధముగా స్పందించాలి?**

.......................................................................................

.......................................................................................

**శ్రమలను ఎదుర్కొనే వారిని గూర్చి దేవుని వాగ్దానమేమి? (1పేతురు 5:10)**

క్రైస్తవ విశ్వాసము మీద సాతానుడు చేసే దాడులను ఉద్దేశించి పేతురు ఈ మాటలను వ్రాసాడు. అయితే మనము ముందుగానే గ్రహించినట్లు సాతానుడు అనేక విధాలుగా మన మీద పోరాటము చేయుచున్నాడు.

సాతాను యొక్క శక్తి సామర్ధ్యాలను గూర్చి మనకు తెలిసినను యేసు సాతానును ఓడించి యున్నాడు గనుక, మనము యేసును హత్తుకొని విశ్వాసములో కొనసాగినంతవరకు సాతాను విషయమై భయము చెందనవసరములేదు. సాతాను చేతులలో మనకు ఎన్నడూ అపజయముండదు. సిలువను బట్టి క్రీస్తు యొక్క విజయము మన విజయముగా పరిగణింపబడుతుంది.

**సాతానుడు ఏయే విధాలుగా మనకు వేదనలు కలుగజేస్తూ ఉంటాడు? మనము పాపలోకములో జీవిస్తున్నాము కాబట్టి సాతానుడు మన యెడల కలుగజేయు ఉపద్రవముల విషయమై మనము ఎందువలన ఆందోళన చెందనవసరము లేదని 1పేతురు 5:8-11 మనకు బోధించుచున్నది.**

మంగళవారం జూలై 5

## పాపము వలన కలుగు వేదనలు

"దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది" (రోమా 1:18).

మనము చేసే ప్రతి పనికి పర్యవసానము ఉంటుంది. "ఐస్‌క్రీమ్"తో మనము ఎండలో నిలువబడితే అది కరిగిపోవును. కారణము మరియు ఫలితము ఈ రెండు జంటగా ప్రయాణిస్తాయి. పాపము విషయములో మనము ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నను ఒకసారి పాపము చేసినపుడు దాని ఫలితము ఎల్లపుడు ఒకేలా ఉంటుంది. తగిన ప్రతిఫలాన్ని (శిక్షను) అది కోరుతుంది. పాపము చేసిన వారిని ఏవిధముగా శిక్షించాలనే ఉద్దేశముతో దేవుడు పరలోకములో కూర్చొని యుండుట లేదు. పాపము వలన వచ్చిన ఫలితాలు దేవుని వలన కలిగేవి కాదు. అవి పాపములో అంతర్గతముగా ఉంటాయి. అందుచేత పాపము చేసినపుడు వాటి ఫలితాలు వెంటబడుతూ ఉంటాయి.

పాప ఫలితాలను అనుభవించకుండా జాగ్రత్త పడుతూ పాపము విషయములో దేవునిని మోసము చేయుటకు మానవులముగా మన ప్రయత్నాలు చేస్తూ ఉంటాము. అయితే అది ఎన్నటికి సాధ్యమయ్యే విషయము కాదు. పాపము చేయుట వలన కలిగే ఫలితాలు నేడు మాత్రమే కాకుండా శాశ్వత కాలమునకు కూడా వర్తించేవిధముగా అనుభవించవలసి యుంటుంది.

**రోమా 1:21-32లో మనుష్యులు పాపము చేసినపుడు దానివలన కలిగే పర్యవసానములను గూర్చి పౌలు వివరిస్తున్నాడు. పాపములో దాగియున్న వివిధ మెట్లు మరియు వాటి పలితాలను గూర్చి పౌలు ఏమి చెప్పుచున్నాడో ఈ వాక్యాలు చదువుట ద్వారా కనుగొనుడి.**

..............................................................................................

........................................................................................

సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను (పాపము చేయుట వలన) దేవుని కోపము బయలుపడుతుందని రోమా 1:18లో పౌలు జ్ఞాపకము చేస్తున్నాడు. ఇక్కడ దేవుని కోపమనగా, మానవులు ఏమి విత్తుదురో ఆ పంటనే కోయుదురనే విషయాన్ని హెచ్చరించాడు. మన స్వకీయ క్రియల వలన కలుగు ఫలితాలనుండి, మనము క్రైస్తవులమైనను దేవుడు తక్షణమే వాటిని తొలగించుటకు ఆయన కలుగజేసికొనడు. అనేక సందర్భాలలో పాపము వలన కలుగు ఫలితాలను మన అనుభవ జ్ఞానముతో భరించే విధముగా అనుమతిస్తాడు. తద్వారా పాపమంటే ఏమిటో మరియు అది ఎంతలోతుగా గాయపర్చగలదో అనే విషయాలను మనము గ్రహించి దానినుండి గుణపాఠమును నేర్చుకొనుటకు అనేక సందర్భాలలో పాప ఫలితాలు మనమీద పనిచేయునట్లు ఆయన అనుమతిస్తాడు.

దేవుని ధర్మశాస్త్రమును మీరుట వలన కలుగు ఫలితాలను గూర్చి మనము ఇక్కడ చర్చించుకొనుచున్నాము. అయితే దేవుని యొక్క ఆరోగ్య సూత్రములను మీరుటను గూర్చి ఇక్కడ ఏమి చెప్పుచున్నది? మన దేహములు దేవుని యొక్క గృహమైయున్నవి. ఆరోగ్యకరమైన ఆహారమును భుజించనిచో లేక దేహమునకవసరమైన వ్యాయామము చేయకుండినను లేక విస్తారమైన పని కలిగియున్నను, అది కూడా దేవునికి వ్యతిరేకముగా పాపము చేసినట్లే అవుతుంది. వేదనకు సంబంధించిన పర్యవసానాలు దీనివలన కూడా కలుగవచ్చును.

**మీ జీవితాలలో చేసిన పాపఫలితాలను ఏవిధంగా అనుభవించారు? వాటి నుండి మీరు నేర్చుకున్న గుణ పాఠాలేమిటి? అట్టి పరిస్థితులను ఎదుర్కొనకుండా ఎటువంటి మార్పులను మీరు మీ జీవితములో అమలుపరిచారు?**

**బుధవారం** **జూలై 6**

## పరిశుద్ధము చేయుటకు సహాయపడే వేదనలు

"కావున సైన్యములకధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. –ఆలకింపుము, వారిని చొక్కము చేయునట్లుగా నేను వారిని కరిగించుచున్నాను. నా జనులను బట్టి నేను మరేమి చేయుదును?" (యిర్మియా 9:7).

"మిమ్ములను గాయపర్చే ఏదైనా విషయాన్ని దేవుని ఆత్మ మీ దృష్టికి తీసుకొని వచ్చిన యెడల దాని ద్వారా మీలో దాగియున్న మరణకరమైన విషయాన్ని తొలగించుకొనుటకు మీకు సహాయపడుచున్నాడని భావించవలెను".

"ఆశ్వాల్డు చాంబర్సు" ఆయన ఉన్నతమైన విషయానికి నా సర్వస్వము" పుట 271

పైన పేర్కొనబడిన ఆ వాక్యమును ఏవిధముగా నీవు అర్థము చేసుకొనగలవు? పరిశుద్ధపర్చే ప్రక్రియలో ఇమిడియున్న వేదనలవిషయములో నీ స్వీయ అనుభవమేమి?

........................................................................................

........................................................................................

**యిర్మీయా 9:7-16 చదువుడి. "నేను యూదా మరియు యెరూషలేమును కరిగించి పరీక్షించుచున్నాను" అని యెహోవా సెలవిచ్చుచున్నాడు (యిర్మీయా 9:7) వారిని ఆవిధముగా చేయుటకు దేవునికున్న రెండు కారణములు ఏమిటి? (యిర్మీయా 9:13,14) వారిని పరిశుద్ధము చేయుటకు కరిగించడము ద్వారా ఎట్లు సాధ్యమవుతుంది? (యిర్మీయా 9:15,16).**

దేవుడు కరిగించి పరీక్షించే ప్రక్రియలో కఠినమైన చర్య దాగి యుంది. కరిగించి పరీక్షించడమనునది ఒక కొలిమిలో వేయబడుటకు సమానమని చెప్పుటకు మూడు కారణములున్నవి. మొదటగా మన పాపమును మన దృష్టికి తీసుకొనివచ్చుటకు, బాధాకరమైన పరిస్థితులు మనమీద ప్రభావముచూపుటకు దేవుడు అనుమతిస్తాడు. ఇదే విషయాన్ని ఎంతో విచారకరముగా యిర్మీయా వివరించుచున్నాడు.

కొలిమి తిత్తి బహుగా బుసలు కొట్టుచున్నది గాని అగ్నిలోనికి సీసమే వచ్చుచున్నది. వ్యర్థముగానే చొక్కము చేయుచువచ్చెను. దుష్టులు చొక్కమునకు రారు" (యిర్మీయా 6:29).

రెండవదిగా, మనము ఏ పాపములో పడియున్నామో దానిని ఇప్పుడు చాలా స్పష్టముగా గ్రహించుట వలనను లేక చూచుట వలనను దాని విషయమై విచారమును వ్యక్తపరుస్తూ గొప్ప వేదనను అనుభవిస్తాము.

మూడవ విషయానికొస్తే మనము అనుసరించిన పాప జీవితమును విడిచి వేరే విధముగా జీవించుటకు ప్రయత్నించినపుడు ఎంతో నిరుత్సాహానికి గురవుతూ ఉంటాము. మనలో భాగమైయున్న క్రియలను విడిచి పెట్టుటకు తీర్మానించుకున్నపుడు అది కష్టతరముగా ఉంటుంది. మరియు ఎంతో అసౌకర్యాన్ని కలిగించవచ్చును.

**నీవు పోరాడుచున్న పాపములను గురించి ఆలోచించు. దేవుడు నేడు నిన్ను కరిగించి పరీక్షించాలనుకున్నట్లయితే దానిని ఆయన ఏవిధముగా చేస్తాడు? ఆయన ఇశ్రాయేలు యెడల చేసినట్లుగా నీ యెడల చేయకుండునట్లు నీవు ఏ చర్యను తీసుకుంటావు?**

....................................................................................................

....................................................................................................

## గురువారం జూలై 7

## పరిపక్వము చెందుటకు సహాయపడే వేదనలు

"నాకు కలిగిన ప్రత్యక్షతలు బహు విశేషముగా ఉన్నందున నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నాకు శరీరములో ఒక ముల్లు, నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నన్ను నలుగగొట్టుటకు సాతాను యొక్క దూతగా ఉంచబడెను" (2కొరింథి 12:7).

ఒక చెట్టును నరికివేయుటకు లేక దాని కొమ్మలను కేవలం కత్తిరించుటకు మధ్య చాలా తేడా ఉంది. మనకు అనవసరము అనుకున్న చెట్టును పూర్తిగా నరికి వేస్తాము. ఎక్కువ ఫలములను ఫలించే రీతిలో ఆ చెట్టు ఉండాలనుకున్నపుడు దాని కొమ్మలను

కత్తిరిస్తాము. ఈ రెండు పద్ధతులను అనుసరించుటకు పదునైన కత్తి అవసరము. ఒక చెట్టును పూర్తిగా నరికి వేయుటకంటే, దాని కొమ్మలను కత్తిరించేటపుడు బహుశ ఎక్కువ జాగ్రత్తలు తీసుకొనవలసియుంటుంది. ఇట్టి ప్రక్రియనే ఒక ఆధ్యాత్మిక దృష్టితో చూచినపుడు బ్రూస్ విల్కిన్సన్ ఈవిధముగా వ్రాస్తున్నాడు. "నీవు దేవుని కుమారునివలె ఉండగోరుచున్నావనియు మరియు అపారమైన దీవెనల కొరకు దేవునిని ప్రార్ధించుచున్నావా?"

"నీ జవాబు అవునన్నట్లయితే పెద్ద కత్తెర వంటి కోత సాధనమును నీవు కోరుచున్నావని అర్ధము" –ద్రాక్షావల్లిలోని రహస్యములు, పుట 60 (మల్టీనోర్మా పబ్లిషర్సు 2001).

"నా శరీరములో ఒక ముల్లు ఉంచబడెను" (2కొరింథి 12:7) అని పౌలు వ్రాసినప్పుడు దాని విషయమై ప్రజలు ఆశ్చర్యమును వ్యక్తపర్చారు. కొందరైతే ఆయన నత్తివాడని మరియు తన శత్రువులు ఆయనను వేధించేవారని అనుకున్నారు. అయితే ఆయనకు కంటి చూపు సరిగా లేకపోవుట వలన ఆయన ఇబ్బందిపడేవాడని (ఎలెన్ జి వైట్, ఎస్‌డి ఎ బైబిలు కామెంటరీ, సంపుటి 6, పుట 1107 చూడుడి) భావించారు. ఆశ్చర్యకరముగా "ఆ ముల్లును అతనికి అనుగ్రహింపబడెను" అని పౌలు నమ్మియున్నాడు.

**"నాకు ఇవ్వబడెను" అనుటలో పౌలు యొక్క ఉద్దేశము ఏమైయుంటుందని మీరు అనుకొనుచున్నారు? దానిని ఎవరు ఆయనకు అనుగ్రహించెను? అది పౌలుకు మేలు కరముగా ఉండుటకు దానిని దేవుడు ఏవిధముగా ఉపయోగించుకున్నాడు?**

గమనించండి. పౌలు కలిగియున్న "ముల్లు"నకు ఒక ప్రత్యేకమైన ఉపయోగమున్నది. "నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము" (2కొరింథి 12:7) అని పౌలు భావించియున్నాడు. అతడేదో పాపము చేసియున్నాడు కాబట్టి ఆ ముల్లు అతనికి ఇవ్వబడెను అనుటకంటే భవిష్యత్తులో పాపములో పడకుండునట్లు ఆ ముల్లు ఆయనకు అనుగ్రహింపబడెను అని అర్థము చేసుకొనవచ్చును. స్వాభావికముగా ఆయన పాపము చేయు స్థితిలో ఉన్నవాడే అయినందున, ఆ ముల్లు ఆయనను పాపము చేయకుండా నిలువరించును అనే భావము అక్కడ కనిపించుచున్నది.

2కొరింథి 12:7–10 చదువుడి. పౌలు తాను కలిగియున్న ముల్లు విషయమై ఏమి చేసాడు? ఆ ముల్లు కలిగియుండుట వలన పౌలునకు వేరే ఆధ్యాత్మిక మేలులు కలిగాయని నీవనుకుంటున్నావా? మీలో కలిగియున్న ముల్లుల విషయమై పౌలు నుండి మీరేమి నేర్చుకొనగలరు?

**ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు మీ తలంపులకన్నా మీ యెడల దేవుని తలంపులు ఏవిధముగా భిన్నమైనవిగా ఉంటాయి. నీతి విషయములో ఎక్కువ ఫలములు ఫలించుటకు నీ జీవితములో ఏవిషయాలు సహాయపడును? "కత్తిరించుట" అనే విధానము ద్వారా దేవుని యొద్ద నుండి ఏ ఆధ్యాత్మిక గుణములను పొందాలని నీవు కోరుచున్నావు?**

శుక్రవారం జూలై 8

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ "సార్ధకమైన ప్రార్ధన" సైన్స్ ఆఫ్ ది టైమ్స్, నవంబరు 18, 1903. ఎలెన్ జి వైట్ వ్యాఖ్యానము, పుట 1182, ఎస్‌డిఏ బైబిలు వ్యాఖ్యానము సంపుటి 4; మరియు ఎలెన్ జి వైట్ "నన్ను శుద్ధపరచుటకు దేవుడు శోధనలను మరియు వేదనలను అనుమతించును" పుట 92. "నేడు నా జీవితములో".

"మనుష్యుల హృదయములను చదువగల వానికి మాత్రమే వారి యొక్క గుణములను గూర్చి తెలుసుకొనగలడు గాని వారంతట వారు ఏమైయున్నారో వారికి అర్ధము కాదు. కొంతమందిలో నిగూఢముగా ఉన్న శక్తులను ఆయన కనుగొనగలడు. వాటిని సరియైన రీతిలో ఉపయోగించిన యెడల దేవుని యొక్క పనిని ముందుకు తీసుకొని వెళ్ళగలరు. దేవుడు తన సంకల్పము చొప్పున అటువంటి మనుష్యులను వేర్వేరు హోదాలలో వేర్వేరు కార్యములను నిర్వహించుటకొరకు పిలువబడుదురు. అట్టి సమయాలలో ఆ మనుజులకు తెలియని వారి బలహీనతలను దేవుడే సరిచేసి వారిని ఆయన సేవ కొరకు సిద్దము చేస్తాడు. వారు పరిశుద్ధ పరచబడుటకు వీలుగా వారిని అగ్నివంటి శోధనలలో కరగబెట్టును" -ఎలెన్ జి వైట్, స్వస్థత సువార్త పరిచర్య పుట 471.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మనము చేసిన పాప ఫలితాలను అనుభవించుట చాలా బాధాకరంగా ఉంటుంది. "నేను తిరిగి దేవునితో సమాధానపడగలనా?" అనే అనుమానము రావచ్చును. అటువంటి సమయాలలో కూడా మనము దేవునిని విడువక ఆయనను వెంబడించినపుడు ఏ వాగ్దానములకు అర్హత పొందగలము? (రోమా 5:1-11లో పౌలు చెప్పిన విషయాలను చదువుడి. ఇదే ప్రశ్న వేరే వారైనా నిన్ను అడిగిన యెడల నీవేమి సమాధానమిస్తావు?
2. "ఆయన సంకల్పము చొప్పున" అని ఎలెన్ జి వైట్ వ్రాయబడటములో ఆమె అర్ధమేమైయున్నది? ఆయన సంకల్పము ఏవిధముగా పనిచేస్తుంది? ఏదైనా జరిగినప్పుడు అది దేవుని సంకల్పము చొప్పున జరిగిందా? లేదా? అని మనమెట్లు తెలుసుకొనగలము?
3. కొలిమిలో వేయబడిన అనుభవములో ఎవరైనా ఉన్నట్లు నీకు తెలిసినట్లయితే ఆయన యెడల నీ స్పందన ఏవిధంగా ఉండనైయుంది?
4. దక్షిణ అమెరికాలో ఎన్నో వేదనలను ఎదుర్కొనిన క్రైస్తవ యువకుడు ఐరోపా దేశమునకు తరలివెళ్ళిపోయిన తరువాత "నేను నా మృతదేహమును దక్షిణ అమెరికా దేశములో విడిచి వచ్చితిని" అని వ్యాఖ్యానించాడు. దాని అర్ధమేమైయుంది? ఏదో ఒక విధముగా అందరం మన మృత దేహాలను ఎక్కడో ఒకచోట ఎందుకు విడిచి పెట్టాలి? ఆ విషయములో వేదనలకున్న పాత్ర ఏమైయుంది?
5. మీ సబ్బాతుబడి తరగతిలో ఈ పై విషయాలు చర్చించుడి.

3వ పాఠం

జూలై 9-15

# పక్షిని బంధించుటకు పంజరము

## సబ్బాతు మధ్యాహ్నము

జూలై 9

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : నిర్గమ 14; 15:22-27; నిర్గమ 17:1-7; లూకా 4:1-13; 1పేతురు 1:6-9; సామెతలు 3.**

**కంఠతవచనం: "ఇందువలన మీరు మిక్కిలి ఆనందించుచున్నారు. గాని అవసరమును బట్టి నానావిధములైన శోధనల చేత, ప్రస్తుతమున కొంచెము కాలము మీకు దుఃఖము కలుగుచున్నది (1పేతురు 1:6).**

సూర్యోదయమున ఇతర పక్షుల వలె పంజరములో బంధింపబడిన పక్షి తన యజమానుడు నేర్పించాలనుకున్న పాటను పాడదు. అక్కడక్కడ ఆ పక్షి ఏదో నేర్చుకొనుటకు ప్రయత్నిస్తుంది గాని పూర్తిగా ఒక ప్రత్యేకమైన రాగమును నేర్చుకొనలేదు. అంతట ఆ యజమాని దాని పంజరమును ఒక నల్లని బట్టతో కప్పి పంజరము లోపల చీకటిని కలుగజేసి, ఆ పక్షికి వినబడే విధముగా తాను నేర్పాలనుకున్న పాటను వినిపిస్తుండగా ఆ పక్షి పాటను నేర్చుకుంది. అప్పుడు ఆ పక్షిని వెలుగులోనికి తీసుకొని వచ్చినపుడు కూడా అది ఎంతో రాగయుక్తముగా ఆ పాటను పాడగలుగుతుంది. దేవుడు తన బిడ్డల యెడల కూడా అదే ప్రకారము చేస్తున్నాడు. మనకు నేర్పుటకు ఆయనకొక పాట వుంది. వేదనల నడుమ మనము ఆ పాటను నేర్చుకున్నచో, అటు తరువాత దానిని మనము నిరంతరం పాడగలుగుదుము – ఎలెన్ జి వైట్, స్వస్థత సువార్త పరిచర్య, పుట 472.

గమనించండి. యజమానుడే తన పక్షిని చీకటి ప్రదేశములోనికి నడిపిస్తాడు.

సాతానుడు వేదనలను కలుగజేస్తున్నాడనే విషయాన్ని సులభంగా అర్ధము చేసుకొనవచ్చును. అయితే మనము కలవరము చెంది, గాయపడే విధముగా దేవుడు మనలను కరిగించి పరీక్షించే కొలిమిలోనికి నడిపిస్తాడా?

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** వేదనలు కలిగించే అనుభవములోనికి సహితము దేవుడు తన ప్రజలను నడిపించుననే బైబిలులో ఏ ఉదాహరణలను గూర్చి మీరు ఆలోచించగలరు? వారు ఏ నూతన గీతాలను పాడాలని ఆయన కోరుకుంటున్నాడు? నీ అభిప్రాయమేమిటి?

–జూలై 16, సబ్బాతు దినమున ఈ వారం పాఠమును అధ్యయనం చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం జూలై 10

## మార్గము యొక్క అంతిమ భాగంగుండా వాగ్దానభూమిలోనికి

"ఫరో సమీపించుచుండగా ఇశ్రాయేలీయులు కన్నులెత్తి ఐగుప్తీయులు తమ వెనుకవచ్చుట చూచి మిక్కిలి భయపడి యెహోవాకు మొఱ్ఱపెట్టిరి" నిర్గమ 14:10.

మీరు ఎప్పుడైనా ఒక మార్గము యొక్క చివరి భాగమునకు నెట్టబడిరా? లేక ఎప్పుడైనా ఒక బోనులో చిక్కుకున్నారా? కొన్నిసార్లు అది మంచిదైనట్లుగానే కనబడవచ్చును. పుట్టినరోజు శుభాకాంక్షలు తెల్పుటకు రహస్యముగా ఒక గదిలో కూర్చున్న స్నేహితుల మధ్యకు తెలియకుండానే నడిచి వెళ్ళుట ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

కొన్ని సందర్భాలలో అసహ్యమైన పరిసరాలకు తెలియకుండా ప్రవేశించుట వలన విస్మయానికి గురయ్యే పరిస్థితి ఏర్పడవచ్చును. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమును విడిచిన మొదటి దినము నుండి వారు వాగ్దాన భూమిలోనికి ప్రవేశించే వరకు ప్రభువు వారిని "వారు పగలు రాత్రియు ప్రయాణము చేయునట్లుగా యెహోవా త్రోవలో వారిని నడిపించుటకై పగటి వేళ మేఘస్తంభములోను వారికి వెలుగిచ్చుటకు రాత్రివేళ అగ్ని స్తంభములోను ఉండి వారికి ముందుగా నడచుచువచ్చెను" (నిర్గమ 13:21). వారి ప్రయాణమంతా దేవుడే స్వయముగా వారి వెంబడి ఉండి నడిపించాడు. అయితే వారిని మొదటిగా ఎక్కడకు నడిపించాడో చూడండి. వారి ముందు సముద్రము, ఇరువైపులా పర్వతాలు, వారి వెనుక కను చూపు మేరలో ఫరో సైన్యము వెంబడించుచున్నది.

**నిర్గమ 14 చదువుడి. ఇశ్రాయేలీయులు మిక్కిలి భయము చెందుదురని తెలిసి కూడా దేవుడు ఎందుచేత వారిని అక్కడకు నడిపించాడు?**

..........................................................................................

..........................................................................................

స్తంభమును వెంబడించుట అన్నివేళలా ఆనందమును వాగ్దానము చేయలేదు. నీతి విషయములో తర్ఫీదు పొందే సమయాలలో కొన్నిసార్లు కఠినమైన అనుభవాలను ఎదుర్కొన వలసి యుంటుంది. అవి మన హృదయాలను పరీక్షించేవిధముగా స్వాభావికముగానే మోసకరముగా ఉండవచ్చును. (యిర్మీయా 17:9) ఇటువంటి క్లిష్టపరిస్థితులలో వేదనలు లేనంత మాత్రాన దేవుడు మనకు తోడుగా ఉన్నాడనుకొనుటకంటె దేవుని యొక్క ఉపదేశములను మనస్ఫూర్తిగా స్వీకరించి మన మనస్సులను ఆయన నడుపుదలకు నిరంతరము సమర్పించుకొనుట ఎంతైనా అవసరముంది.

**ఈ అనుభవము నుండి ఇశ్రాయేలీయులు నేర్చుకున్న గుణపాఠము ఏమిటి?**

..........................................................................................

...............................................................................

**కొన్నిసార్లు దేవునియందు మన నమ్మకముంచుటనునది కష్టముతో కూడుకున్నదని ఎందుకనిపిస్తుంది? మనయెడల అనేకమైన ఆశ్చర్యకరమైన వాగ్దానములను ఆయన చేసాడు కదా? ఒక ప్రమాదకరమైన స్థితిలో దేవుడు ఎట్లు కాపాడెనో జ్ఞాపకము చేసుకోండి. ఆయనకు భయపడి ఆయనయందు నమ్మకము నేర్పించుట కొరకే కష్టమైన పరిస్థితులను అనుమతించెను.**

సోమవారం జూలై 11

## చేదైన జలములు

"తరువాత ఇశ్రాయేలీయుల సర్వ సమాజము యెహోవా మాట చొప్పున తమ ప్రయాణములో సీను అరణ్యము నుండి ప్రయాణమైపోయి రెఫీదీములో దిగిరి. ప్రజలు తమకు త్రాగునీళ్ళు లేనందున" (నిర్గమ 17:1).

మనము కోరినవన్నియు దేవుని యొద్ద నుండి మనము పొందలేకపోవచ్చును. అయితే మనకు అవసరమైనవన్నియు ఆయన నుండి పొందాలని కోరుకొనకూడదా?

అక్కడ ఇశ్రాయేలీయులకు ఒక అవసరత ఉంది. వారికి కావలసింది "నీరు" మేఘ స్తంభము మధ్యన ఇశ్రాయేలీయులను ఎఱ్ఱసముద్రగుండా నడిపించగా వారు ఆయనను వెంబడించారు. ఎడారి మార్గములో వారు 3 దినాలు ప్రయాణించారు. ఇప్పుడు వారికి నీరు అత్యవసరమైయుంది. వారికి అవసరమైన నీరు ఎప్పుడు లభిస్తుంది?

అటువంటి పరిస్థితిలో దేవుడు వారిని ఎక్కడికి నడిపిస్తున్నాడు? మేఘ స్తంభము వారిని నీళ్ళున్న స్థలమైన మారా యొద్దకు నడిపించెను. అది తెలుసుకొని ఆ ప్రజలు సంతోషించి యుండవచ్చును. అయితే వారి సంతోషము ఎక్కువసేపు నిలువలేదు. మారా యొద్ద లభించిన నీళ్ళు చేదుగా ఉన్నవి. "ప్రజలు మేమేమి త్రాగుదుమని మోషే మీద సణుగుకొనిరి" (నిర్గమ 15:24).

కొన్నిదినముల తరువాత దేవుడు మరొకసారి వారిని నడిపించెను. అప్పుడు ఆ మేఘ స్తంభము నిజముగా నీళ్ళు లేని చోట నిలిచినది (నిర్గమ 17:1).

**నిర్గమ 15:22-27; నిర్గమ 17:1-7 చదువుడి. దేవుడు తనను గూర్చి ఇశ్రాయేలీయులకు మారా యొద్దను మరియు రెఫీదీము యొద్దను ఏమి బయలుపర్చెను? వారు నేర్చుకున్న గుణపాఠములు ఏమైయుండవచ్చును?**

...............................................................................

...............................................................................

**రెఫీదీము యొద్ద ఇశ్రాయేలు జనాంగము ఏమని ప్రశ్నించారు? (నిర్గమ 17:7)**

**అదే ప్రశ్నను నీవెప్పుడైనా అడిగావా? అడిగియుంటే ఎందువలన అడిగావు? దానికి జవాబు లభించినపుడు నీవేవిధముగా భావించావు? మనము దానిని అడుగుట మానేవరకు ఎన్నిసార్లు జవాబును పొందాలని కోరుకుంటున్నాము?**

..........................................................................................

..........................................................................................

మంగళవారం జూలై 12

## ఎడారిలో ఎదురైన గొప్ప వివాదము

"యేసు పరిశుద్ధాత్మ పూర్ణుడై యోర్దాను నుండి తిరిగి వచ్చి నలువది దినములు ఆత్మచేత అరణ్యములో నడిపింపబడి అపవాది చేత శోధింపబడుచుండెను. ఆ దినములలో ఆయన ఏమియు తినలేదు. అవి తీరిన తరువాత ఆయన ఆకలిగొనగా" (లూకా 4:1,2).

**లూకా 4:1-13 చదువుడి. శోధనలను ఎదుర్కొని మరియు పాపములో పడిపోకుండునట్లు ఈ వృత్తాంతము ద్వారా ఏ గుణపాఠాలను నేర్చుకొనవచ్చును?**

మనము కోరుకునే వాటిని ఆధారము చేసుకొని శోధనలు కలుగుతాయి. ఆ శోధనలు మనము బహు బలహీన క్షణాలలో ఉన్నపుడు సంభవిస్తాయి.

సాతాను చేత యేసు శోధింపడుటను గూర్చి లూకా 4 వివరిస్తుంది. ఆ వివరణలో కొన్ని క్లిష్టమైన విషయాలను మన దృష్టికి తేవడం జరిగియున్నది. అయితే దేవుడు ఎన్నడూ మనలను శోధించడు (యాకోబు 1:13) కాని దేవుడు మనలను పరీక్షించే కొలిమిలోనికి నడిపిస్తున్నట్లు చూస్తున్నాము. లూకా 4వ అధ్యాయములో చూసినచో సాతాను శోధనలు చాలా తీవ్రమైనవిగా ఉన్నచో అట్టి సమయాలలో పరిశుద్ధాత్మ మనలను అక్కడ కూడా నడిపించవచ్చును. అటువంటి సమయాలలో దేవునిని మనము నిజముగా వెంబడించుట లేదు కావున ఈ శోధనలు ఇంత బలముగా వస్తున్నాయని అపార్థము చేసుకొనవచ్చును. అయితే అది నిజముకాదు. "మనము పరీక్షించబడే పరిస్థితిలో ఉంచబడినపుడు దేవుని ఆత్మ మనలను ఆ శోధనలోనికి నడిపిస్తున్నట్లు భావిస్తూ ఉంటాము. కాని యేసు విషయములో ఆత్మే ఆయనను సాతాను ద్వారా శోధించబడుటకు నడిపించెను. మనలను దేవుడు శోధనలోనికి నడిపించినపుడు మనమేలు కొరకే ఆయన ఆవిధముగా చేయుచున్నాడు. శోధనలో ప్రవేశించకుండునట్లు యేసు దేవుని యొక్క వాగ్దానములమీద ఆధారపడలేదు. అలాగని యేసు మీదికి శోధనలు వచ్చినపుడు వాటి నెదుర్కొనుటకు ఆయన అధైర్యపడి లొంగిపోలేదు. మనము కూడా అట్లే చేయవలసియున్నాము. –ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము, పుటలు 126, 129.

కొన్ని సమయాలో కొలిమిలో ఉన్నపుడు మనము పరిశుద్ధ పర్చబడుటకు బదులు అందులో కాలిపోవచ్చును. యేసు శోధనల సమయములో స్థిరముగా నిలబడ్డాడు కాబట్టి మనము కూడా శోధనల క్రింద నలిగిపోకుండా నిలువబడుటకు ఆయన మనకున్నాడు. యేసు మన పాపాలను మోసి, మన అపజయాలకు తగిన మూల్యము చెల్లించెను. ఆవిధముగా చెల్లించుట కొరకే ఘోరమైన కొలిమిని ఎదుర్కొని జయించెను. దేవుడు ఎన్నడూ విడనాడువాడు కాదు. పాపులలో ప్రధానుడైనను, అట్టివానిని కూడా విడనాడడనే నిరీక్షణ వున్నది (1తిమోతి 1:15).

**ఇప్పుడు నీవు ఎదుర్కొనుచున్న శోధనలు ఏమిటి? యేసు విడిచి వెళ్ళిన మాదిరినుండి గుణపాఠాలు నేర్చుకొనుటకు వీలుగా ప్రార్ధనయందు నిలకడగా ఉండి శోధనలో పడవలసిన అవసరములేదని గుర్తించండి. శోధనలో పడినను రక్షకుడున్నాడనే సత్యమును ఎన్నడూ మరువకూడదు.**

**బుధవారం** **జూలై 13**

## భరించగలిగే సొత్తు

**1పేతురు 1:6,7 చదువుడి. పేతురు ఏమి చెప్పుచున్నాడు.**

.............................................................................................

.............................................................................................

కష్ట సమయాలను ఎదుర్కొంటూ అనేక సందర్భాలలో ఒంటరిగా ఉన్నామనే భావముతో బ్రతుకుచున్న ప్రజలకు పేతురు వ్రాస్తున్నాడు. యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును, ఏర్పరచబడిన వారిని అనగా, పొంతు గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితునియ అను దేశములలో చెదరియున్న దేవుని ప్రజలకు ఆయన వ్రాస్తున్నాడు (1పేతురు 1:1) ఈ ప్రాంతములను మనము ఇప్పుడు పశ్చిమ టర్కీగా పిలుస్తున్నాము. కొన్ని వాక్యాల తరువాత వారు ఎటువంటి విషయాలను అనగా శోధనలను మరియు వేదనలను అనుభవించుచున్నారో పేతురుకు తెలిసినట్లు వ్రాస్తున్నాడు (1పేతురు 1:6).

**"వారు యాత్రికులు మరియు చెదరినవారు" అని పిలుచుటలో పేతురు యొక్క ఉద్దేశము ఏమైయుంది? వారు పొందే వేదనలకు వారి స్థితి ఎట్లు సహాయపడింది?**

.............................................................................................

.............................................................................................

ఆ దినములలో ఒక క్రైస్తవుడు జీవించటమంటే అదొక నూతనమైన విషయముగా భావించారు. విశ్వాసుల సంఖ్య చాలా స్వల్పముగా ఉండెడిది. అనేక ప్రాంతాలలో వారు

అల్ప సంఖ్యాకులుగా పేరు పొందారు. వారు ఎక్కువగా అపార్ధము చేసుకొనబడినవారు మరియు ఎక్కువగా హింసింపబడినవారుగా ఉన్నారు. అయితే వారికి మాత్రమే శోధనలు వస్తున్నాయనే భావము వారిలో ఉండనవసరము లేదని పేతురు వారికి వాగ్దానము చేస్తున్నాడు (1పేతురు 1:6,7). నిజమైన విశ్వాసమును కాపాడుకొనుట వారి గురియైయున్నది. కాబట్టి వారికి సకల శోధనలు ఎదురవుచున్నవని వారిని పేతురు ప్రోత్సహిస్తున్నాడు.

**1పేతురు 1:6-9 చదువుడి. విశ్వాసులు ఎదుర్కొనుచున్న శోధనలను బట్టి వారికి ఎటువంటి అభయమును పేతురు వారికిచ్చుచున్నాడు? మనకు కూడా ఆ నిరీక్షణ యొక్క భావమేమైయున్నది?**

తొలి విశ్వాసులకు ఎటువంటి శోధనలు ఎదురైనా వారు ఎటువంటి శ్రమలపాలైనా క్రీస్తు తిరిగి వచ్చినపుడు వారికి అనుగ్రహింపబడే శాశ్వత జీవముతో అవి పోల్చదగినవేనా? పేతురు వారికిచ్చిన మాటలే దేవుడు మనకు ఇచ్చుచున్న మాటలు. ఈ జీవితములో మనమెన్ని శ్రమలను వేదనలను అనుభవించిననూ, నూతన ఆకాశము మరియు నూతన భూమిలో మనకు లభించే శాశ్వత జీవితమును గూర్చిన తలంపులను ఎట్టి పరిస్థితిలోను మరచిపో కూడదు. మనలను మన పాపముల నుండి శుద్ధి చేయమని ప్రభువును వేడుకుందాము.

గురువారం జూలై 14

## అగ్ని ద్వారా శోధింపడుట

ఒక యౌవనస్తున్నాడు. అతని పేరు అలెక్సు అనుకుందాము. అతడు ఎన్నో కష్టాలను తన యౌవన ప్రాయములోనే ఎదుర్కొన్నాడు. అతడు మత్తు పదార్ధాలకు అలవాటు పడి, హింసా కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. చివరికి చెరసాలలో కూడా కొంత కాలము గడిపాడు. అట్టి స్థితిలో ఉన్న ఈ యౌవనస్తునికి ఒక దయగలిగిన ప్రాంతీయ సంఘ సభ్యుడు పరిచయమయ్యాడు. (అతని యొద్దే అలెక్సు దొంగతనము చేసాడు) ఆ సంఘ సభ్యుని ద్వారా అలెక్సు దేవునిని తెలుసుకొని తన హృదయమును యేసుకు సమర్పించుకున్నాడు. అయినప్పటికి అతని పూర్వ సమస్యలు అతనిని వెంటాడుతూనే యున్నవి. అయితే ఇప్పుడు అలెక్సు యేసునందు నూతన వ్యక్తి. దేవునిని ప్రేమించుచున్నాడనుటకు సూచనగా అతడు పది ఆజ్ఞలకు విధేయత చూపించుచున్నాడు. (1యోహాను 5:1,2). ఒకానొక సమయములో అలెక్సు దేవుని సేవకుడుగా పనిచేయాలని కోరుకున్నాడు. దేవుని పిలుపుకు తన అంగీకారాన్ని తెలియపర్చాడు.

కళాశాలలో విద్యనభ్యసించుటకు చేరాడు. మొదట అన్నీ సవ్యముగానే సాగిపోతున్నవి. అటు తరువాత ఒకదాని వెంబడి మరొకటి అతనికి వ్యతిరేకముగా జరుగుచున్నవి. జీవితములో కొన్ని సమస్యలు ఏర్పడినవి. అతని దగ్గర డబ్బు నిల్వలు కరిగిపోవుచున్నవి.

అతనికి చాలా సన్నిహితముగా ఉండే స్నేహితుడు అతనికి వ్యతిరేకమయ్యాడు. అలెక్సు మీద నింద వేయుటవలన, అతని పేరు చెడిపోయింది. అనారోగ్యానికి గురయ్యాడు. అతనికున్న వ్యాధి ఏమిటో ఎవ్వరూ కనిపెట్టలేకపోయారు. చదువులో వెనకపడుట, ఫలితముగా స్కూలు నుండి ఇంటికి పోవలసిన పరిస్థితి ఎదురయింది. మత్తు పదార్థాలవైపు దృష్టి మళ్ళింది. ఆ శోధన అంతకంతకు మితిమీరిపోయింది. ఇవన్నియు అతనికి ఎందుకు సంభవిస్తున్నాయో అర్థము కాని పరిస్థితిలో పడిపోయాడు. అయితే యేసు అతడిని ఆ పాఠశాలకు నడిపించాడని అతనికి తెలుసు. ఆ విషయములో అలెక్సు తప్పు చేసాడా? అదే నిజమైతే దేవునితో అలెక్సుకు కలిగిన విశ్వాసము విషయములో కూడా అనుమానములు ఏర్పడుచున్నవి.

**ఊహించండి. ఈ పరిస్థితుల మధ్య అలెక్సు వచ్చి మీ సలహా కోరిన యెడల నీవేమి చేస్తావు? నీ అనుభవము ద్వారా అతనికెట్లు సహాయపడగలవు? నీవు ఏ బైబిలు వాక్యాలను చూపించి అతనితో మాట్లాడగలవు? సామెతలు 3; యిర్మీయా 29:13; రోమా 8:28; 2కొరింథి 12:9; హెబ్రీ 13:5.**

..........................................................................................

..........................................................................................

**ప్రభువును వెంబడించు వారందరికి ఈ సమస్యలు ఏర్పడుట ద్వారా, ప్రభువు యొక్క నడిపింపు మీద అనుమానాలు ఏర్పడవచ్చు. అట్టి సమయాలలో దేవుని వాగ్దానాలను జ్ఞాపకముంచుకొని, గతములో ఆయన ఏవిధంగా నడిపించాడో ఒక్కసారి జ్ఞాపకముంచుకోండి. ప్రభువు మనలను ఎన్నడూ విడువడు. దేవుని విడిచి పెట్టాలనే శోధనకు లొంగిపోకుండా ఎట్లు ఉండగలము?**

..........................................................................................

..........................................................................................

**శుక్రవారం** **జూలై 15**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ పితరులు మరియు ప్రవక్తలు అనే గ్రంథము నుండి "నిర్గమము" పుటలు 281–290; ఎఱ్ఱ సముద్రము నుండి సీనాయి వరకు పుటలు 291–302 మరియు శోధన, పుటలు 114–123 యుగయుగాల అభీష్టము చదువుడి.

పురాతన కాలములో ప్రభువు తన ప్రజలను రెఫీదీమునకు తరలించెను. ఆయన మనలను కూడా ఆ చోటికి నడిపించి మన నమ్మకత్వమును పరీక్షింపవచ్చును. ఆయన ఎల్లప్పుడు మనలను సుందరమైన ప్రదేశములకు నడిపించాడు. ఆయన ఆవిధముగా చేసిన

యెడల మనము మన స్వశక్తి మీద ఆధారపడి ఆయనను మరచిపోయే ప్రమాదములో పడిపోవచ్చును. దేవుడు తనను తాను మనకు ప్రత్యక్షపర్చుకొనుటకు ఇష్టపడుచున్నాడు. ఆయన యొద్ద మనకు లభించే అపారమైన వనరులను గూర్చి ఎన్నడూ మనం మరచిపోకూడదు. ఆయన మీద మనము ఆధారపడుటకు నేర్చుకునే విధముగా కొన్ని శ్రమలను, శోధనలు మనకు కలుగునట్లు ఆయన అనుమతించవచ్చును. ఆయనను ముఖాముఖిగా చూచినప్పుడు మాత్రమే ఆయన మన భారములను ఏవిధముగా మోసెనో గ్రహించగలుగుతాము. అంతవరకు మనకు అర్ధము కాదు. చిన్న పిల్లలు చూపే విశ్వాసమును ఆయన యెడల మనము కలిగి యుండాలి–ఎలెన్ జి వైట్, రెఫీదీము ఎడ్వంటిస్టు రివ్యూ అండ్ సబ్బాతు హెరాల్డు, ఏప్రిల్ 7, 1903.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. శోధనలు అనునవి వ్యక్తిగతమైనవిగా మనము తరచుగా మాట్లాడుకొనుచూ ఉంటాము. అది నిజమే. అయితే అదే సమయములో సమూహముగా ఒకేసారి అందరి మీదకు వచ్చే శోధనలుంటాయా? అట్టి సందర్భములో ఒక ప్రాంతీయ సంఘము యావత్తూ ఏవిధముగా ఎదుర్కొనగలదు?
2. అసహ్యమును పుట్టించే స్థలములను గురించి, ఎవరినైనా అడగండి. అవి ఎందుకు అసహ్యమైన స్థలములుగా ఉన్నవి? వాటిని మరొకసారి నేడు దర్శించాలనుకొనిన యెడల వేరే ఉద్దేశము ఏమైనా కలుగుతుందా?
3. దేవుడు మనలను పరిశుద్ధ పరచుటకు శోధనలు మరియు శ్రమల ద్వారా, మనలను కరగబెట్టి పరీక్షించుచున్నాడా? అయితే కొన్ని పరీక్షలు, ఉదాహరణకు ఒక కారు ప్రమాదములో ఒక వ్యక్తి అక్కడిక్కడే మరణించవచ్చు. అటువంటి స్థితిని గూర్చి తరగతిలో చర్చించండి.
4. ఒక తరగతిగా మీరు ఒకరికొకరు ప్రార్ధన చేయుటకు ప్రోత్సహించుడి.

❋❋❋

4వ పాఠం జూలై 16-22

# కంసాలి యొక్క ముఖమును చూడగల్గుట

సబ్బాతు మధ్యాహ్నము జూలై 16

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : మత్తయి 5:16; 1కొరింథి 4:9; ఎఫెసి 3:10; యోబు 23:1-10; మత్త 25:1-12; దాని 12:1-10; ఎఫెసి 4:11-16.**

**కంఠతవచనం : "మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2కొరింథి 3:18).**

ఆమీ కార్మికల్ చిన్న పిల్లల బృందాన్ని ఒక దానిని తీసుకొని భారతదేశములో ఉన్న ఒక సంప్రదాయ కంసాలి ఇంటికి తీసుకొని వెళ్ళెను. బొగ్గుతో మండుచున్న కొలిమి మధ్యన, ఇంటిపై కప్పు మీద వేసే వంగిన ఆకారముగల పెంకు ఉన్నది. కొలిమిలో కాలుచున్న ఆ పెంకు మీద ఉప్పుతో కలిపిన మిశ్రమము, ముగ్గిన చింతకాయ మరియు కొంత ఇటుక పొడి ఉన్నది. ఈ మిశ్రమములో బంగారము తునకలున్నవి. ఆ మిశ్రమమును కొలిమిలోని మంట కాల్చగా, బంగారము శుద్ధి చేయబడి శుద్ధమైన బంగారముగా మారుతుంది. అంతట ఆ కంసాలి పట్కారుతో శుద్ధి చేయబడిన ఆ బంగారమును పైకి తీసి చూడగా, అది పూర్తిగా శుద్ధి చేయబడలేదని గ్రహించి పెంకు మీద మరల కొంత మిశ్రమము వేసి అందులో ఆ బంగారమును మరొకసారి కరిగించాడు. ఆవిధముగా శుద్ధి చేయబడిన మేలిమి బంగారము లభించువరకు కొలిమిలో కాల్చబడుతుంది. ఆవిధంగా కాల్చబడేటప్పుడు ప్రతిసారి కొలిమి వేడిని అధికం చేస్తాడు.

స్వచ్ఛమైన బంగారముగా అది ఎప్పుడు శుద్ధి చేయబడుతుందో నీకెట్లు తెలుస్తుందని ఆ బృందమువారు అతనిని ప్రశ్నించగా, "నేను నా ముఖమును ఆ బంగారములో చూచుకొనగలిగినప్పుడు శుద్ధబంగారమని నాకు తెలియునని ఆ కంసాలి జవాబిచ్చాడు" – ఆమీ కార్మికల్, దేవుని గూర్చి నేర్చుకొనుట, (ఫోర్టు వాషింగ్టన్, క్రిస్టియన్ లిటరేచర్ క్రూసేడ్ 1989) పుట 50.

దేవుడు మనలను శుద్ధి చేయుటకు వెదకుచున్నాడు. బంగారమును శుద్ధి చేసినట్లు మనలను శుద్ధి చేసి మనలో ఆయన స్వరూపమును చూడవలెనని, మనలను మార్చివేయాలని కోరుచున్నాడు. మనయెడల దేవుని యొక్క గురి చాలా ఆశ్చర్యమైనది. జీవితములో ఎదురయ్యే వేదనల గుండా ప్రయాణమును సాగించిన జీవితములు క్రీస్తును పోలిన నడవడిక అభివృద్ధి చెందుతుందనుట మరింత ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** శుద్ధి చేయబడే క్రమములో వేదనలకున్న

పాత్ర ఏమిటి? మహా గొప్ప సంఘర్షణను గూర్చి తెలుసుకొనుట ద్వారా ఏవిధముగా శుద్ధి చేయబడే ప్రక్రియను మనము అర్ధము చేసుకొనగలము.

–జూలై 23, సబ్బాతు దినమున ఈవారము పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **జూలై 17**

## ఆయన స్వరూపములో

"ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్టుడగునట్లు దేవుడెవరిని ముందు ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యముగల వారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను" (రోమా 8:29).

**ఏవిధముగా దేవుని యొక్క స్వరూపము మానవ జాతిలో తుడిచివేయబడినదని చూడగలము?**

..........................................................................................

..........................................................................................

మనమందరము పాపము వలన చెడిపోతిమి. ఆ విషయము అందరికి కనిపిస్తూనే యున్నది (రోమా 3:10–19) అయినప్పటికి తిరిగి తన స్వరూపములోనికి మనలను మార్చుకోవాలనే కోరిక దేవునిలో ఉంది. నేటి కొరకు ఏర్పాటు చేయబడిన వాక్యము ఈ విషయమై చాలా స్పష్టముగా తెలియజేస్తున్నది. ఎవరైతే వారి జీవితాలను పరిశుద్ధాత్మకు సమర్పించుకుంటారో అట్టి వారిని దేవుడు తన కుమారునితో సారూప్యముగలవారవుటకు ఎంచుకొనెను" (రోమా 8:29).

దీనికి వేరొక కోణము కూడా ఉన్నది. "మానవ జాతిలో దేవుని యొక్క స్వరూపము మరల కలుగజేయవలసియున్నది. తన ప్రజల యొక్క ప్రవర్తనలో దేవుని యొక్క మరియు క్రీస్తు యొక్క గొప్పతనము పరిపూర్ణముగా ప్రదర్శించబడాలి" – ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము పుట 671.

**ఎలెన్ జి వైట్ పైన చెప్పిన విషయాన్ని మనము ఎట్లు అర్ధము చేసుకొనగలం? (యోబు 1; మత్తయి 5:16; 1కొరింథి 4:9 మరియు ఎఫెసి 3:10 కూడా చూడుడి.**

విశ్వములో సంభవించుచున్న సంఘటనలలో క్రైస్తవులముగా మనము చుట్టు ప్రక్కల క్రీస్తునకు మరియు సాతానుకు జరుగుచున్న మహా గొప్ప పోరాట దృశ్యములు ప్రదర్శింపబడుచున్నవి. అదంతయు ఎక్కువ భాగము మన కంటికి గుప్తముగా ఉన్నను, క్రీస్తు అనుచరులముగా దానిని మనము అర్ధము చేసుకొనగలము. మరియు ఈ సంఘర్షణలో మనము నిర్వహించవలసిన పాత్ర కూడా మనకివ్వబడినదని గ్రహించవలసియుంది. ఆ విధముగా మనకు ఇవ్వబడిన పాత్రను మనము పోషించినప్పుడు మన జీవితముల ద్వారా

క్రీస్తు యొక్క నామము మహిమ పర్చబడుతుంది.

**మనమొక విశాల ప్రాంగణములో ఉన్నట్లు ఊహించుకోండి. దానిలో ఒక ప్రక్క ప్రభువునకు విధేయులైన పరలోకపు దూతలు ఉన్నవి. మరొక ప్రక్క లూసిఫర్ విధేయులైన పతనమైన దూతలున్నారు. ఇందులో 24 గంటలు నీ జీవితమును ప్రదర్శించిన యెడల ఏ పక్షాన నీవు నిలుతువు? నీ జవాబు ఏమైయున్నదో నీవు తెలియపర్చగలవా?**

సోమవారం జూలై 18

## శుద్ధి చేసే అగ్నిమధ్య విశ్వాసమును కనుపర్చుట

యుద్ధములో పాల్గొనడం ఒక విషయమైతే, యుద్ధములో పాల్గొనే వివిధ బలగాలను చూచుట మరొక విషయమవుతుంది. క్రైస్తవులుగా మన పరిస్థితి ఆవిధముగా ఉన్నది. యుద్ధ శక్తులు బారులు తీరి అక్కడుండుట కనిపిస్తున్నాయి. మన జీవితములో యుద్ధ ప్రభావమును అనుభవిస్తున్నాము. అయినప్పటికి మన విశ్వాసముతో ముందుకు సాగిపోవాలి. మన కంటికి కనిపించని వానియందు నమ్మకముతో జీవించాలి (హెబ్రి 11:27).

**యోబు 23:1-10 చదువుడి. యోబు చెసిన పోరాటము యొక్క భావమేమిటి? అతడు చూడలేకపోయినదేమిటి? అదే సమయములో అతడు ఎన్ని శ్రమలు ఎదుర్కొనినను విశ్వాసముతో ఏమి చేసాడు?**

........................................................................................................

........................................................................................................

ఎన్నో శ్రమల మధ్య చిక్కుకొని యున్నను యోబు మాత్రము తన నమ్మకమును ప్రభువునందే ఉంచాడు. తన జీవితమునకు ఏమి సంభవించినను వాటన్నిటిని సహించుటకు దృఢ సంకల్పమును ప్రదర్శించాడు. ఒక బంగారు పతకము కోసము అతడు ఎంతో దీక్షతో ఎదురు చూడలేదు గాని అతడు భవిష్యత్తులోనికి చూస్తూ దేవునిని అంటి పెట్టుకొని యున్నాడు. పుటము వేయబడిన బంగారము వలె అతడు దేవుని దృష్టిలో కనబడాలనే పట్టుదలతో తన విశ్వాసమును కాపాడుకున్నాడు. తెర వెనుక యోబు యొక్క జీవితములో ఏమి సంభవిస్తున్నదో మనకు తెలియపర్చలేదు గాని ఎంత గుప్తముగా దాచబడినప్పటికి శుద్ధి చేసే కొలిమిలోని అగ్నిని అతడు సహించెను.

అగ్ని అంటే నీవు భయపడుచున్నావా? పరిస్థితులు సృష్టించే వేడిమిని గురించి నీవు ఆందోళన చెందుచున్నావా? అయితే యోబు విషయములో దేవునిని గూర్చి అతనికున్న దీక్ష వివరింపశక్యము కానిది. నూతన ఉద్యోగానికి గాని, నూతన గృహానికి గాని అనుకూలంగా సర్దుబాటు చేసుకొనుట కష్టమైనా, తప్పని పరిస్థితులలో మార్చుకోవడం జరుగుచున్నది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను అర్ధము చేసుకొనలేకపోయినను, మనలను శుద్ధి చేయుటకు దేవుడు మాత్రము ఆ శ్రమలను ఉపయోగించి ఆయన స్వరూపములోనికి

మన స్వభావము మారునట్లు సహాయపడును.

యోబును శుద్ధి చేయబడిన బంగారమునకు పోల్చుట ద్వారా, పైనున్న వాటిపై తన దృష్టిని పెట్టుటకది సహాయపడింది. తాను ఎదుర్కొనిన శ్రమలన్నిటిని ప్రోత్సాహకరములుగా స్వీకరించాడు. ఆ గుణము ఒక బలమైన సాక్ష్యముగా తన జీవితములో నిలిచింది. అతనికర్థమైనది స్వల్పమైనా, ఒక విషయం తెలుసుకున్నాడు. శ్రమలు అతనిని శుద్ధి చేయుటకుపయోగపడినవని గ్రహించాడు.

**నీ అనుభవములో శ్రమలు ఏవిధంగా శుద్ధి చేసినవి? ఇంకా ఏ పరిస్థితులలో నీవు శుద్ధి చేయబడవచ్చును?**

..............................................................................................

..............................................................................................

మంగళవారం జూలై 19

## యేసు యొక్క చివరి మాట

యేసు యెరూషలేములో ఉన్నాడు. ఆయన త్వరలో మరణించబోవుచున్నాడు. మత్తయి సువార్త ప్రకారము, పస్కాను ఆచరించుటకు ముందు యేసు తన శిష్యులతో మాట్లాడుతూ ఉపమానముల రూపములో మాట్లాడెను. అందులో 10 మంది కన్యకలను గూర్చి గొఱ్ఱెలు, మేకలను గూర్చిన ఉపమానములున్నవి. యేసు రెండవ రాకడను అపేక్షించు మనము అప్పటి వరకు ఏవిధముగా జీవించాలనే విషయాలను గూర్చి ఈ వృత్తాంతములు వివరించినవి. రాకడ మరింత సమీపముగా ఉన్నది కాబట్టి ఈ ఉపమానములు నేడు మనకు కూడా ఎంతగానో వర్తిస్తున్నాయి. వాటి యొక్క ప్రాధాన్యత ఇప్పటికి మారలేదు.

పదిమంది కన్యకల ఉపమానములో (మత్తయి 25:1–12) పేర్కొనబడిన నూనె పరిశుద్ధాత్మకు చిహ్నముగా ఉందని అనేకులు వ్యాఖ్యానించారు. ఎలెన్ జి వైట్ వారితో అంగీకరిస్తూ, ఆ నూనె అనగా మన ప్రవర్తనకు సూచనగా ఉన్నదనియు దానిని మనంతట మనము సంపాదించుకొన జాలమని ఒక నూతన విషయాన్ని ఆమె తెలియపర్చింది.

**ఉపమానమును చదవండి. నూనె అనగా పరిశుద్ధాత్మకు సూచనగా ఉన్నదనియు లేక మన ప్రవర్తనకు కూడా సూచనగా ఉందనే భావమును అంగీకరించినచో, ఉపమాన భావములో ఎట్టి మార్పు కనిపించును? ఆ నూనె పరిశుద్ధాత్మకు చిహ్నముగా ఉందని లేక క్రీస్తును పోలిన ప్రవర్తనకు సూచనగా ఉందని భావించినచో దానిలో అణగియున్న అర్థమేమి?**

**పరిశుద్ధాత్మ : ..............................................................................**

**ప్రవర్తన : .....................................................................................**

మత్తయి 25:31–46లో ఉన్న గొఱ్ఱెలు మరియు మేకలను గూర్చిన ఉపమానమును

చదువుడి. గొఱ్ఱెలను, మేకలను వేరు చేయుటకు ఏ లక్షణములను పాటించెను?

..........................................................................................

..........................................................................................

గమనించండి. గొఱ్ఱెలను మేకలను వాటివాటి క్రియలను బట్టి, ప్రవర్తనను బట్టి రాజు వాటిని వేరు చేసెను. ఇక్కడ యేసు క్రియల ద్వారా రక్షణ అని బోధించుట లేదు గాని, రక్షణ ప్రణాళికలో ప్రవర్తనకున్న ప్రాముఖ్యత గూర్చి చూడగలము. ఎవరైతే క్రీస్తు ద్వారా రక్షింపబడుదురో అట్టి వారు వారి జీవితాలలోను, స్వభావములోను క్రీస్తును ప్రతిబింబిస్తారని రూఢి పర్చబడింది.

**మనిషి చీకటిలో ఉన్నపుడు అతని స్వభావము బయట పడునని చెప్పబడింది. నిన్నెవరు గమనించని సమయాలలో నీవెట్టి వ్యక్తిగా ఉంటున్నావు? నీలో రావలసిన మార్పులను గూర్చి ఆ జవాబు నీకేమి చెప్పుచున్నది?**

..........................................................................................

..........................................................................................

**బుధవారం** **జూలై 20**

## బుద్ధిమంతులు

యేసు యొక్క రెండవ రాకడను అపేక్షించు వారి ప్రవర్తనకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు నిన్నటి పాఠములో చదివాము. యేసు యొక్క రెండవ రాకడ సమయములో సజీవులుగా ఉన్న వారి ప్రవర్తనకున్న ప్రాధాన్యతను గూర్చి ప్రత్యేకించి నేడు చదువుకొనబోవుచున్నాము.

**దానియేలు 12:1-10 చదువుడి. అక్కడ సందర్భమేమిటి? ఈ లోక చరిత్రకు సంబంధించి ఏ సమయమును గూర్చి ఆ సందర్భము తెలియపర్చుచున్నది? ఆ సమయములో దేవుని ప్రజల యొక్క స్వభావము ఏవిధముగా ఉండునని మనము చెప్పగలము? దుర్మార్గులకు భిన్నమైన ఎటువంటి స్వభావము దేవుని ప్రజలు కలిగియుంటారు?**

యేసు యొక్క రెండవ రాకడకుముందు మునుపెన్నడు లేనంత దుర్మార్గముతో లోక చరిత్ర నిండియుంటుందని పేర్కొనడమైనది. ఆ కాలములో నీతిమంతులు మరియు అనీతిమంతుల స్థితి ఏమైయుంటుందో దానియేలు 12:3,10లో చూపించబడింది. 'దుష్టులు గొప్ప కార్యములు చేయుదురు" అని చెప్పబడియున్నది (దానియేలు 12:10) దాని 12:3లో చూచినచో దీనికి విరుద్ధముగా నీతిమంతులు ఆకాశమండలములోని జ్యోతులను పోలిన వారై ప్రకాశించెదరు. వారు శుద్ధి చేయబడి, ఎటువంటి మచ్చయైనను మలినమైనను వారిలో కనబడదు (దానియేలు 12:10) ముందెన్నడు లేని విధముగా మహా ఆపద సమయము వచ్చును (దానియేలు 12:1) ఈ విషయములను గూర్చి దుర్మార్గులకు అర్థము కాదు గాని,

నీతిమంతులు బుద్ధిమంతులు గనుక వారు అర్ధము చేసుకొందురు.

దేనిని అర్థము చేసుకొనగలరు? విజ్ఞాన శాస్త్రాన్నా, లెక్కలనా లేక విమర్శనా? "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము" అని సామెత 1:7 చెప్పుచున్నది. ఈ సందర్భముగా చూచినపుడు బుద్ధిమంతులు జ్ఞానము కలిగియున్నారు కాబట్టి వారు కడవరి కాలములో జరిగే చివరి సంఘటనలను గూర్చి అవగాహన కలిగియుంటారని దాని భావము. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఆవిధంగా జరిగిందేమిటని ఆశ్చర్యము చెందరు. దేవుని వాక్యము చదువుదురు. కాబట్టి వారికి వాటి విషయమై అవగాహన కలిగియుంటారు. అయితే దుర్మార్గులకు మాత్రము తిరుగుబాటుతో జీవిస్తారు. కాబట్టి వారిలో దుర్మార్గము చోటు చేసుకొని యుంటుంది.

ఇక్కడ మనము గమనించవలసిన విషయమేమిటంటే, అగ్నిలో పుటము వేయబడి, శుద్ధిచేయబడిన ప్రజలను గూర్చి ప్రాముఖ్యముగా మాట్లాడుచున్నది.

**మనము చదివిన వాక్యాలను కడవరి కాలమునకు చెందినవిగాను మరియు ఆ సందర్భమునకు చెందినవిగా ఉన్నా ఇక్కడ అగ్నిలో కాల్చబడుట, శుద్ధిచేయబడుట వంటి విషయాలను గూర్చి చదువుచు అవి నేటికి కూడా వర్తిస్తాయని మనము గమనించగలుగుచున్నామా?**

గురువారం **జూలై 21**

## ప్రవర్తన మరియు సమాజము

ఒక పాట ఈ విధముగా ఉంది."నేను ఒక బండను, నేను ఒక ద్వీపమును" ఆ విధముగా మీరెప్పుడైనా భావించారా? ఏకాంతముగా ఉండాలని కోరుకున్నారా? కొందరు దేవునితో నా నడక అది నాకు మాత్రమే చెందినది. దానిని గూర్చి తెలుసుకొనుటకు ఇతరులెవ్వరూ ప్రయత్నించకూడదు. నేను దాని గూర్చి మాట్లాడను" అని చెప్పువారుంటారు.

**ఎఫెసి 4:11-16 చదువుడి. ఇక్కడ పౌలు చెప్పుచున్న విషయమేమిటి? నీకు ఆయన ఇచ్చిన పాత్ర ఏమిటి?**

........................................................................................

........................................................................................

పౌలు ఎఫెసీ సంఘానికి వ్రాస్తున్నాడు. సంఘము అనగా ఒక దేహము అని వర్ణిస్తున్నాడు. యేసు శిరస్సై యున్నాడు. తన ప్రజలు మిగిలిన దేహమైయున్నారు. ఎఫెసి 4:13లో చూసినట్లయితే, ఒక సమాజములో నీవు జీవించుచున్న యెడల, ఆ జీవితానికున్న బాధ్యత ఏమైయుంటుందో గుర్తించవలసి యుంటుందని ఆ వాక్యము హెచ్చరించుచున్నది. "క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందునట్లు" (ఎఫెసి 4:13) మనకు ఒకరి సహాయము ఒకరికి అవసరమైయున్నది.

క్రైస్తవుడైయుండి ఏకాంతముగా ఉండుట సాధ్యమేనా? ఒంటరిగా ఉన్న వారిని హింసించి సకల విధములైన బంధాలకు గురి చేయడం పూర్వకాలము నుండి సంభవిస్తున్న విషయమే. అదే సమయములో ఏ ఒక్కరు వేరొకరి ఒత్తిడికి తలవంచకూడదనునది ఉన్నది. అది నిజమైనప్పటికి పౌలు చెప్పిన విషయము పరిశీలిస్తే, మనందరము కలిసి సహవాసములో ఒకరికొకరు పరిచర్య చేసికొని, క్రీస్తు సంపూర్ణతను, అనుభవమును బయలుపర్చుచున్నామని గమనించాలి.

**నేటి కొరకు ఏర్పాటు చేయబడిన వాక్యము ప్రకారము క్రైస్తవ సమాజములో క్రీస్తు యొక్క సంపూర్ణత బయలుపర్చకముందు ఏమి సంభవించునవి పౌలు చెప్పాడు?**

..........................................................................................

..........................................................................................

**సమాజము ఇచ్చే సాక్ష్యము ద్వారా క్రీస్తు యొక్క సంపూర్ణత బయలుపర్చబడుచున్న యెడల వ్యక్తిగతముగా క్రీస్తును బయలుపర్చినపుడు ఆ పరిచర్య అంగీకరింపబడదా? మహా గొప్ప పోరాటము సందర్భముగా జరిగే పరిణామాలేమిటి? ఎఫెసి 3:10 చూడుడి.**

..........................................................................................

..........................................................................................

**ఎవరూ తెలియని వారి మధ్య మంచిగా మెలగుటనునది సులభమైన విషయమే. అయితే మీకు బాగా పరిచయమున్న వ్యక్తుల మధ్య మంచిగా ఉండుట కొంతవరకు కష్టమైన విషయమే. ఇతరులకు ఇష్టమున్నను, లేకున్నను ఇతరులకు దయ చూపుట కనికరముతో మెలగుట వలన దేవుని సత్యమునకు సాక్షులుగా ఉన్నామనే విషయాన్ని గ్రహించవలసియున్నాము.**

శుక్రవారం జూలై 22

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ "దేవుని కుమారులు మరియు కుమార్తెలు నుండి "దేవుడు ఒక మాంసపు గుండెను మనకు వాగ్దానము చేయుచున్నాడు" పుట 100.

క్రీస్తు ఉపమాన పాఠముల నుండి "పెండ్లి కుమారుని కలుసుకొనుటకు" పుటలు 405–421; మహా సంఘర్షణ నుండి "ఆపద సమయము" 613–634.

మానవులకు అప్పగించిన పనిలో ప్రాముఖ్యమైనది ప్రవర్తన నిర్మాణము. ఇప్పుడు ఆ అంశమును చదువుటకు మిక్కిలి అనుకూలమైన సమయము. ఇంతకుముందెన్నడు లేనంత ప్రాధాన్యత ఇపుడు దానికున్నది. ఇట్టి అంశమును గూర్చి చదవాల్సిన అవసరము రాలేదు. నేటి యువతీయువకులు ఎదుర్కొనుచున్న సమస్యలు ముందెన్నడూ ఆ కాలపు

ప్రజలు ఎదుర్కొనలేదు" ఎలెన్ జి వైట్, విద్య, పుట 225.

ఒక ఉపమాన పాఠములో బుద్ధి లేని కన్యకలు నూనె కొరకు బ్రతిమాడారు. అయితే వారికి నూనె లభ్యము కాలేదు. ఆపద కాలములో నిలువబడుటకు అవసరమైన సిద్ధపాటు లేని వ్యక్తులకు సూచనగా బుద్ధిలేని కన్యకలున్నారు. పొరుగువారి యొద్దకు వెళ్ళి మీ ప్రవర్తనను మాకు ఇవ్వండి అని అడిగినట్లుంది. వారి అభ్యర్ధన. మీ ప్రవర్తన మాకు అప్పుగా ఇవ్వనిచో మేము నశింతుమనే విధంగా వారడిగిరి. ప్రవర్తన ఒకరి నుండి వేరొకరికి బదిలీ చేసేది కాదు. దానిని ఎవరూ కొనలేరు లేక అమ్మలేరు. ఎవరి ప్రవర్తనను బట్టి వారి భవిష్యత్తు నిర్ణయించబడుతుంది. దానిని ఎవరి మట్టుకు వారు సంపాదించుకోవాలి. ప్రతి మానవునికి వారి కృప కాలము ముగిసేవరకు నీతిమయమైన ప్రవర్తన అలవాటు చేసుకొనుటకు అవకాశమును దేవుడనుగ్రహించెను. అయితే నీతి ప్రవర్తనను ఒక వ్యక్తి నుండి వేరొక వ్యక్తికి బదిలీ చేసే అవకాశము దేవుడివ్వలేదు. మన రక్షకుడు, ఉపాధ్యాయుడైన యేసు యొద్ద జీవితపాఠములను నేర్చుకున్నవారు, శోధనలు వారిని వెంటాడినపుడు విశ్వాసముతో స్థిరముగా నిలువబడగలరు. అటువంటి వారికి ఎదురయ్యే అసాధ్యమనే కొండలను ఆయనే తొలగిస్తాడు.–ఎలెన్ జి వైట్, దియూత్ ఇన్‌స్ట్రక్టర్, జనవరి 16, 1896.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ప్రవర్తన నిర్మాణము అంటే ఏమిటి? దానిని నీవు ఏవిధముగా చేయగలవు? నీ వ్యక్తిగత జీవితములోను, మీ సంఘ సమాజములో, ప్రవర్తనా నిర్మాణమునకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వబడెను?
2. గురువారం పాఠములో క్రైస్తవుని జీవితములో సమాజము యొక్క ముఖ్యపాత్రను గూర్చి చదివాము. మీ ప్రాంతీయ సంఘము క్రీస్తు యొక్క దేహముగా ఎంత సమర్ధవంతముగా పనిచేయగలుగుచున్నది?
3. మనము యేసునందున్న విశ్వాసము మూలముగానే రక్షింపబడుచున్నాము. మంచిప్రవర్తన నిర్మాణము ఎందుకంత ప్రాముఖ్యమైన అంశముగా ఎంచబడినది? మన ప్రవర్తనను ఎందుకు అభివృద్ధి పర్చుకోవాలి?

★★★

5వ పాఠం జూలై 23-29

# తీవ్రమైన వేడిమి

సబ్బాతు మధ్యాహ్నము జూలై 23

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఆది 22; హోషేయ 2:1-12; యోబు 1:6-2; 10; 2 కొరింథీ 11:23-29; యెషయ 43:1-7.**

**కంఠతవచనం : "అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తన్ను తానే అపరాధ పరిహారార్థ బలి చేయగా అతని సంతానము చూచును. అతడు దీర్ఘాయుష్మంతుడగును. యెహోవా ఉద్దేశము అతని వలన సఫలమగును" (యెషయ 53:10).**

ప్రముఖ క్రైస్తవ రచయిత సి.యస్.లూయిస్ గారి భార్య మరణించే స్థితిలో ఉండగా ఆయన ఈవిధంగా వ్రాసాడు. "నేను దేవునియందు నమ్మకమును కోల్పేయే ప్రమాదములో లేను గాని, ఆయనను గూర్చి అంత భయంకరమైన విషయాలను నమ్మవలసి రావడములోనే నిజమైన ప్రమాదముందని వ్రాసాడు. ముగింపుగా దేవుడనే వాడు లేడు అనుటలోకన్నా, దేవుడు నిజముగా ఇటువంటి వాడైయున్నాడనుటలో భయము పుట్టుచున్నది" – ఒక వేదనను అనుభవించెను (న్యూయార్కు హర్పర్ కోలిన్సు, 1961 పుటలు 6,7)

కొన్ని విషయాలు బహు వేదన కలిగించేవిగా ఉన్నపుడు, మనలో కొంతమంది దేవుని పూర్తిగా తిరస్కరిస్తారు. ఇతరులకైతే, లూయిస్ వంటి వారికి, దేవుని గూర్చిన అభిప్రాయమును మార్చుకునే శోధన కలుగవచ్చును. మరియు మనవంటి వారికి ఆయనను గూర్చి చెడు విషయాలను ఊహించుకొనవచ్చును. ఇక్కడ తలెత్తే ప్రశ్న ఏమిటంటే దేవుడు ఎంత వేడిని పుట్టిస్తాడు? తన కుమారుని యొక్క స్వరూపములోనికి మనలను మార్పు చేయుటకు తన ప్రజలను పరీక్షించుటకు ఎంత వేడిమిని దేవుడు అనుమతిస్తాడు? (రోమా 8:29).

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** దేవునిని తెలుసుకొని ఆయనను ప్రేమించే మనుష్యులు ఆయనను అపార్థము చేసుకునేంతవరకు ఎందుకు వారిని పరీక్షిస్తాడు? "తన కుమారుని యొక్క స్వరూపములోనికి" ఆయనను ప్రేమించే వారిని మార్పు చేయునిమిత్తము ఆయనను ఎంతవరకు అపార్థము చేసుకొనుటకు దేవుడు అంగీకరిస్తాడు?

–జూలై 30 సబ్బాతుదినమున ఈ వారం పాఠం అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం **జూలై 24**

## కొలిమిలో అబ్రహాము

ఆది 22 చదువుడి. ఎటువంటి వివరణ ఇవ్వకుండానే అకస్మాత్తుగా అబ్రహామును

దేవుడు పిలిచి తన స్వంత కుమారుని దహనబలిగా అర్పించమని చెప్పెను. అబ్రహాము ఏవిధముగా బాధపడి యుంటాడో మనము ఊహించగలమా? పరిశుద్ధుడైన దేవుడు తన స్వంత కుమారుని దహనబలిగా అర్పించమని కోరుట పూర్తిగా విముఖత కలుగజేయు భావమై యున్నది. ఒకవేళ అబ్రహాము తన కుమారుని దహనబలిగా అర్పించుటకు అంగీకరించినను దేవుడు తనకు అనుగ్రహిస్తానని వాగ్దానము చేసిన వారసత్వము సంగతి ఏమిటి? ఆ కుమారుడు లేకుండా ఆ వాగ్దానము యొక్క నెరవేర్పు ఉండదు.

**దహన బలిగా తన కుమారుని అర్పించమని అబ్రహామును దేవుడు ఎందుకు అడిగాడు? దేవుడు సమస్తమును ఎరిగినవాడైతే ఆవిధముగా అడుగుటలో అర్థమేమిటి?**

..........................................................................................

..........................................................................................

"దేవుడు అడిగిన విషయము మరియు ఆ సమయము ముందు వెనుక ఆలోచించకుండా చేసిన విషయము కాదు. అన్ని విషయాలు పరిగణలోనికి తీసుకొనిన తరువాతే దేవుడు అబ్రహామును పిలిచి తన కుమారుని దహనబలిగా అర్పించమని కోరెను. అప్పటికి అబ్రహాము వృద్ధుడైపోయి వయో భారముతో కృంగియున్న దశలో ఎంతో బాధాకరమైన ఆ పరీక్షకు అతడు గురికాబడెను. అతడు విశ్రాంతి పొందాలని కోరుకుంటున్న సమయములో గొప్ప అలజడి జీవితములో ఏర్పడింది" ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు పుట 147.ఈ పరీక్ష పెట్టింది ఒక మతిలేని దేవుడా? కానే కాదు. మానవుని యొక్క విమోచన నిమిత్తమై దేవుడు చేసిన బలియాగములో దాగియున్న వేదనను అబ్రహాము తన జీవితములో తన సొంత అనుభవము ద్వారా అతని జీవితములో చీకటి దినముగా ఉన్న ఆ సమయము గడపవలసి వచ్చినది. –పితరులు మరియు ప్రవక్తలు పుట 154.

అది కేవలం ఒక పరీక్ష మాత్రమే. అబ్రహాము తన కుమారుని దహనబలిగా అర్పించుట ద్వారా అతనిని చంపివేయాలనునది దేవుని ఉద్దేశము ఎన్నడు కాదు. పూర్తి చేయలేని విషయాన్ని చేయమని దేవుడు మనలను అడుగవచ్చును. కొన్ని చేరలేని ప్రదేశాలకు వెళ్ళమని ఆయన చెప్పవచ్చును. అంతము ఏమైయున్నది అనునది దేవునికి ప్రాముఖ్యమైన విషయము కాదు గాని దాని ద్వారా మనము ఏమి నేర్చుకొనుచున్నామనే విషయము ప్రాముఖ్యమైనది.

యేసు యూదులతో మాట్లాడినప్పుడు అబ్రహాము యొక్క అనుభవమును గూర్చి ఆలోచించి యుండవచ్చును.

"మీ తండ్రియైన అబ్రహాము నా దినము చూతునని మిగుల ఆనందించెను. అది చూచి సంతోషించెను అనెను" (యోహాను 8:56). అది సాతాను యొద్ద నుండి వచ్చిన స్వరమైయుంటుందని అబ్రహాము ఆ పరీక్ష నుండి తప్పించుకొనియుండవచ్చును. అయితే

ఈ విషయమంతటిలో అబ్రహాము దేవుని యొక్క స్వరమును గుర్తు పట్టుట నేర్చుకొనెను.

**దేవుని స్వరమును నీవెట్లు తెలుసుకొనగలవు? దేవుడు నీతో మాట్లాడుచున్నాడని నీవెట్లు తెలుసుకొనగలవు? ఏవిధానముల ద్వారా దేవుడు తన చిత్తమును నీకు తెలియజేస్తాడు?**

సోమవారం జూలై 25

## మొండి వైఖరి కలిగిన ఇశ్రాయేలీయులు

హోషేయ యొక్క వృత్తాంతము మనకు కొన్ని శక్తివంతమైన గుణపాఠములను బోధించుచున్నది. హోషేయ యొక్క పరిస్థితులు అసాధారణమైనవి. అతని భార్య గోమెరు పారిపోయి ఇతర పురుషులతో పిల్లలను కన్నది. లైంగిక పరముగా ఆమె తన భర్తకు అపనమ్మకస్తురాలుగా ఉన్నది. అట్టి స్థితిలో ఆమె ఉండగా దేవుడు హోషేయను పిలిచి తన భార్యయైన గోమెరును తిరిగి తన గృహమునకు తీసుకొని వచ్చి ఆమె యెడల తన ప్రేమను చూపించమని చెప్పెను. ఈ వృత్తాంతము ఒక ఉపమానముగా దేవుని గూర్చి మరియు ఇశ్రాయేలీయులను గూర్చి చెప్పబడుచున్నది. ఇశ్రాయేలీయులు దేవుని విడిచి పెట్టేసారు. ఆత్మీయముగా ఇతర దేవతలతో వ్యభిచారము చేసారు. అయినా దేవుడు వారిని ప్రేమించాడు. మరియు తన ప్రేమను వారికి చూపించాలని కోరుకున్నాడు. అయితే దేవుని పద్ధతులనొకసారి పరిశీలించండి.

**హోషేయ 2:1-12 చదువుడి. ఇశ్రాయేలీయులను తన ప్రక్కకు తిరిగి చేర్చుకొనుటకు దేవుడు ఏ పద్ధతులను అనుసరించెను. ఈ అనుభవములను గూర్చి ఏవిధముగా భావించారు?**

హోషేయా 2:2,3 ..........................................................................

హోషేయా 2:5-7 .......................................................................

హోషేయా 2:8,9 ........................................................................

హోషేయా 2:10 .........................................................................

దేవుడు మనలో మారు మనసు కలిగించాలని కోరినపుడు ఆయనను గూర్చి మన అనుభవము విషయములో రెండు సంగతులను ఈ వృత్తాంతము లేవనెత్తుచున్నది.

మొదటగ, దేవుడు పని కలిగియున్నాడనే విషయాన్ని మనము గుర్తించకుండా తప్పు చేస్తున్నాము. ఇశ్రాయేలీయులు కఠినమైన అనుభవములను ఎదుర్కొనినప్పుడు, వారి దేవుడు రక్షణ కొరకు పనిచేయుచున్నాడనే విషయాన్ని వారు గుర్తించి యుండకపోవచ్చును. మన మార్గము వెంబడి ముళ్ళ కంచెలున్నపుడు లేక మనము ఎక్కడికి వెళ్ళాలో తెలియని పరిస్థితులు ఏర్పడినప్పుడు, మనము ఎటువెళ్ళుచున్నామో తెలుసుకోలేని స్థితిలో ఉంటాము (హోషేయ 2:6) మనలను నడిపించుచున్నది దేవుడేనా అని అనిపిస్తుంది. మన కనీస అవసరాలు అందనప్పుడు చికాకు పడుదుము (హోషేయ

2:9,10) మనము ఏవిధముగా భావించినప్పటికి దేవుడు మాత్రము మనలను మారుమనస్సు పొందే దిశగా పనిచేస్తూ ఉంటాడు. ఆయన మనలను ఎంతగానో ప్రేమించుచున్నాడు.

రెండవదిగా దేవుడు పనిలో ఉన్నప్పుడు మనము ఆయనను అపార్ధము చేసుకుంటాము. దేవుడు పనిలో ఉన్నాడని మనము గుర్తించవచ్చును గాని ఆ పని మనకు ఇష్టములేనిదై యుండవచ్చును. అటువంటి సందర్భములో దేవునిని మనము నిందిస్తూ ఉంటాము. అయితే దేవుడు మాత్రము తన నిబంధన ప్రేమ ద్వారా మనలను ప్రేమించుచునే ఉంటాడు.

**హోషేయా 2:14-23 చదువుడి. ఈ వాక్యములు దేవుని గూర్చి ఏమి బయలుపర్చుచున్నవి? నీ జీవితానికి సంబంధించిన ఏదో ఒక విషయములో దేవుని నుండి నీవు పారిపోవుచున్నావేమో చూపించమని పరిశుద్ధాత్మను అడగండి. దేవునికి నిన్ను నీవు సంపూర్ణముగా సమర్పించుకొనకుండా ఏ విషయము నిన్ను ఆపివేయుచున్నది?**

**మంగళవారం** **జూలై 26**

**ఆరాధించుట ద్వారా బ్రతికియుండుట**

**యోబు 1:6-2:10 చదువుడి. యోబు శ్రమలకు కారణమేమిటి?**

..............................................................................................

..............................................................................................

ఆశ్చర్యమును కలిగించే విషయము ఇక్కడ ఒకటున్నది. దేవుని చూచుటకు దూతలు వచ్చిరి మరియు సాతానుడు వారి వెంబడి వచ్చెను. ఎక్కడకు వెళ్ళితివని దేవుడు సాతాను నడుగగా అతడు "భూమి మీద అటు ఇటు తిరుగులాడుచు అందులో సంచరించుచు వచ్చితినని చెప్పెను" (యోబు 1:7). అప్పుడు "నీవు నా సేవకుడైన యోబు సంగతి ఆలోచించితివా అని దేవుడు ప్రశ్నించెను" (యోబు 1:8) ఆ ప్రశ్నలో అసాధారణత ఏమి లేదు గాని ఆ ప్రశ్నను వేసిన దేవుడే అసాధారణమైనవాడు. పరీక్షింపబడుటకు యోబు తగిన వాడని సాతాను చెప్పలేదు గాని దేవుడే ఆ సలహా ఇచ్చాడు. ఏమి సంభవించనైయున్నదో ఎరిగినవాడై దేవుడు యోబును సాతాను దృష్టికి తెచ్చెను. భూమి మీద ఉన్న యోబునకు తన కొలిమి ఎంత వేడి చేయబడుతుందో అనే విషయమును గూర్చి ఏ మాత్రము తెలియదు. ఇక్కడ యోబు యొక్క శ్రమలకు కారణము సాతానుడే అయినను, యోబు యొక్క సంపదను, పిల్లలను, శారీరకమైన ఆరోగ్యమును నాశనము చేయుటకు సంపూర్ణమైన అధికారమును దేవుడే సాతానుకు ఇచ్చెను. యోబు శ్రమలను ఎదుర్కొనవలసి యున్నదని దేవుడే అనుమతిని ఇచ్చుచున్నయెడల, అది

సాతాను చేసాడా లేక దేవుడే చేసాడా అనుకొనుటకు అందులో తేడా ఏముంది? యోబునకు సాతాను ద్వారా అటువంటి శ్రమలను దేవుడు అనుమతించినపుడు దేవుడు ఏవిధముగా నీతిమంతుడు మరియు పరిశుద్ధుడు అవుతాడు? అది ఒక ప్రత్యేకమైన సన్నివేశమా లేక నేటికి మనతో కూడా దేవుని యొక్క స్వభావము చొప్పున ఆవిధముగా చేయుచున్నాడా?

**యోబు 1:20,21లో వేదనలకు యోబు ఏవిధంగా స్పందించాడు?**

..............................................................................................

..............................................................................................

అటువంటి వేదనను రెండు విధాలుగా ఎదుర్కొనడం సాధ్యమేనా తీవ్రమైన కోపముతో అనగా అసలు దేవుడనేవాడు లేడు. ఉండి ఉంటే ఇదంతయు ఎందుకు సంభవిస్తుందని దేవునికి వ్యతిరేకముగా ప్రవర్తింపవచ్చును. లేక ఇంకా గట్టిగా దేవునిని హత్తుకొని జీవించవచ్చును. యోబుకు సంబంధించిన వినాశనములో కూడా దేవుని సన్నిధిలో ఆయనకు ఆరాధన చేయుచు జీవించియున్నాడు.

ఆందోళన చెందియున్నపుడు మూడు విధాలైన ఆరాధనను చేయవచ్చునని యోబు 1:20,21లో చూడగలము. మొదటగా యోబు తన నిస్సహాయ స్థితిని అంగీకరించి తరువాత అతడు దేనిని కూడా పొందుటకు అర్హుడు కాదని గుర్తించెను.

“నేను నా తల్లి గర్భములోనుండి దిగంబరినై వచ్చితిని దిగంబరినై అక్కడకు తిరిగి వెళ్ళెదను” (యోబు 1:21) రెండవదిగా దేవుడు ఇప్పటికి సమస్తమును తన స్వాధీనములో ఉంచుకొనెనని యోబు గుర్తించెను. “యెహోవా ఇచ్చెను. యెహోవా తీసుకొనిపోయెను” (యోబు 1:21) మూడవదిగా యోబు దేవుని యొక్క నీతిని నమ్మికొని ఆయనయందు తన విశ్వాసము తెలియపర్చెను’. “యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక” (యోబు 1:21).

**శోధనలు ఎదుర్కొనుచున్నావా? యోబు అనుసరించిన మెట్లను వెంబడించండి. నీకు కూడా అవి సహాయపడతాయా?**

**బుధవారం** **జూలై 27**

## నిరీక్షణ ద్వారా బ్రతుకుట

“సహోదరులారా, ఆసియాలో మాకు తటస్థించిన శ్రమను గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టము లేదు. అదేదనగా మేము బ్రదుకుదుమను నమ్మకము లేక యుండునట్లుగా మా శక్తికి మించిన అత్యధిక భారము వలన క్రుంగిపోతిమి. మరియు మృతులను లేపు దేవునియందే గాని, మాయందే మేము నమ్మికయుంచకుండునట్లు మరణమగుదుమను నిశ్చయము మా మట్టుకు కలిగియుండెను” (2కొరింథి 1:8,9).

దేవుని చేత ఎన్నిక చేయబడిన అపొస్తలునిగా పౌలు ఇతరులు సహించిన దానికన్నా ఎక్కువ సహించాడు. అయినప్పటికి పౌలు నలుగగొట్టబడలేదు. దేవుని స్తుతించుటలో అతను ఎదిగియున్నాడు. 2కొరింథి 11:23–29లో పేర్కొనబడిన అతని శ్రమల పట్టీని చదవండి. ఇపుడు 2కొరింథి 1:3–11 చదువుడి.

**2 కొరింథి 1:4లో దేవుని యొక్క కరుణ మరియు ఆదరణను పొందుటకు పౌలు పేర్కొనిన కారణమును చూడుడి. ఎట్టి శ్రమలలో ఉన్న వారినైనను ఆదరించుటకు శక్తిగల వారమగునట్లు ఆయన మా శ్రమ అంతటిలో మమ్ములను ఆదరించుచున్నాడు. "దేవుని సేవా పరిచర్య పిలుపులో శ్రమ ఎంతవరకు ఇమిడియుంటుంది? శ్రమ ఉంటుంది కాబట్టి ఏవిధముగా దానిని ఎదుర్కొనగలము?**

..........................................................................................

..........................................................................................

గాయపడిన ప్రజలకు మన ద్వారా దేవుడు పరిచర్య చేయాలని కోరుచున్నాడు. అనగా మనము అట్టి వారికి పరిచర్య చేయకపూర్వము ముందుగా గాయపర్చబడుట అనే అనుభవములోనికి నడిపిస్తాడు. అప్పుడు మనము ఊహపై ఆధారపడిన ఆదరణను వారికి అందించడము కాకుండా మన స్వీయ అనుభవము ద్వారా దేవుని యొద్ద నుండి పొందిన కరుణ మరియు ఆదరణతో వారిని ప్రోత్సహిస్తాము. ఇది యేసు జీవితము నుండి వచ్చిన ఒక సత్య సూత్రము (హెబ్రీ 4:15).

పౌలు ఎదుర్కొనిన శ్రమలను చాలా స్పష్టముగా వివరించుట ద్వారా మనము ఆయనకు మన విచారమును తెలియజేస్తామని గాని ఆయన ఉద్దేశము కాదు. మనలను కూడా అట్టి ప్రమాదకరమైన లోతులలో కూరుకుపోయినను, దేవుని యొక్క కరుణ మరియు ఆదరణ కూడా లభించుననే విశ్వాసము మనలో వృద్ధి చెందుటకు ఆవిధముగా వివరించాడు. మన జీవితాలను గురించి నిరుత్సాహపడినను, చంపబడినను భయపడవద్దు. దేవుని మీద ఆధారపడమని ఆయన మనకు బోధించుచున్నాడు. మన దేవుడు మృతులను లేపు దేవుడు కాబట్టి ఆయనయందు మన నమ్మకముంచాలి (2కొరింథి 1:9).

పౌలు సువార్తను ప్రకటించేపని మీద తన దృష్టిని పెట్టాడు కాబట్టి భవిష్యత్తులో కూడా దేవుడు ఆయనను కాపాడునని ఆయనకు తెలుసు. పౌలు తన సువార్త పరిచర్యలో స్థిరముగా నిలువబడే సామర్థ్యత కలుగుటకు మూడు కారణాలను 2కొరింథి 1:10,11లో పేర్కొన్నాడు. మొదటగా దేవుడు తన సామర్థ్యాన్ని నిరూపించాడు.

"ఆయన అట్టి గొప్ప మరణము నుండి మమ్మును తప్పించెను. ఇక ముందుకును తప్పించును" (2కొరింథి 1:10).

రెండవదిగా దేవుని మీద తన దృష్టిని నిలపాలనే పౌలు యొక్క దృఢ

సంకల్పమైయున్నది "ఆయనయందు నిరీక్షణ గలవారమై యున్నాము" (2కొరింథి 1:10). మూడవదిగా విశ్వాసులు పౌలు కొరకు నిరంతరము ప్రార్థించుచున్నారు. మా కొరకు ప్రార్థన చేయుట వలన మీరు కూడా సహాయము చేయుచున్నారు (2కొరింథి 1:10,11).

**నీవు ఎదుర్కొనుచున్న శ్రమల మధ్య నీ మీద నీవే జాలిపడకుండా ఉండుటకు పౌలు నుండి నీవేమి నేర్చుకొనుచున్నావు?**

**గురువారం** **జూలై 28**

## తీవ్రమైన వేడి

ఇప్పటివరకు ఈ త్రిమాసములోని పాఠముల ద్వారా శ్రమలకు సంబంధించి అనేక ఉదాహరణలు పరిశీలించాము. క్రీస్తును పోలిన పరిశుద్ధతను మన జీవితాలలో తీసుకొని వచ్చుటకు బంగారములో ఉన్న మలినములను తొలగించుటకు దానిని కొలిమిలో కాల్చి కరిగించినపుడే శుద్ధ బంగారము వచ్చునట్లు దేవుడు ప్రేమించిన తన బిడ్డల యెడల కూడా ఆవిధంగా శుద్ధి చేయుననే విషయాన్ని తెలుసుకున్నాము. అందును బట్టి ఆవిధంగా శుద్ధి చేయుననే విషయాన్ని తెలుసుకున్నాము. అందును బట్టి దేవుడంటే తీవ్రముగా శిక్షించి పని చేయించే ఒక క్రూరమైన అధికారితో పోల్చబడుచున్నాడు. దేవుడు మనలో ఏదో మంచిని ఆశించి ఆవిధంగా శ్రమలను అనుమతిస్తున్నాడు తప్ప ఆయన నిజముగా కొందరు ఊహించుచున్నట్లు క్రూరమైనవాడు కాదని చెప్పే వారు కూడా ఉన్నారు.

పాపముతో నిండిన ఈ భూమి మీద ఏమి జరుగుతుందని పూర్తిగా అర్థము చేసుకోలేము. అది నిజమే. పరలోకములో ఎన్నో విషయాలను మనము అర్థము చేసుకొనబోవుచున్నాము (1కొరింథి 13:12). అయితే ఇపుడు మాత్రము తీవ్రమైన ఒత్తిడితో జీవిస్తూ దేవుడున్నాడు. అన్ని సమయాలలో అన్ని విషయాలలో మంచిగా లేకపోయిన ఆయన మనలను కాపాడుచున్నాడనే నమ్మకముతో జీవించుచున్నాము. మానవులు ఎదుర్కొనే తీవ్రమైన ఒత్తిడి గురించి యెషయా చక్కగా వివరిస్తున్నాడు.

యెషయా 43:1-7 చదువుడి. 2వ వాక్యములో తన ప్రజలు నీటి ప్రవాహము గుండా, అగ్నిగుండా నడిచి వెళ్ళెదరని దేవుడు చెప్పాడు. ఇవి తీవ్రమైన ప్రమాదాలకు సూచనగా ఉపమానాల రూపములో తెలియపర్చబడినవి. ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రమును మరియు యోర్దాను నదిని దాటి వెళ్ళినపుడు కలిగిన భయాందోళనను గుర్తు చేయుటకును అట్టి సమయములో దేవుడు వారిని ఏవిధంగా కాపాడెనో అనే విషయాన్ని జ్ఞాపకము చేసుకొనుటకు వీలుగా పైన వాక్యాలు వ్రాయబడినవి. అయితే

దేవుడు అట్టి ప్రమాదకరమైన మార్గాల గుండా నడిపించుటకు బదులు సులభమైన మార్గాలగుండా నడిపించవచ్చును గదా అని చెప్పేవారు కూడా ఉంటారు. అయితే కీర్తన 23లోని గొఱ్ఱెల కాపరిని గుర్తు చేస్తూ ప్రమాదకరమైన పరిస్థితులలో కూడా దేవుడు తన ప్రజలను సురక్షితమైన రీతిలో నడిపించగలడని తెలుస్తుంది. దేవుడు తోడుగా ఉన్నాడు కాబట్టి మనము భయపడవలసిన అవసరముండదు.

**యెషయా 43:1–7 చదువుడి. జలముల వెంబడి నడిచినను, అగ్నిగుండా నడచినను దేవుడు తన ప్రజలను సురక్షితము గాను, ఆదరణతో ఆయన అనేక విధానాలను ఎంచుకుంటాడు. దేవుడంటే ఏమైయున్నాడని నీ మనసులో లిఖించబడింది? నీ కొరకు ఏ వాగ్దానములు నెరవేరాలని నీవు కోరుకుంటావు?**

దేవుని ద్వారా కలిగే కొలిమి 3 విధాలుగా ఉంటుంది.

మొదటగా మనలను కాదు గాని మన పాపమును నాశనము చేయుటకు దేవుడు తీవ్రమైన వేడిని కలిగియుంటాడు.

రెండవదిగా దేవుడు కలిగియున్న తీవ్రమైన వేడి మనలను దుఃఖించేవిధంగా చేయాలని కాదు గాని, మనలను శుద్ధి చేసి పరిశుద్ధులనుగా చేయుట కొరకని మనము గుర్తించాలి.

మూడవదిగా దేవుని కాపుదల మన యెడల నిరంతరము ఒకే విధంగా ఉంటుంది. మరియు మన యెడల ప్రేమ కలిగి ఉంటాడు. మనలను ఎన్నడు ఒంటరిగా విడువడు. ఏమి సంభవించినా ఆయన మన వెంట ఉంటాడు.

**దేవుని యొక్క స్వభావమును గూర్చి ఆయన చేయు క్రియలను గూర్చి ఈ వాక్యాలు ఏమి బోధిస్తున్నాయి? కీర్త 103:13,14; మత్త 28:20; 1కొరింథి 10:13; 1పేతురు 1:7 నీ జీవితంలో ఈ వాక్యాల నిజరూపాన్ని ఎట్లు అనుభవపూర్వకముగా తెలుసుకున్నావు?**

శుక్రవారం జూలై 29

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలులోని "విశ్వాసము పరీక్షించబడెను" పుటలు 145, 155. సంఘమునకు సాక్ష్యములు సంపుటి 5లోని "ప్రభువును స్తుతించుడి" పుటలు 315–319 చదువుడి.

దేవుడు తన ప్రజలను ఎల్లప్పుడు వేదన అనే కొలిమిలో పరీక్షించెను. కొలిమి వేడి వలననే నిజమైన బంగారములోని మలినములు తొలగించబడును. అదే రీతిలో క్రైస్తవ ప్రవర్తనలో ఉన్న లోపాలు సవరించబడును. యేసు ఆ పరీక్షను పరిశీలిస్తూ ఉంటాడు. విలువైన బంగారమును శుద్ధి చేయుటకు ఏమి అవసరమో ఆయనకు తెలుసు. దేవుడు తన సేవకులను తీవ్రమైన శోధనల ద్వారా క్రమశిక్షణలో పెట్టును.

కొందరిలో ఆయన సేవను ముందుకు తీసుకొని వెళ్ళగలిగే సామర్థ్యముంటుంది. అట్టి వారిని ఆయన పరీక్షిస్తాడు. వారిలో ఉన్న బలహీనతలు వారికి తెలియపరుస్తాడు. తన మీద ఆధారపడే విధముగా వారికి బోధిస్తారు. ఆయన సంకల్పము చొప్పున ఉన్నతమైన హోదాను వారికి అనుగ్రహించి ఆయన లక్ష్యాన్ని నెరవేర్చుకొనును" –ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుటలు 129, 130.

దేవుని యొక్క సంకల్పము చొప్పున మనము శోధనలను భరించవలసినచో, సిలువను అంగీకరించి, ఆ గిన్నెలోని చేదైన చిరకను త్రాగాలి. పరలోకపు తండ్రి ఆ గిన్నెను మన పెదవులకు అందిస్తాడని గుర్తించాలి. చీకటిలోను, వెలుగులోను ఆయనను నమ్మాలి. దేవుడు మన మేలు కోరి ప్రతి విషయాన్ని చేస్తున్నాడన్న సత్యాన్ని నమ్మలేమా? ఆయన కల్వరి సిలువపై చూపిన ప్రేమను గుర్తుచేసుకొని మనకు వేదన కలిగినపుడు ఆయనను తిరస్కరిద్దామా? –ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 5, పుట 316.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మీ తరగతిలో ఎవరైనా ఒకరు విశ్వాసమును బట్టి పరీక్షింపబడ్డారు అనే విషయాన్ని వివరించుటకు ప్రోత్సహించుడి. అబ్రహాము పరీక్షింపబడినంత తీవ్రముగా మీరు పరీక్షింపబడకపోవచ్చును. ఆ వ్యక్తి యొక్క స్వీయ అనుభవము ద్వారా నీవేమి నేర్చుకుంటావు?

2. క్రీస్తు సిలువ వేయబడక ముందు గడచిన 24 గంటలలో ఆయన జీవితాన్ని గూర్చి పరిశీలించండి. ఆయన ఎదుర్కొన్న తీవ్ర సంగతులు ఏమిటి? ఆయన ఏవిధంగా సహించాడు. మనము శ్రమలనెదుర్కొన్నపుడు ఆయననుండి నేర్చుకున్న విషయాలు ఎట్లు అమలుపర్చగలము?

3. ఈ వారం పాఠమును నేర్చుకున్నట్లు మనము శ్రమల నెదుర్కొనుట ద్వారా, శ్రమలలో ఉన్న వారికి పరిచర్య చేయగలము. ఈ భావముతో పరిచర్య చేస్తే ఏ సమస్యలనెదుర్కొనవలసి వస్తుంది?

❖❖❖

6వ పాఠం జూలై 30-ఆగష్టు 5

# బలముగా పోరాడుట

## సబ్బాతు మధ్యాహ్నము జూలై 30

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : యోహాను 16:5-15; కొలొస్స 1:28,29; 1పేతురు 1:13; మత్తయి 5:29; ఆది 32.**

**కంఠతవచనం: "అందునిమిత్తము నాలో బలముగా కార్యసిద్ధి కలుగజేయు ఆయన క్రియా శక్తిని బట్టి నేను పోరాడుచు ప్రయాసపడుచున్నాను" (కొలొస్స 1:29).**

ఒక టి.వి పరిచయ కార్యక్రమములో స్త్రీ పురుషులిద్దరు కలిసి కూర్చున్నారు. ఇరువురు కూడా ఒక్కొక్క చిన్న బిడ్డ హత్య కావించబడిన సంఘటనలో వేదన అనుభవించారు. 20 సం॥ల క్రితము ఆ స్త్రీ యొక్క కుమారుడు హత్యకు గురయ్యాడు. అప్పటి నుండి ఆమెకు మితిమీరిన కోపము ద్వేషము కలిగియుంది. ఆ పురుషుడైతే ఆమెకు విరుద్ధముగా ఉన్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం ఉగ్రవాదులు అతనికుమార్తెను చంపివేసారు. తన కుమార్తెను హత్య చేసిన వారి యెడల ఆ పురుషుడు క్షమాపణను గూర్చి మాట్లాడుచున్నాడు. మరియు అతని గాయమును దేవుడు ఏవిధముగా మాన్పియున్నాడో వివరించాడు. అతడెంత బాధను అనుభవించినను అటువంటి చీకటి సమయాలలో దేవుడు తీసుకొని వచ్చే స్వస్థతకు అతడు ఉదాహరణగా నిలిచాడు.

ఇద్దరు వ్యక్తులు ఇంత విభిన్నముగా ఎలా స్పందించగలిగారు? ఒక క్రైస్తవుని జీవితములో ఆధ్యాత్మిక మార్పు ఏవిధముగా సంభవిస్తుంది. ఆ వ్యక్తి శోధనలనే కొలిమిలో వెళ్ళినను జీవితములో ఏవిధముగా పరిణతి చెందగలిగాడు?

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** మనకున్న మనో శక్తి మరియు మన తలంపులు పాపము యెడల మరియు ఒకని వ్యక్తిత్వము యెడల ఎటువంటి పాత్ర పోషిస్తుంది? మన భావములపై ఆధారపడి మనము తీసుకునే నిర్ణయాలు ఉండకూడదని ఏవిధముగా దానిని సాధించగలము? మనము శోధనలో ఉన్నపుడు లేక కొలిమిలో ఉన్నప్పుడు సహించాలే గాని దానిని నుండి తప్పించుకొనుటకు ఎందువలన మనము ప్రయత్నించకూడదు?

– ఆగస్టు 6 సబ్బాతు దినమున ఈ వారం పాఠంను అధ్యయనము చేయుటకు సిద్ధపడాలి.

## ఆదివారం జూలై 31

### సత్య స్వరూపియైన ఆత్మ

"దేవా దయ చేసి నన్ను మంచిగా చేయి" అని నీవెపుడైన ప్రార్థించావా? అయితే కొద్దిగా కూడా మార్పు సంభవించలేదా? మన జీవితాలలో ఎటువంటి మార్పు కనిపించనపుడు

గొప్ప మార్పు చేసే దేవుని యొక్క శక్తి కొరకు ఏ విధముగా ప్రార్థించగలము? దేవునికున్న లోకాతీతమైన మరియు అపరిమితమైన వనరులను ఆయన ఉచితముగాను మరియు ఎంతో సంతోషముగాను మనకు పంచి పెడుతున్నాడని తెలుసు. దేవుని యొక్క ఆ మంచి స్వభావమును మనకు అనుకూలముగా మార్చుకొని ఆయన అనుగ్రహించే దీవెనలకు సమానమైన మార్పు కలిగిన జీవితము ఉండనవసరం లేకుండానే వాటిని పొందాలనుకొనుచున్నాము.

ఎందువలన ఆవిధముగా మనము ఆశించుచున్నాము? దానికొక కారణమున్నది. మనలను మార్చి వేయగల శక్తి దేవుని ఆత్మకు అపారముగా ఉన్నను దేవుడు ఏమి చేయగలడో దానిని పూర్తిగా చేయనీయకుండా మన సొంత నిర్ణయాల ప్రకారము దానిని పరిమితం చేయగలము.

**యోహాను 16:5-15 చదువుడి. ఈ వాక్యాలలో యేసు పరిశుద్ధాత్మను "సత్యస్వరూపియైన ఆత్మ" అని పిలుస్తున్నాడు. (యోహాను 16:13) మనకు పరిశుద్ధాత్మ ఏమి చేసాడని ఈ వాక్యము సూచించుచున్నది?**

..............................................................................................

..............................................................................................

పరిశుద్ధాత్మ మనకు మన పాపముల విషయమైన సత్యమును గూర్చి తెలియపర్చినను మనము మారుమనస్సు పొందే విధముగా మనలను చేయలేదు. దేవుని గూర్చిన ఈ సత్యమును పరిశుద్ధాత్మ మనకు బయలుపర్చగలడు. ఆ సత్యమును మనము నమ్మాలని గాని లేక దానికి విధేయులమై యుండాలని గాని పరిశుద్ధాత్మ మనలను బలవంతము చేయలేదు. ఏ విషయములోనైనా దేవుడు గనుక మనలను ఏమాత్రమైన బలవంతము చేసిన యెడల మన స్వేచ్ఛా చిత్తమును పోగొట్టుకుంటాము. అప్పుడు దేవుడు మన మనస్సుల మీద, మన హృదయాలలోను ఒత్తిడి తీసుకొని వచ్చి తన పక్షమున మనలను త్రిప్పుకుంటున్నాడని మహా గొప్ప పోరాటములో సాతానుడు దేవుని నిందిస్తాడు. పరలోకములో యుద్ధము జరిగినప్పుడు మన తండ్రి సాతానుని గాని, ఇతర దూతలను గాని ఏ ఒక్కరిని తన పక్షమున ఉండమని, ఆయన న్యాయవంతుడు మరియు మంచివాడని బలవంతము చేయలేదు. అదేవిధముగా ఏదెను వనములో మంచిచెడ్డల తెలివినిచ్చు చెట్టు యొక్క ఫలములను గూర్చి కూడా ఎవరిని బలవంతము చేయలేదు. లేక ఆదాము మరియు అవ్వలను వారు ఇష్టపూర్వకముగా ఆ చెట్టు ఫలములను తినుచున్నప్పుడు అడ్డుకొనలేదు. ఆ చెట్టును గూర్చిన సత్యమును వారికి ముందుగానే వివరించాడు. ఆయన మాటను వినాలా లేక అక్కరలేదా అనే స్వేచ్ఛను ఆయన వారికే విడిచి పెట్టెను. అటువంటి దేవుడు నేడు మనతో వేరుగా ప్రవర్తించడు. అందునుబట్టి పరిశుద్ధాత్మ దేవుని గూర్చి పాపమును గూర్చిన సత్యమును అందించిన తరువాత "నీవేమి చేస్తావనే నిర్ణయాన్ని అతడు మనకే విడిచిపెడతాడు".

మనము వేదనలను ఎదుర్కొనుచున్నపుడు ఆ విధముగానే ఉంటుంది. కొన్నిసార్లు

మనము మన పాపముల విషయమై మారుమనసు చెందకుండా లేక సత్యమునకు విధేయత చూపకుండా ఉంటే మనలను మనమే కొలిమిలోకి నడిపించుకుంటున్నాము. అట్టి స్థితిలో మన తండ్రి మన పక్షాన పనిచేయాలని కోరిన యెడల ఆయన శక్తికి అవకాశమును, స్వేచ్ఛా వాతావరణములో అవకాశమును ఇవ్వాలి. అప్పుడు ఆయన మనలను పూర్తిగా మార్చును.

**ఈ మధ్య కాలములో "సత్య స్వరూపియైన ఆత్మ" ఏయే పాపాలను ఒప్పుకొనుటకు మన దృష్టికి తీసుకొనివచ్చెను? ఆయన స్వరమునకు మనము ఎంత మంచిగా స్పందిస్తున్నాము? నీ స్వేచ్ఛా చిత్తముతో ఎటువంటి నిర్ణయాలు నీవు తీసుకుంటున్నావు?**

సోమవారం ఆగస్టు 1

## దైవ - మానవ కలయిక

గొప్ప నైపుణ్యతతో ఇంతవరకు నీవు సాధించినదేమిటి. ఏదో నీవు నీ పడక మీద నుండి లేచిన వెంటనే వాటన్నిటిని నీవు సాధించి సమకూర్చలేదు. ఈ జీవితములో ఏదైనా విలువైన విషయాన్ని సాధించాలనుకున్నపుడు అది మన సమయమును మరియు ప్రయత్నము లేక మన ప్రయాసను తీసుకుంటుంది. మనము క్రీస్తుకు శిష్యులముగా ఉండుటకూడా దీనికి విరుద్ధముగా జరిగేది కాదు.

**కొలస్స 1:28,29 చదువుడి. పౌలు జీవితములో దేవుడు పనిచేయుచున్నను అందులో మానవ ప్రయత్నము కూడా ఉన్నదని ఏవిధముగా అతడు చూపాడు? ద్వితి 4:4; లూకా 3:24; 1కొరింథి 9:25 మరియు హెబ్రీ 12:4 చూడుడి.**

..........................................................................................

..........................................................................................

పౌలు తన పనిలో దేవునితో ఉన్న తన సహవాసమును చూస్తున్నాడు. అతడు తన పనిలో ప్రయాసపడుచున్నాడు. అయితే ఒంటరిగా కాదు. దేవుని యొక్క శక్తితో ప్రయాసపడుచున్నాడు.

"లేబరు" అనే గ్రీకు పదమును "అలసిపోయినంతగా పనిచేయుట" అని తర్జుమా చేయబడినది. ఈ మాటను ప్రత్యేకముగా క్రీడాకారులు వారు పొందే తర్ఫీదును సూచించే విధముగా వాడబడినది. తరువాత వచ్చే మాట స్ట్రగుల్‌ను కొన్ని భాషలలో "మిక్కిలి దుఃఖపడుట" లేక బాధపడుట అనే అర్ధాన్నిస్తుంది. ఇక్కడ మనకు క్రీడాకారుడు ఒకడున్నాడు. అతడు విజయము సాధించుటకే ప్రతి ప్రయత్నము ఉంటుంది. ఈ భావమునకు పౌలు వేరొక భావమును జతచేస్తున్నాడు. తనకు కలిగిన ప్రతిదానితో పౌలు బాధపడుట లేదు గాని దేవుడిచ్చే ప్రతి విషయములోను ఆయన ప్రయాపడుచున్నాడని తెలియజేస్తున్నాడు. అందుచేత పౌలు యొక్క క్రైస్తవ పరిచర్యలో ఆయన వ్యక్తిగత ప్రయత్నములో క్రమశిక్షణ పాటిస్తూ దేవుని యొక్క మహా శక్తితో ప్రయాపడ్డాడు. ఇదే బాంధవ్యము మనలో క్రీస్తు యొక్క స్వభావము అభివృద్ధి చెందులాగున పనిచేస్తుంది.

ఈ తలంపు మనకు చాలా అవసరము. ఎందువలనంటే మనము జీవించుచున్న ఈ లోకములో తక్కువ ప్రయాసతో ఎక్కువ ఫలితాన్ని ఆశించుటకు అలవాటు పడ్డాము. అదే భావము క్రైస్తవ్యములోనికి కూడా పాకింది. కొంతమంది క్రైస్తవ బోధకులు మీరు కేవలం నమ్మినయెడల పరిశుద్ధాత్మ మీ మీద కుమ్మరింపబడుతుంది. అప్పుడు మీరు మానవాతీతమైన శక్తితో అనేక అద్భుతములను చేయవచ్చునని వాగ్దానము చేస్తున్నారు. అయితే ఇది చాలా ప్రమాదకరమైన అర్ధ సత్యము. ఎందువలనంటే మనం కేవలం సుఖముగా ఒక చోట కూర్చొని వేచియున్నట్లయితే దేవుని యొక్క శక్తివస్తుందని నమ్మువిధంగా ఆ బోధలుంటాయి.

**పౌలు మాట్లాడుచున్న ప్రయాస విషయమై నీ వ్యక్తిగత అనుభవము ద్వారా నీకేమి అర్ధమగుచున్నది? నీవు ప్రయాసపడుచున్న ఏవిషయాలను దేవుడు నీ హృదయం మీద మోపాడు. దేవుని చిత్తమునకు నిన్ను సమర్పించుకొనుటకు నీవు ఏవిధముగా నేర్చుకొనగలవు?**

మంగళవారం ఆగష్టు 2

## క్రమశిక్షణతో కూడిన చిత్తము

మన చిత్తమునకు సొంత అనుభూతులే గొప్ప శక్తులలో ఒకటైయున్నవి. మన భావమును లేక స్పర్శను ఉత్తేజపరచి మన ఆవేశములను, భావములను రేకెత్తించే విధముగా ఇప్పుడు సమాజములో చలన చిత్రములు, సంగీతము ఉన్నవి. అవి సంప్రదాయములను సహితము దాటుకొని ఎక్కడికో తీసుకువెళ్తున్నవి. మనలో కోపమును, భయందోళనలను లేక శారీరక వాంఛలను మనకు తెలియకుండానే సృష్టిస్తున్నాయి. మనము నేటి సాయంత్ర భోజనమునకు ఏమి తిందుము? నేడు నేను ఏమి చేయాలనుకొనుచున్నాను? ఫలాన వస్తువు కొనాలంటే నేను దాని విషయమై మంచి అభిప్రాయముతో ఉన్నానా? ఇటువంటి తలంపులు మనము తీసుకొనే తీర్మానముపై ప్రభావము చూపిస్తున్నాయి. భావములన్నియు కేవలం చెడ్డవి కానవసరం లేదు. అయితే కొన్ని విషయాలలో మనము తీసుకొనే నిర్ణయాలలో మన భావములు అడ్డు తగులవచ్చు. నిజము చెప్పాలంటే మన భావములు మనలో అబద్దాలను ప్రోత్సహించవచ్చు. "హృదయము అన్నిటికన్నా మోసకరమైనది (యిర్మియా 17:9) అవి మనలో తప్పుడు విషయాన్ని సృష్టించవచ్చు. తద్వారా మనము చెడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదములో పడవచ్చు లేదా కొంతవరకు స్వయంకృతాపరాధమువలన వేదనలు కలుగవచ్చును.

**దేవుని వాక్యానుసారముగా కాకుండా ప్రజలు వారి సొంత భావావేశము వలన తీసుకొనిన తీర్మానములకు సంబంధించిన ఏ ఉదాహరణలను బైబిలు నుండి కనుగొనగలము? వాటి ఫలితములు ఏవిధముగా ఉన్నవి? ఉదాహరణలను చూడండి; ఆది 3:6; 2సమూ 11:2-4; గలతి 2:11,12.**

..............................................................................................

..............................................................................................

**1పేతురు 1:13 చూడుడి. పేతురు ఏ విషయమును గూర్చి ఆలోచించుచున్నాడు. బైబిలు చదివే వారు ఏమి చేయాలని ఆయన కోరుచున్నాడు?**

.......................................................................................

.......................................................................................

దేహమునకు మనస్సు చుక్కాని వంటిది. దానిని మనము అదుపు చేయగలము. మనస్సు యొక్క ఆధీనమును తీసివేసినపుడు మనవైపు ఎటువంటి భావాలు వస్తాయో వాటి వైపు కొట్టుకొనిపోతాము. గొఱ్ఱెల కాపరి ఇంటికి ఇరుకైన మార్గముగుండా నడిచి వెళ్ళుచున్నట్లు ఊహించుకోండి. ఆ మార్గము వెంబడి అనేక దిశలకు నడిపించే మార్గములున్నవి. మనము వెళ్ళకూడదని నిశ్చయించుకొనిన చోటికి వీటిలో కొన్ని మార్గములు నడిపిస్తాయి. మరికొన్ని మార్గములు మనలను శోధనలోనికి నడిపిస్తాయి. అవి మన భావములకు, మన ఉద్రేకములకు, కోరికలవైపు చూపిస్తాయి. వాటిలో ఏ మార్గమును అనుసరించినా మనము తప్పిపోవడం జరుగుతుంది. సక్రమమైన మార్గమునకు దూరమైపోవుదుము.

**ఏ ప్రాముఖ్యమైన తీర్మానములను మీరు తీసుకొనాలి? చిత్త శుద్ధితో మీ అంతరాత్మలను అడగండి. దేవుని వాక్యమునకు విరోధముగా నేను నా భావావేశము వలనను తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నానేమో నేను ఎట్లు తెలుసుకొనగలను?**

.......................................................................................

.......................................................................................

**బుధవారం** **ఆగష్టు 3**

## సంపూర్ణ నిబద్ధత

"నీ కుడి కన్ను నిన్ను అభ్యంతరపరచిన యెడల దాని పెరికి నీ యొద్ద నుండి పారవేయుము. నీ దేహమంతయు నరకములో పడవేయబడకుండ నీ అవయవములలో నొకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా" (మత్తయి 5:29).

**యేసు పలికిన పై మాటలను తీవ్ర భావములు కలిగిన మాటలుగా నీవు భావిస్తావా? అలా అనుకుంటే ఎందుకలా భావిస్తున్నావు?**

.......................................................................................

.......................................................................................

దేవుడు క్రైస్తవ జీవితమును చాలా కష్టమైనదిగా చేసాడు కాబట్టి చాలా తీవ్రమైన చర్యలను తీసుకోవడం అవసరము కాదు గాని, మన సమాజము మన జీవిత విధానములో దేవుని ప్రణాళికను విడిచిపెట్టి ఎవరి ఇష్టానుసారంగా వారు జీవిస్తున్నారు కాబట్టి తీవ్రమైన చర్యలు అవసరమే. ప్రజలు ఒక్కొక్కసారి మేల్కొని దేవుని నుండి ఇంత దూరము ఏవిధంగా వెళ్ళిపోయాము? అని ప్రశ్నించుకుంటారు. దానికి జవాబు మాత్రము ఒకేవిధంగా ఉంటుంది. ఒకసారి ఒక మెట్టు మాత్రమే జారిపోయాము అనే జవాబు సరియైనది.

మత్తయి 5:29,30 చదువుడి. లైంగిక పాపమును గూర్చి యేసు ఆ సందర్భములో మాట్లాడుచున్నాడు. అయితే అదే సమయములో ఇతర పాపములను గూర్చి కూడా ఆయన మాటలలో కనిపించుచున్నవి. ఇక్కడ సాధారణముగా చూచినచో క్రీస్తునందు మన ఎదుగుదలను గూర్చి ఆయన మాట్లాడుచున్నాడు.

**ఆ మాటల ద్వారా యేసు ఏ ప్రధాన విషయాన్ని వెలుగులోనికి తెస్తున్నాడు? మనము నిజముగా మన దేహములోని అవయవాలను పెకలించి వికలాంగులుగా ఉండాలని ఆయన ఉద్దేశమా?**

.......................................................................................................

.......................................................................................................

మన దేహాలను భౌతికముగా గాయపర్చుకొమ్మని యేసు మనలను పిలుచుట లేదు. దానికి బదులుగా ఆయన మన మనస్సులను స్వాధీనములో ఉంచుకొనుట ద్వారా అది ఎంత సమస్య అయినప్పటికి మన దేహములు బాగానే ఉంటాయని ఆయన మనలను హెచ్చరిస్తున్నాడు. ఆ వాక్యమును బాగుగా పరిశీలించినట్లయితే, మన దేహములో, మన జీవితములో ఉన్న అవాంఛనీయ లేక పాప సంబంధమైన వైఖరి తీసివేయమని దేవునికి ప్రార్థిస్తే ఆవిధముగానే జరుగుతుందని ఈ వాక్యము చెప్పుట లేదు. అవాంఛనీయమైన విషయాలను మనలో నుండి తొలగించుకోవాలంటే మనకు చిత్తశుద్ధితో కూడిన నిబద్ధత ఉండాలి మరియు దాని ప్రకారము నూతన దృక్పథమును అవలంబించుట ఆరంభించాలి. అది చాలా వేదనతో కూడుకున్న పని. మనము చెడును ప్రేమిస్తున్నాము కాబట్టి ఆ చెడును తీసివేసుకోవాలంటే మన మనస్సు అంగీకరించాలి. మన దేహము సహకరించాలి. అందువలన అది తీవ్రమైన వేదన వంటిది. మనము సరియైన నిర్ణయాలను తీసుకున్నట్లయితే ఎదురయ్యే శోధనల యొక్క ప్రభావము మన జీవితముల మీద సన్నగిల్లిపోతుంది.

మన గమనములను ఆయన వైపు త్రిప్పుకొనుటకు ఆయన మన జీవితములో కొన్ని శ్రమలు లేక పరీక్షలను అనుమతిస్తాడు. ఆ వేదనను ఎదుర్కొనినపుడు మాత్రమే మనమెంత తప్పు చేసామో లేక దేవునికి ఎంత దూరముగా వెళ్ళిపోయామో అనే విషయమును గ్రహించగలము. ఆవిధముగా తండ్రి యొక్క ప్రణాళిక మనయెడల నెరవేరునట్లు శ్రమలు ఎదురవుతూ ఉండవచ్చును.

**గురువారం** **ఆగస్టు 4**

## పట్టుదల కలిగియుండుట అవసరము

**యాకోబు దేవునితో పోరాడిన కథనము గూర్చి చదువుడి (ఆది 32) ఎంతో గొప్ప నిరుత్సాహము నడుమ పట్టుదల కలిగియుండాలనే విషయమును గూర్చి ఈ వృత్తాంతము ఏమి చెపుతుంది? మీరు జవాబు చెప్పకముందు యాకోబు ఎదుర్కొన్న పరిస్థితిని మనస్సులో పెట్టుకోండి.**

.......................................................................................................

.......................................................................................................

ఏది న్యాయమైనదో మనకు తెలుసు మరియు మన చిత్తములను మన స్వాధీనములో ఉంచుకొని న్యాయమునే జరిగిస్తాము. అయితే మనము ఒత్తిడిలో ఉన్నపుడు దేవుని హత్తుకొని ఆయన వాగ్దానములయందు నమ్మకముంచుట చాలా కష్టమైన విషయము. మనము బలహీనులము మరియు భయస్తులము, కాబట్టి ఆయన యందు నమ్మకముంచుటలేదు. అందువలన క్రైస్తవునికి అతనిలో ఉన్న అతని పట్టుదలే అతనిని తన కార్యనిర్వహణలో ముందుకు సాగిపోయే సామర్థ్యమును అందిస్తుంది.

బైబిలులో యాకోబు ఎక్కువ పట్టుదలను కనుపర్చిన వ్యక్తికి ఉదాహరణగా నిలిచాడు. అనేక సంవత్సరాలకు పూర్వము జేష్టత్వము పొందు నిమిత్తము యాకోబు తన సహోదరుడైన ఏశావును మరియు తన తండ్రిని మోసము చేసెను (ఆది 27) అప్పుడు ఏశావు అతనిని చంపివేస్తాడేమో అనే భయముతో ఇంటి నుండి పారిపోయాడు. ఆ రాత్రి ఆకాశమును అంటిన ఒక నిచ్చెన యాకోబునకు కలలో కనబడెను. అప్పుడు దేవుడతనికి ఆశ్చర్యకరమైన వాగ్దానములను చేయుటయే గాక అతనికి తోడుగా ఉంటానని వాగ్దానము చేసినప్పటికి అతడు ఇంకను భయపడుతూనే ఉన్నాడు (ఆది 28) ఎంతో కాలము క్రితం దేవుడు చేసిన వాగ్దానము ఇంకా నిలిచియుంటుందా మరియు అతనిని దేవుడు అంగీకరించాడా అనే అనుమానములు యాకోబును ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఆ ఆందోళనలో యాకోబు నిజముగా యేసుతో పోరాడియున్నాడు. ఆ పోరాటములో యాకోబు తుంటి ఎముక జారియున్నది. అటు తరువాత జారిన తుంటి ఎముక వలన బాధ ఎక్కువై యాకోబు ఇక పోరాడలేకపోయాడు. ఆవిధముగా తనకు చేసిన వాగ్దానముల యెడల అభయం పొందే వరకు యాకోబు తన పట్టుదలను విడిచి పెట్టలేదు. అందుకు యేసు "తెల్లవారుచున్నది గనుక నన్ను పోనిమ్మనెను" (ఆది 32:26).

యాకోబునకు కలిగిన బాధలోను దేవునిని వదలక పట్టుకొని యున్నాడు గనుక అతడు దీవెనలను పొందాడు. మన విషయములో కూడా ఆ విధముగానే జరుగును.దేవుడు మన తుంటి ఎముక కూడా జారిపోవునట్లు చేయును. ఆయనను విడువక వెంబడించుమని హెచ్చరించును. అనుభవించిన బాధల యొక్క జాడలు నిలిచి యుండేవిధముగా కొనసాగించాడు. అటు తరువాత యాకోబు కుంటుతూ నడవడం ప్రారంభించాడు. యాకోబు కుంటుతూ తన సహోదరుని కలుసుకున్నాడు. అది బయటకు చూచుటకు బలహీనతగా కనిపించినది కాని అదే విషయాన్ని యాకోబు తన బలమునకు సంకేతముగా యోచించాడు.

**నిరుత్సాహముల మధ్య, శోధనల మధ్య పట్టుదలతో దేవుని వెంబడించిన సంఘటనలు నీ జీవితములో ఉన్న యెడల వాటిని వివరించుము (సహనములు, జీవిత విధానము, చదువుటకు పుస్తకాలు, ఆరోగ్యపు అలవాట్లు, ఆధ్యాత్మిక జీవితము మొద॥)**

## శుక్రవారం ఆగష్టు 5

## అదనపు అధ్యయనం

ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలులోని "రాత్రియందు పోరాటము" పుటలు 195-203; క్రీస్తు యొద్దకు మెట్లు నుండి "సమర్పణ" పుటలు 43-48 చదువుడి.

"మనుష్యుని యొక్క స్వభావము పరిపూర్ణముగా ఉండుటకు అతని చిత్తమునకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మానవుని చిత్తమును అతని పతనము తరువాత సాతాను స్వాధీనములోనికి వెళ్ళినది. అప్పటి నుండి మానవుడు తన చిత్తమును, తన స్వప్రయోజనము కొరకును, తన సొంత ఆనందము కొరకును ఉపయోగించుకొనుచున్నాడు. అయితే ఆ పరిణామము వలన మానవుడు పూర్తిగా పతనమైపోయాడు. ఎంతో యాతనకు గురయ్యాడు" ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 5, పుట 515.

దేవుని సహాయమును పొందుటకు వీలుగా మనుష్యుడు తన బలహీన స్థితిని మరియు తనలో ఉన్న లోపాలను ముందుగా తెలుసుకోవాలి. అతనిలో గొప్ప మార్పు సంభవించే విధముగా తన మనస్సు ప్రార్థన మీదను, అతను పడే ప్రయాస మీదను లగ్నము చేయవలసి యున్నది. చెడు అలవాట్లను, ఆచారములను విడిచి పెట్టాలి. ఆవిదముగా చేయుట ద్వారా పొరపాట్లను సరిదిద్దుకొని సరియైన నియమాలను అనుసరించి జీవించుటకు దోహదపడుతుంది. విజయము లభిస్తుంది. అనేక మంది వారు చేరగల్గిన హోదాలను చేరలేకపోతున్నారు. దానికి కారణం వారు చేయగలిగిన పనిని కూడా దేవుడే చేయాలని కూర్చుంటారు. అయితే ఆ పనిని చేయుటకు వారికి అవసరమైన నైపుణ్యతను దేవుడు వారికి అనుగ్రహించాడనే విషయాన్ని వారు గుర్తించలేకపోదురు. ఉపయోగకరమైన సేవకు తగిన వారందరికి మానసికమైన విషయాలపైన మరియు నీతికి సంబంధించిన క్రమశిక్షణ మీద చాలా కఠినమైన తర్ఫీదు ఇవ్వవలసియుంటుంది. ఆవిధముగా చేసినపుడు వారికి దేవుడు సహకారిగా ఉండి దైవ భక్తి మానవ ప్రయాసతో ఏకమవుతుంది" ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 248.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మానవుడు పతనమైనపుడు మానవులయొక్క చిత్తములు సాతాను ఆధీనములోనికి ఇవ్వబడెను. అదే విషయాన్ని ఎంత వరకు మనము గుర్తించి యున్నాము. యేసు యొక్క స్వభావముపై మన దృష్టిని కేంద్రీకరించుట ద్వారా ఎంత వరకు పతనమైనాము మరియు మన యెడల దేవుని యొక్క కృప ఎంత గొప్పదో అనే విషయాన్ని అర్థము చేసుకొనగలమా?
2. గెత్సెమనెలో యేసును గూర్చిన విషయాలను చదవండి. (మత్తయి 26:36-42). దేవుని చిత్తమునకు వ్యతిరేకముగా యేసు యొక్క స్వంత భావాలు, కోరికలు ఏమిటి? ఈ ఉదాహరణ నుండి ఏమి నేర్చుకొనగలము?
3. ఒక తరగతిగా మీ సమాజములో ఉన్న సంప్రదాయములను తెలుసుకొని అవి మనము బోధిస్తున్న విషయాలను త్రోసిపుచ్చి సాతానుడు మన మీద దాడి చేయుటకు సహాయపడేవి ఏమైనా ఉన్నవా ఆలోచించుడి. ఈ ప్రమాదముల విషయమై ఇతర సంఘ సభ్యులను కూడా అప్రమత్తము చేసి వారికి ఏవిధంగా సహాయపడగలమో ఆలోచించుడి.

❖❖❖

**7వ పాఠం** **ఆగష్టు 6-12**

# శాశ్వతమైన నిరీక్షణ

**సబ్బాతు మధ్యాహ్నము** **ఆగస్టు 6**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : హబక్కూ 1:1-4; యోబు 38-41; యెషయ 41:8-14; యిర్మియా 29:1-10; హెబ్రీ 12:1-13.**

**కంఠతవచనం : "ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది" (రోమా 5:5).**

దేవుని ఆలయములో చిరు నవ్వుతో సభ్యులందరు కలిసి యుండగా నిరీక్షణను గురించి మాట్లాడుట, పాటలు పాడుట ఎంతో తేలికైన విషయమే. అయితే మనము ఏకాంతముగా వేదనలో లేక మండుచున్న కొలిమిలో ఉండగా, అప్పుడు నిరీక్షణను గూర్చి ఆలోచించుట అంత సులభమైన విషయము కాదు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు అనుకూలముగా లేనప్పుడు ప్రతి విషయములో ప్రశ్నించుట ప్రారంభిస్తాము. ముఖ్యముగా దేవుని యొక్క జ్ఞానమును గూర్చి శంకించుదము.

ఒక రచయితయైన సి.ఎస్.లూయిస్ తాను వ్రాసిన పుస్తకాలలో ఒక దానిలో నమ్మటానికి వీలున్న సింహమును గూర్చి వ్రాసాడు. ఆ సింహమును కలుసుకోవాలని ఆశించిన ఒకరు ఈ సింహము ప్రమాదకరమైన వాడు కాదు గదా అని వేరొక వ్యక్తిని అడిగాడు. అప్పుడా వ్యక్తి అన్నాడు "ఆ సింహము మంచివాడే" కాని అంత సురక్షితమైన వాడు కాదు".

అన్ని సమయాలలో మనము దేవుని అర్థము చేసుకొనలేకపోయినను, ఆయన ఏమి చేస్తాడో తెలియకపోయినంత మాత్రాన దేవుడు మనకు వ్యతిరేకి అని అనుకొనకూడదు. ఇక్కడ అర్థము చేసుకొనవలసిన విషయమేమంటే, దేవుని గూర్చి మనకు పరిపూర్ణమైన అవగాహన ఇప్పటికి కూడా లేదు. మనకు సమాధానము లభించుట కొరకు దేవుడు మనకు అర్థమగును, ఆయన ఏమి చేస్తాడో ఊహించుకొనగలమని అనుకోవాలి. మన ఆలోచనలలో ఆయన సురక్షితమైనవాడే.

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** "కష్ట సమయాలలో కూడా మనకు సహాయపడే స్వభావము గలవాడు దేవుడని మనము ఏ విధముగా అర్థము చేసుకొనగలము?

– ఆగష్టు 13, సబ్బాతు దినమున ఈ వారము పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **ఆగష్టు 7**

## విశాలమైన పటము

**మనము గాయపర్చుచున్నప్పుడు, మనకేమి సంభవించిందో అది ఊహించుకోవడమే ముఖ్యము గాని మిగతా విషయాన్ని అంతగా పట్టించుకోము. అయితే ఇక్కడ కేవలం "నన్ను" గూర్చి మాత్రమే కాకుండా కొంచెము విశాలమైన విషయము ఒకటున్నది (ప్రకటన 12:7; రోమా 8:22 చూడుడి) హబక్కుకు 1:1-4 చదువుడి. హబక్కుకు ఎదుర్కొన్నది ఏమిటి?**

..........................................................................................

..........................................................................................

హబక్కుకు జరుగుచున్న విషయము చాలా ఘోరమైనది. "నేను వచ్చి నీకు సహాయపడాలనుకొనుచున్నాను" అని దేవుడు మాట్లాడాలి అని నీవు అనుకొనవచ్చును. అయితే దేవుని యొక్క జవాబు వ్యతిరేకముగా ఉంది. పరిస్థితులు ఇంకా ఎక్కువ ఘోరంగా ఉండబోవుచున్నవి అని ఆయన హబక్కుకు చెప్పెను. హబక్కుకు 1:5-11 చదువుడి.

అష్షూరీయులు, ఇశ్రాయేలీయులను బంధీలుగా చెరపట్టియున్నారు. అదే సమయములో ఇంకా ఘోరమైనవి ఇశ్రాయేలీయులకు సంభవిస్తాయని దేవుడు హెచ్చరించాడు. బబులోనీయులు యూదా ప్రజలను బంధీలుగా తీసుకొని వెళ్ళిపోతారు. 12-17 వచనాల్లో హబక్కుకు మరొకసారి దుఃఖముతో దేవునికి ప్రార్థించి ఆయన ఏమి సెలవిస్తాడాయని వేచియున్నాడు.

**హబక్కుకు 2:2,3లో బబులోనును దేవుడు ఎట్లు నాశనము చేయబోవుచున్నాడో వాగ్దానము చేసెను. ఆ వాగ్దానము వారికెట్టి నిరీక్షణను కలుగజేసింది?**

..........................................................................................

..........................................................................................

హబక్కుకు 2లో బబులోనీయులను ఎట్లు నాశనము చేయునో దేవుడు తన వాగ్దానము ద్వారా తెలియపర్చాడు. భవిష్యత్తులో దీనికి మెస్సియాకు సంబంధించిన వాగ్దానము ఉన్నట్లు హెబ్రి 10:37లో హబక్కుకు 2:3ను దృష్టాంతముగా పేర్కొనెను. బబులోను యొక్క

నాశనమును గూర్చి ఎంత ఖచ్చితముగా వాగ్దానము చేయబడెనో, అదే రీతిలో మహాబబులోను గూర్చి ఎంత ఖచ్చితముగా నాశనము కాబోవుచున్నదనే వాగ్దానము ఇవ్వబడెను (ప్రకటన 18:2).

తన చుట్టూ ఘోరమైన దుర్మార్గమునకు మరియు దానికన్నా ఘోరమైన నాశనము రాబోవుచున్నదని చేయబడిన వాగ్దానమునకు మధ్యన హబక్కూకు చిక్కుకొనియున్నాడు. అదేవిధముగా రక్షణ చరిత్రలో మనము అటువంటి ఈ సమయములోనే ఉన్నాము. మహా దుర్మార్గము మన చుట్టూ ఉంది. అయితే ఇంకా ఘోర దుర్మార్గము రాబోవుచున్నదని బైబిలు భవిష్యత్తును గూర్చి చెబుతుంది. ఈ స్థితి ఏ రూపములో ఉండునో హబక్కూకు తెలుసుకొనునట్లుగా అతడు ఆ సమయములో బ్రతికి యుండుటకు ప్రధాన కారణము. భవిష్యత్తులో ఏమి జరుగునో దేవుడాయనకు తెలిపాడు. కాబట్టి 3వ అధ్యాయములో అతడు దేవునిని మహిమపరుస్తూ నమ్మశక్యము గాని ప్రార్ధన చేసాడు.

**హబక్కూకు 3:16-19 చదువుడి. తనలో నిరీక్షణ కలుగుటకు ఏ కారణమును హబక్కూకు గుర్తించాడు. కడవరి కాలపు ప్రవచనములు నెరవేరబోవుచుండగా దేవుని ప్రజలకున్న నిరీక్షణ ఏమిటి? ఆ నిరీక్షణను ఏవిధముగా నీవు సొంతము చేసుకొనగలవు?**

**సోమవారం** **ఆగస్టు 8**

## మన తండ్రి ఎవరైయున్నారు

ఆస్వాల్డు చాంబర్సు ఈవిధముగా వ్రాసాడు. "దేవుడు ఏమి చేయబోతున్నాడో అనే విషయాన్ని నీవు ఆయనను అడుగుతూనే యున్నావా? నీకు ఆయన ఎన్నడూ చెప్పడు. దేవుడేమి చేయబోవుచున్నాడో అనే విషయాన్ని నీకు ఆయన ఎన్నడూ చెప్పడు. ఆయన ఏమైయున్నాడో అనే విషయాన్ని నీకు ఆయన బయలుపరుస్తాడు" "ఆయన ఉన్నతమైన సేవార్ధమైనా సమస్తమ" బార్బర్ అండ్ కంపెని 1963, జనవరి 2.

**చాంబర్సు చెప్పిన ఆ భావమును గూర్చి నీవేమనుకొనుచున్నావు?**

మనకందరికి తెలిసిన విధముగా యోబు గ్రంథము, యోబు వ్యక్తిగత జీవితములో సంభవించిన దుర్ఘటనను వివరిస్తూ ప్రారంభమైంది. తన ప్రాణము మరియు అతని భార్య మినహా అతడు సమస్తమును పోగొట్టుకున్నాడు. అతని భార్య వచ్చి "దేవుని దూషించి మరణించమని" అతనికి సలహా ఇచ్చినది (యోబు 2:9) దీని తరువాత

యోబు తన స్నేహితులతో చేసిన సంభాషణ మరియు యోబు అనుభవించుచున్న ఆ దుర్భరమైన స్థితికి కారణమేమైయుంటుందో అనే విశ్లేషణ వారు చేసినట్లు వ్రాయబడింది. ఈ చర్యలన్నింటిలో దేవుడు నిశబ్దముగా ఉండిపోయాడు.

తరువాత అకస్మాత్తుగా యోబు 38లో దేవుడు ప్రత్యక్షమై మాట్లాడాడు "జ్ఞానములేని మాటలు చెప్పి నా ఆలోచనను చెరుపుచున్న వీడెవడు? (యోబు 38:2) ఎట్టి విరామము ఇవ్వకుండా దేవుడు యోబును ఆశ్చర్యమును కల్గించే 60 ప్రశ్నలు అడిగాడు. మీ బైబిళ్ళను తెరచి యోబు 38 మరియు 39లో వాటిని చదవండి.

చివరి ప్రశ్న వేసిన తరువాత యోబు సమాధానము చెప్తూ "చిత్తగించుము. నేను నీచుడను. నేను నీకు ఏమని ప్రత్యుత్తరమిచ్చెదను? నానోటి మీద నా చేతిని ఉంచుకొందును. ఒక మారు మాటలాడితిని నేను మరల నోరెత్తను. రెండుసారులు మాటలాడితిని. ఇకను పలుకను" యోబు 40:4,5. అయితే అంతటితో దేవుడు తన సంభాషణను ముగించలేదు. మరొకసారి మరికొన్ని పెద్ద ప్రశ్నలను ఒకదాని వెంబడి ఒకటి అడిగాడు.

**యోబు యొక్క చివరి జవాబును యోబు 42:1-6లో చదవండి. దేవుడు యోబునకు ఏమి చెప్పాలని ప్రయత్నించాడు? ఆ మాటలు అతని మీద ఎట్టి ప్రభావాన్ని చూపాయి?**

..............................................................................................

..............................................................................................

యోబు యొక్క స్నేహితులు "ఎందువలన" అని అడిగిన ప్రశ్నలకు దేవుడు ఎన్నడు జవాబులివ్వడు. అయితే దేవుడు ఆశ్చర్యమును కలిగించే తన సృష్టి కార్యముల ద్వారా తన అద్వితీయమైన లేక సాటిలేని మహాత్యమును వివరించాడు. ఆ విషయాలన్నింటిని వినిన తరువాత యోబు ఇక జవాబులతో నిమిత్తము లేకుండా ఊరకుండెను. దేవుని యొక్క దివ్యత్వము ముందు ఎట్టి వివరణ అవసరములేదు. మనము చెప్పే ప్రతి విషయము కూడా కాంతిహీనముగా ఉంటుంది.

ఈ వృత్తాంతమంతయు ఆశ్చర్యమును కలిగించే వైరుధ్యములను బయలుపర్చుచున్నది. మనకు తెలిసినది బహు స్వల్పమే అని గుర్తించుట ద్వారా మనలోని

నిరీక్షణ మరియు ప్రోత్సాహము జనిస్తుంది. దేవుడు మన అవివేకమును మనముందుంచుట ద్వారా, మన నిరీక్షణ మనకన్నా ఘనుడైన దేవునిలోనే ఉంటుంది.

**నీకు అర్థం కాని విషయాలు సంభవించుచున్నవా? అట్లయిన యెడల దేవుని యొక్క స్వభావముపై నీ దృష్టి పెట్టుకో. ఆవిధముగా చేయుట ద్వారా నీకు నిరీక్షణ ఏవిధముగా కలుగును?**

**మంగళవారం** **ఆగస్టు 9**

## మన తండ్రి యొక్క సన్నిధి

"నీ దేవుడైన యెహోవానగు నేను –భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడి చేతిని పట్టుకొనుచున్నాను" (యెషయా 41:13).

ఒకసారి ఒకాయన ఈవిధంగా అన్నాడు. "దేవుడు మనకు దూరముగా ఉన్నాడనిపించినపుడు ఎవరు ముందుకు జరిగారు? సమస్యలు మనలను వెంటాడుతున్నపుడు మనలను దేవుడు విడిచిపెట్టి వేసాడని ఊహించుకుంటాము. సత్యము ఏమిటంటే ఆయన ఎక్కడికి వెళ్ళిపోలేదు.

యూదులు శత్రుదేశములో ప్రవాసులుగా ఉన్నపుడు వారికి దేవుని సన్నిధి దూరమైపోయినట్లు అనిపించింది. అయితే యెషయా ద్వారా వారికి భవిష్యత్తులో కలిగే విడుదలను గూర్చిన వాగ్దానము దేవుడు చేసెను "వారు నిజముగా యెరూషలేమునకు భవిష్యత్తులో తిరిగి వచ్చే సమయము ఇంకా అనేక సంవత్సరములు ఉన్నప్పటికి, వారిని దేవుడు విడిచి పెట్టలేదనియు తమ నిరీక్షణలో కొనసాగుటకు ఎటువంటి అనుమానము లేదని తన ప్రజలు తెలుసుకోవాలని దేవుడు కోరుకున్నాడు.

**యెషయా 41:8–14 చదువుడి. భవిష్యత్తులో వారికి కలుగబోయే విడుదల నిమిత్తము వారు నిరీక్షణతో ఎదురుచూచుటకు గల కారణములు ఏమిటి? మనము కూడా చివరిగా ఈ భూమిని విడిచి వెళ్ళిపోవుటకు ఇప్పుడు వేచి చూస్తున్నామని ఈ వాగ్దానము మనకు ఎట్లు సహాయపడుతుంది?**

ఈ దృశ్యమునకు సంబంధించిన శక్తివంతమైన సూచన 13వ వచనములో ఉన్నది. విశ్వమంతటిపైన సార్వభౌమాధికారము గల దేవుడు తన ప్రజలకు ఈవిధముగా చెప్పుచున్నాడు. "నీ దేవుడనైన యెహోవానగు నేను –భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడి చేతిని పట్టుకొనుచున్నాను"(యెషయా 41:13). భూమికి

ఎన్నోవేల కోట్లు కాంతిమైళ్ళ దూరములో ఉన్న దేవుడు భూమి మీద జరుగుచున్న ప్రతి విషయమును తన సింహాసనమునుండి నడిపించుచున్నాడను మాట ఒక విషయమైతే, ఆయన మన కుడి చేతిని పట్టుకొనుచున్నంత దగ్గరలో ఉన్నాడనుట మరొక విషయమైయున్నది. ఆయన ప్రియమైన బిడ్డలు ఈ విషయాలను గమనించాలి.

మనము విస్తారమైన పని కలిగియున్నపుడు దేవుడు మన చేయి పట్టుకునేంత దగ్గరలో ఉన్నాడని గుర్తుంచుకోవడం కష్టమైన విషయమే. అయితే ఆయనకు ఇమ్మానుయేలు "దేవుడు మనతో ఉన్నాడు" అని మనము జ్ఞాపకముంచుకొనినప్పుడు ఆ ఆలోచన ఎంత తేడాను చూపిస్తుంది. దేవుని సన్నిధి మనతో ఉంటే ఆయన లక్ష్యాలు, ఆయన వాగ్దానాలు, మార్పు చేయగల ఆయన శక్తి ఇవన్నియు కూడా మనతో ఉన్నాయని భావము.

**రాబోవు కొన్ని దినములలో, ఒక ప్రయోగము చేయుటకు ప్రయత్నించుడి. సాధ్యమైనంతవరకు విశ్వమంతటికి దేవుడైన మన దేవుడు చేయి పట్టుకునేటంత సమీపంగా ఉన్నాడనే విషయాన్ని ప్రతిక్షణం జ్ఞాపకముంచుకోండి. ఆ తలంపు నీ జీవితములో ఎట్టి మార్పులను కలుగజేసెనో ఒక పుస్తకములో వ్రాసి యుంచుకోండి. సబ్బాతు దినాన మీ తరగతిలో పంచుకొనుటకు సిద్ధపడుడి.**

..........................................................................................

..........................................................................................

బుధవారం ఆగష్టు 10

## మన కొరకు తండ్రి యొక్క ప్రణాళికలు

**ప్రతి ఒక్కరు నిరీక్షణ కొరకు చూస్తున్నారు. అయితే అది ఎక్కడ కనబడుతుంది? కొందరికి వారి స్నేహితుల చిరునవ్వులో నిరీక్షణ కనిపిస్తుంది. ఇతరులకు ఆర్థికపరమైన వెసులుబాటు నుండి నిరీక్షణ కలుగును. కొందరికి నిలకడగా ఉన్న వివాహ బంధములో నిరీక్షణ కనబడును. దానికొరకు, ధైర్యము కొరకు సామాన్యముగా నీవెక్కడ వెదకెదవు?**

..........................................................................................

..........................................................................................

యిర్మీయా గ్రంథములో ప్రవక్త తన ప్రజలకు వ్రాస్తూ ప్రవాసులుగా జీవిస్తున్న మీరు నిరీక్షణను కోల్పోయి యున్నారు. "బబులోను నదుల యొద్ద కూర్చుండి యున్నప్పుడు మనము సియోనును జ్ఞాపకము చేసుకొని యేడ్చుచుంటిమి. (కీర్తన 137:1) వారు ఆవిధముగా హృదయములు పగిలి జీవిస్తున్నను ఎట్టి పరిస్థితిలోను నిరీక్షణను కోల్పోవద్దని యిర్మీయా వ్రాసాడు.

**నిరీక్షణ కలిగియుండుటకు ఏ కారణాలను యిర్మీయా 29:1-15లో చూపాడు.**

ఈ వాక్యాలలో నిరీక్షణకు ఆధారమైన మూడు విషయాలు పరిశీలించదగినవి ఉన్నవి. మొదటగా : తన ప్రజలకు నిరీక్షణ వదిలి పెట్టవలదని దేవుడు చెప్పుచున్నాడు. వారున్న పరిస్థితి అనుకోకుండా జరిగింది కాదు. దేవుడే వారికి ఆ విధముగా చేసాడు. "ఇశ్రాయేలు దేవుడును సైన్యములకధిపతియగు యెహోవా తన ప్రేరేపణ చేత బబులోనుకు చెర తీసికొనిపోబడిన వారందరికి ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు" (యిర్మీయా 29:4).

రెండవదిగా : ఇప్పుడు వారున్న పరిస్థితిలో కూడా దేవుడు పని చేయగలడు కాబట్టి వారు వారి నిరీక్షణను కోల్పోకూడదు. "నేను మిమ్మును చెరగొనిపోయిన పట్టణము యొక్క క్షేమము కోరి దానికొరకు యెహోవాకు ప్రార్థన చేయుడి. దాని క్షేమము మీ క్షేమమునకు కారణమగును" (యిర్మీయా 29:7).

మూడవదిగా : వారి ప్రవాస జీవితానికి అంతము పలకనైయున్నాడు గనుక వారు వారి నిరీక్షణను కోల్పోకూడదు. ఒక ప్రత్యేకమైన సమయములో దేవుడు పరదేశులుగా ఉన్న వారిని విడిపిస్తానని వాగ్దానము చేస్తున్నాడు. ప్రభువు ఈ విధముగా చెప్పాడు. "బబులోను రాజ్యమునకు 70 సం॥లు గతించిన తరువాతనే మిమ్మును గూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి యీ స్థలమునకు మిమ్మును తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును" (యిర్మీయా 29:10).

వారి గతముపై దేవుడు ఏవిధముగా బాధ్యత కలిగియున్నాడో వర్తమాన కాలమునకు (నేటి కాలమునకు) మరియు భవిష్యత్తు కాలమునకు విశ్వమంతటి మీద అధికారము కలిగి యుంటాడు. అదే విషయాన్ని ఎంతో అందముగా వర్ణిస్తున్నాడు (యిర్మీయా 29:11-14).

**యిర్మీయా 29:11-14 చదువుడి. మీరు అనే చోట మీ సొంత పేరును పలికి అనగా దేవుడే స్వయముగా మీకు వాగ్దానము చేస్తున్నట్లు భావన కలుగుటకు ఆవిధముగా చేద్దాము. ఆ వాగ్దానము నీకే వర్తిస్తాయనే విధముగా చదవండి. (యిర్మీయా 29:11-14).**

**గురువారం** **ఆగస్టు 11**

## మన తండ్రి యొక్క క్రమశిక్షణ

**హెబ్రి 12:5-13 చదువుడి. ఇక్కడ మనకు వస్తున్న వర్తమానమేమి? ఈ త్రిమాసములో చదువుచున్న అంశముతో ఇది ఏవిధంగా సరిపోతుంది?**

హెబ్రి 12:5-13లో క్రమశిక్షణ పేరుతో పౌలు వివరించిన శిక్షణ ఏమిటి? న్యూ ఇంటర్నేషనల్ బైబిలు వెర్షనులో ఈ వాక్య భాగములో "శిక్షణ" అనే మాటకు పది రకాలైన

మాటలు ప్రయోగించబడినవి. గ్రీకుల భాషలో మూలము "విద్య" అనే భావము కలదు. కాబట్టి క్రమశిక్షణను గూర్చి నేర్చుకొనడమంటే లేక దానిని అర్ధము చేసుకొనుటకు విశ్వాస పాఠశాలలో దేవుడు విద్య నభ్యసింపజేస్తాడని పౌలు హెబ్రీ 11లో వివరించాడు.

హెబ్రి 11 అంతటిలో విశ్వాసులైన స్త్రీ పురుషులను గురించి పౌలు వివరించాడు. వారి జీవితములో ఎన్నో అగ్ని పరీక్షలు ఎదురైనపుడు కేవలం వారి యొక్క విశ్వాసమే వారి జీవితాలను కొనసాగించుటకు సహాయపడింది. మనము 12వ అధ్యాయములోనికి ప్రవేశించుచుండగ, పౌలు తన దృష్టిని మనవైపు త్రిప్పి, మనకంటే ముందు అనేకులు అసాధారణమైన పరిస్థితులను ఎంతో ఓపికతో ఎదుర్కొనినట్లు మనము కూడా వారివలె శ్రమ ఎదురైన పరుగుపందెములో విశ్వాస జీవితమును కొనసాగించవలసియున్నాము. మన నేత్రములను యేసువైపు త్రిప్పాలి (హెబ్రీ 12:2) అప్పుడు ఆయన కష్ట కాలములో మనకు మాదిరిగా నడిపిస్తాడు. (హెబ్రి 12:3) 12వ అధ్యాయమును చదవటమంటే స్పష్టముగా చూపు కనిపించుటకు కళ్ళజోడు వాడినట్లు కష్ట సమయాలను అర్ధము చేసుకొని మనకు మాదిరియైన యేసువైపు చూచుచు విశ్వాసమును కొనసాగించుకొనవలసి యున్నాము. అప్పుడు మనకు ఎదురయ్యే శ్రమలను తెలివిగా అర్ధము చేసుకొని వాటికి దీటుగా స్పందించగలము.

హెబ్రి 12:1-13ను కళ్ళజోడు ద్వారా చదువుడి. ఇప్పుడు 5-13 వాక్యాలపై మీ దృష్టి నిలిపి ప్రశ్నలకు జవాబులివ్వండి.

క్రమశిక్షణకు ఆధారమేమిటి? ....................................................

.......................................................................................

క్రమశిక్షణకు మన స్పందన ఏమిటి? ...........................................

.......................................................................................

క్రమశిక్షణ యొక్క గురి లేక లక్ష్యము ఏమిటి? ...............................

.......................................................................................

**మరొకసారి హెబ్రి 12:1-13 చదువుడి. నిరీక్షణ ఆధారములను గుర్తించి ఒక పట్టీగా వ్రాయండి. ఆధ్యాత్మిక విద్య ద్వారా మీ కాలములోనే నిరీక్షణను ఏవిధముగా మీరు అనుభవ పూర్వకముగా తెలుసుకున్నారు?**

**శుక్రవారం** **ఆగష్టు 12**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జివైట్, విద్యలోని "అటు తరువాత ఉండే పాఠశాల" పుట 301-309.

స్వస్థత సువార్త సేవలోని "అనుదిన జీవితములో సహాయము" పుట 470, 471చదువుడి.

వివిధ రంగాలలో మనము అనుభవము గడించినను ఏదో ఒక విధముగా నిరుత్సాహము నిరాశలు ఎదురవుతూ ఉంటాయి. అటువంటి కష్టసమయాలలో దేవుడు నిజముగా అన్ని విషయాలను తన స్వాధీనములో ఉంచుకుంటున్నాడా అని అనుమానము కలుగవచ్చును. అట్టి సందర్భములోనే అనేక మంది వారి విశ్వాసమును కోల్పోయి, అనుమానమనే బానిసత్వములోనికి మరియు అపనమ్మకత్వమనే చెరలోనికి వెళ్ళిపోతారు. అటువంటి సందర్భాలలో ముందు చర్యగా దేవుడనుగ్రహించు తన కాపుదలను అర్ధము చేసుకొని స్థిరమైన పునాది మీద నిలువబడుటకు ప్రయత్నించాలి. ఆ ప్రయత్నములోనే నూతన విశ్వాసము, నూతన జీవము అనుగ్రహించబడును" –ఎలెన్ జివైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 162.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మన మందరము కూడా నిరుత్సాహానికి, నిరాశకు లోనవుతూ ఉంటామని ఎలెన్ వైట్ చెప్పారు. అట్టి పరిస్థితిలో మనమున్నపుడు ఇతరులు ఏవిధముగా మనలను గుర్తించగలరు? ఒకరికొకరము నిరీక్షణ ప్రతినిధులుగా ఉంటూ ఏవిధముగా సహాయపడగలము?
2. మంగళవారం పాఠంలోని చివరి ప్రశ్నను మరొకసారి పరిశీలించుడి. దేవునికి సన్నిహితముగా ఉండుట వలన మీ జీవితాలలో ఎటువంటి మార్పులు వస్తాయో ఒక తరగతిగా చర్చించండి.
3. మార్పు చేయగల నిరీక్షణ పరలోకము నుండి వచ్చును. అనగా మనము నిరీక్షణ కొరకు ప్రార్థించవచ్చును. ఈ మధ్య కాలంలో ఎవరి జీవితములోనైనా నిరీక్షణ లోపించినట్లయితే ప్రార్థించుట ద్వారా ఎవరికి ఏవిధంగా సహాయపడగలము?

❄✶❄

8వ పాఠం ఆగష్టు 13-19

# అదృశ్యుడైన వానిని చూచుట

సబ్బాతు మధ్యాహ్నము ఆగష్టు 13

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు :రోమా 8:28-39; యోహాను 14:1-14; ఎఫెసి 1:18-23; యెషయా 40:27-31.**

**కంఠతవచనం : "విశ్వాసమును బట్టి అతడు అదృశ్యుడైనవానిని చూచుచున్నట్టు స్థిరబుద్ధిగలవాడై, రాజాగ్రహమునకు భయపడక ఐగుప్తును విడిచిపోయెను" (హెబ్రీ 11:27).**

హెబ్రీ గ్రంథంలో పేర్కొనబడిన "విశ్వాసము" అనే పదమునకు నిర్వచనము చేయుట ఎల్లప్పుడు సవాలుతో కూడినదై యుంటుంది. (హెబ్రీ 11:27) మనకు అగోచరమైన దాని విషయమై ఎట్లు రూఢిగా నమ్మగలము? అయితే ఇదే విషయాన్ని మోషే మన కంఠతవచనములో విశదపర్చుచున్నాడు. అదృశ్యుడైన వానిని అతడు చూచెను గనుక స్థిరబుద్ధి గలవాడై పట్టుదల గలిగిన వాడాయెను.

మనకు అన్ని విషయాలు సవ్యముగా జరుగుచున్నపుడు మాత్రమే కాకుండా ప్రతి విషయము మనకు వ్యతిరేకముగా జరుగుచున్నపుడు కూడా "అదృశ్యుడైన దేవునిని" మనము వెదకవలసియున్నామనియు అది చాలా సవాలుతో కూడుకున్నదనియు గుర్తించాలి. ఆవిధముగా చేయుటకు మనకు విశ్వాసము అవసరము. క్రీస్తును పోలిన విశ్వాసము మరియు దేవుని రాజ్యము మీద నమ్మకము కలిగియుండాలి. తండ్రి యొక్క మంచితనమునకు సంబంధించిన సత్యము, యేసు నామములో ఉన్న శక్తి, ఆయన పునరుత్థానములో ఉన్న శక్తి, దేవుని కనికరము మొదలగునవి అవసరమైన సత్యములై యున్నవి. అవి మనలను శ్రమ కాలములో బలముగాను స్థిరముగాను నిలువబడుటకు సహాయపడును.

**సంక్షిప్తముగా వారము యొక్క పాఠము :** దేవునికి సంబంధించిన ఏ సత్యాలు కష్ట కాలములో కూడా మనలను సంరక్షించుటకు సహాయపడును?

– ఆగష్టు 20, సబ్బాతు దినమున ఈవారం పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం ఆగష్టు 14

## మన తండ్రి యొక్క అపరిమితమైన మంచితనము

"దేవుడు నన్ను నిజముగా ప్రేమించుచున్న యెడల ఆయన నాకు ఫలాన విషయాన్ని

నా యెడల నెరవేర్చియుందుడు" అని చాలాసార్లు మన మనుష్యులలో ఆ తలంపులు వస్తూ ఉంటాయి. ప్రస్తుత పరిస్థితిని ఒకసారి చూసుకొని, ఆయన నిజముగా మనలను ప్రేమించుచున్న యెడల మా పరిస్థితులు ఈ విధముగా ఉండి యుండెడివి కాదని అనుకుంటాము.

దేవుని యొక్క మంచితనమును అపార్ధము చేసుకొనుటకు మన విచక్షణ జ్ఞానమును రెండు విధాలుగా ఉపయోగించుకుంటాము. మొదటగా ఫలాన విషయము మనకు మంచిదనే కోరిక హృదయాలలోను, మనస్సులలోను బలముగా ఉన్నపుడు అదే సందర్భమును బట్టి దేవుడు వేరే విధంగా మనకు చేసినప్పుడు దేవుడు చేసింది హాస్యాస్పదంగా ఉందనిపిస్తుంది. రెండవది దేవుని మంచితనమును గురించి నమ్ముచున్న విషయము. అదే సందర్భములో మనము పొందిన అనుభవముతో అది ఘర్షణ పడుతుంది. అప్పుడు ఆయన మంచితనమును అనుమానపడుదుము. ఏదైనా ఒక విషయము "మంచిగా ఉన్నది. మంచిగా కనిపిస్తున్నది. మంచి రుచి కలిగియుంది అనుకున్నపుడు అది మంచిగానే ఉండాలి. ఆవిధముగా లేనపుడు ఆ విషయములో దేవునితో కోపపడతాము.

ఇక్కడ విశ్వాసము తన పాత్రను పోషించుటకు ముందుకు వస్తుంది. దేవుని యొక్క మంచితనమును ఆయననే మనము అనుమానించే విధముగా శోధింపబడినప్పుడు విశ్వాసము క్రియారూపములో వస్తుంది.

**రోమా 8:28-39 చదువుడి. ఈ వాక్యములు మన యెడల దేవునికున్న మంచితనమును గూర్చి వివరించుచున్నవి. దేవుని మంచితనమునకు వ్యతిరేకముగా అనుమానము కలుగకుండా మనస్సులకు కావలి కాయుటకు గల కారణాలను ఈ వాక్యములలో మీరు కనుగొనగలరు.**

రోమా 8:32లో మనకు సంభవించిన పరిస్థితుల ప్రభావము వలన అదుపు తప్పి ప్రవర్తించకుండా మనలను కాపాడుకొనుటకు సహాయపడే ఒక ప్రాముఖ్యమైన తర్క భావము ఉన్నది. "దేవుడు మనకు సమస్తము అనుగ్రహించుటకు ఎటువంటి సంకోచము చూపించకుండా మన స్థితిని ధరించుకొని నష్టము భరించుటకు ఇంకేమైనా ఉన్నదా?" మన కొరకు చనిపోవుటకు తన కుమారుడైన యేసును పంపిన తరువాత కూడా ఆయన చాలా పిసినారి లేక నీచుడు అని ఆయనకు వ్యతిరేకముగా ఎట్లు మాట్లాడగలము?

అందుచేత మనము కోరిన విధముగా జరగనంతమాత్రాన మన యెడల ఆయన మంచితనమును ఉదారమైన ప్రేమను సంకోచించి త్రోవ తప్పిపోకూడదు. మన మేలు కొరకే కొన్ని సందర్భాలలో కీడు అనే వేదనలు మనకు సంభవిస్తాయి.

**దేవుని యెడల నీకు కలిగిన అనుమానాల కన్నా, దేవుని మంచితనమును గూర్చిన**

**సత్యము నీలో బలమైన కార్యము నెరవేరుట ఎట్లు సాధ్యము? మన కొరకు మరణించుటకై యేసును ఈ లోకములోనికి పంపించెను అనే సత్యమును గూర్చి ధ్యానించుడి. ఆ ధ్యానము విశ్వాసమునకేమి చేయును?**

**సోమవారం** **ఆగస్టు 15**

## యేసు నామములో

"నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" (యోహాను 14:14) యేసు దీర్ఘకాలము తన శిష్యులతో గడపబోవుట లేదు. కొంత కాలము వారితో గడిపి అనేక విషయాలలో ప్రోత్సహించి మద్దతుగా నిలిచిన యేసు పరలోకమునకు వెళ్ళిపోవుచున్నాడు. ఆ విషయము గ్రహించిన శిష్యులు శక్తిహీనులై పోతున్నట్లు భావించారు. కొంత సమయము తరువాత యేసును వారు భౌతికముగా చూడలేకున్నా వారికొక ముఖ్య వాగ్దానము చేసాడు.

యోహాను 14:1–14 చదువుడి. 13, 14 వచనాలలో "ఆయనను ఏమి అడిగినను, దానికి చేసెదనని యేసు వాగ్దానము చేసాడు. ఈ వాగ్దానమును బట్టి ప్రతిసారి ప్రార్థన చేయునపుడు ముగింపు భాగములో యేసు నామములో ఆమేన్"అని ప్రార్థించుచున్నాము.

**మనము ఆవిధముగా పలికినప్పుడు, దాని అర్థమేమైయుంటుందని భావిస్తున్నాము? ఆవిధముగా ప్రార్థించమని యేసు మనలను ప్రోత్సహించినపుడు ఆయన ఉద్దేశమేమైయుంది? ఆయన చెప్పే విషయాన్ని అర్థము చేసుకొనుటకు ఈ వాక్యాలలో లభించే మర్మములేమిటి?**

.................................................................................................

.................................................................................................

మనము చేసే విన్నపము "యేసు నామములో" ఉన్నపుడు మన పక్షాన పరలోక విధానాలన్నియు పనిచేస్తాయనే విషయాన్ని రూఢిగా నమ్మవచ్చును. చుట్టూ దేవదూతలు పనిచేస్తున్నా మనము చూడలేకపోవచ్చును. అయితే వారు మన చుట్టూ ఉంటారు. మన విన్నపములను నెరవేర్చుటకై యేసు నామములో పరలోకపు సింహాసనము యొద్ద నుండి పంపబడుదురు.

మనము యేసు నామములో ప్రార్థించేటపుడు మధ్యలో కండ్లు తెరచి ఏమైనా వేరుగా సంభవిస్తుందా లేదా యని చూస్తుంటాము. అక్కడ ఎటువంటి మార్పు కనబడకపోవును. అంతా యధావిధిగా ఉంటుంది. అయితే యేసు పెద్ద తుఫానును నిమ్మళపరచినట్లు, ఆశ్చర్యకరముగా దేవుని శక్తి మనకు కనిపించని రీతిలో పనిచేయును. దేవుని శక్తి యేసును గెత్సెమనేలో కాపాడినది. మనము ఊహించినట్లు అకస్మాత్తుగా ఏమీ సంభవించకపోయినా,

మనతో దేవుడు పనిచేయుట లేదని దాని అర్ధముకాదు.

**యోహాను 14:1-14 మరొకసారి చదువుడి. ఆ వాక్యాలను మీరు చదువుచుండగా, యేసు ముఖాముఖిగా మీతో మాట్లాడుచున్నట్లు ఊహించుకొనండి. ఈ వాక్యాలలో పేర్కొనబడిన వాగ్దానము నుండి ఎట్టి నిరీక్షణ, ఆదరణ పొందగలరు. అదే సమయంలో నాకు సంబంధించిన ఏ విషయాలు, నేను పొందగోరే వాగ్దానములకు అడ్డుగా వస్తున్నవో అని ఆలోచించుడి. నా హృదయములో ఎట్టి మార్పులను నేను చేసుకోవలసియున్నానో పరీక్షించుకోవాలి?**

........................................................................................

........................................................................................

మంగళవారం ఆగష్టు 16

## పునరుత్థానము యొక్క శక్తి

మానవజాతి యొక్క శక్తిహీనతకు సంబంధించిన సమస్యను పునరుత్థానము పరిష్కరించుచున్నది. యేసు యొక్క జీవితము మరణము ఆయన యొక్క పునరుత్థానమును గూర్చి మనము ఆలోచించినపుడు ఆయన మరణము దేవునితో మనకున్న బాంధవ్యమును న్యాయపరముగా తిరిగి నెలకొల్పుచున్నది. అదే సత్యమైయున్నది.

అంతమాత్రమే కాకుండా పునరుత్తానము రక్షణకు ప్రత్యేకమైన కొలమానముగా ఉంది. ఒక దినమున మనము కూడా పునరుత్తానము చెందుదుమని యేసు యొక్క పునరుత్తానము చూపించుచున్నది. కాబట్టి ఆయన పునరుత్తానము చాలా భావముతో కూడినదనుకొనుటయే గాక యేసు పునరుత్తానుడైనందున శక్తినందును మరియు అధికారమునందును దేవుని యొక్క కుడిపార్శ్వమున నిలువగలిగే హోదాను పొందాడు. అట్టి పునరుత్తాన శక్తిని నేడు మనకు కూడా దొరుకునట్లు దేవుడు అనుగ్రహిస్తాడు.

**ఎఫెసి 1:18-23లో దేవుని యొక్క శక్తిని గూర్చి పౌలు మాట్లాడుచున్నాడు. పునరుత్తాన శక్తిని గూర్చి ఈ వాక్యాలు మనకేమి బోధిస్తున్నవి? ఈ వాక్యాలలో నీవెట్టి నిరీక్షణ, వాగ్దానములను నీవు కనుగొనగలవు?**

........................................................................................

........................................................................................

కేవలము దైవ సంబంధమైన సహాయముతోనే కొన్ని విషయాలను సరియైన రీతిలో అర్ధము చేసుకొనగలము కాబట్టి ఎఫెసీయులకు ఆ విషయాలు అర్ధమగునట్లు పౌలు దైవ శక్తి కొరకు ప్రార్థిస్తున్నాడు. <u>మొదటగా</u> యేసు మనలను పిలిచిన దాని ప్రకారము మనకు

శాశ్వతమైన భవిష్యత్తుతో పాటు రూపాంతరము చెందే నిరీక్షణ ఉన్నది. రెండవదిగా మన పక్షమున వ్యక్తపర్చబడిన శక్తిని మనము అర్థము చేసుకోవాలి.

ఆ శక్తి ఎంత ఆశ్చర్యకరమైనదో వివరించుటకు పౌలు ప్రయత్నించాడు. నేడు మనకు అందుబాటులో ఉన్న అదే శక్తి యేసును పునరుత్థానుడుగా చేసినది. సమాధిలోనుండి ప్రాణముతో లేపుటయేగాక ఆయనను తండ్రి యొక్క కుడి పార్శ్వమున కూర్చుండునట్లు చేసెను.

అంతటితో పౌలు ఆగలేదు. పునరుత్థానమువలన యేసు ఏదో ఒక విధమైన శక్తిని పొందుట కాదు గాని ఆయనకు పరిపాలించే అధికారమును అనుగ్రహించెను. మరియు ఆయన ప్రజలకు శాశ్వతకాలము అవసరమైన సమస్తమును అనుగ్రహించెను.

**పునరుత్థానుడైన యేసు శక్తి మీకు ఎక్కడెక్కడ అవసరమో పట్టీగా వ్రాయండి. మీకు ఎక్కడేమి అవసరమో దానిని పొందుటకు వీలుగా ప్రార్థించండి. నీ జీవితములో ఈ శక్తి స్వేచ్ఛగా పనిచేయుటకు నీవే నిర్ణయాలు తీసుకుంటావు?**

..........................................................................................

..........................................................................................

బుధవారం ఆగష్టు 17

## మన చింతయావత్తూ మోయుట కొరకు

"నీవు చింతించే అవకాశము ఉండగా ఎందుకు ప్రార్థించాలి?" అని తెలియజేసే ఫలకములను కొంతమంది వారి ఇండ్లలో పెట్టుకుంటారు. మనము దేవుని యొద్దకు మన విన్నపములతో వచ్చుటకు బదులు అనేకసార్లు మనము కొన్ని విషయాలలో చింతిస్తూ ఉంటాము.

మన జీవితము అనేక సమస్యలతో ముడి పడియున్నపుడు దానిని దేవునికి అప్పగించినచో ఆయన ఆ ముడులన్నింటిని విప్పును అని ఎవరో ఒకరు చెప్పారు. ఆవిధముగా మనకు సహాయపడుటకు దేవుడు ఎంతగానో ఆశపడుచున్నాడు. అయినను ఆ సమస్యల ఉచ్చులో చిక్కుకొని మనంతట మనము పరిష్కరించుకొనుటకు ప్రయత్నిస్తుంటాము. అది మనకు అసాధ్యమనిపించే వరకు ప్రభువు యొద్దకు వెళ్ళుటకు ఎందుకు సంకోచిస్తాము?

**1పేతురు 5:7 చదువుడి. పేతురు కీర్తన 55:22లో ఉన్న విషయాన్ని ఉదాహరించాడు. ఇక్కడున్న వర్తమానమేమిటి? (మత్తయి 6:25-33 చూడుడి).**

..........................................................................................

..........................................................................................

ఇది చాలా సామాన్య వాక్యమే. దానిలో ఎటువంటి రహస్యము దాగియుండలేదు. అదేమి చెప్పుచున్నదో దాని అర్థము కూడా అదే. వదిలి పెట్టుటనగా విసిరి వేయుట, విడుచుట అని అర్థము. అలా చేయుట వలన ఏ విషయమైతే మనలను వేదిస్తుందో, బాధించుచున్నదో దానిని విడువాలి. అయితే మనము అనుకున్నంత సులభంగా మన భారాలను ఎటో ఒకవైపు విసిరేయలేము. ఏదో ఒక ఖాళీలోనికి మన వేదన పారిపోదు. దానిని మన పరలోకపు తండ్రికి అప్పగించిన యెడల దానిని పరిష్కరించుటకు సహాయపడుదునని ఆయన వాగ్దానము చేస్తున్నాడు. మత్తయిలోని వాగ్దానములలో కూడా యేసు మనకు అదే విషయాన్ని తెలియజేస్తున్నాడు. ఆవిధముగా చేయుట అంత కష్టమైన విషయమేమీ కాకపోయినను ఎందుకో ఆ భారమును దేవుని మీద మోపలేకపోతున్నాము.

అనేక విషయాలు మనలను వ్యాకులమునకు గురి చేయుచున్నవి. అది మనము చేసే పని వలన కలుగవచ్చును లేక విమర్శను ఎదుర్కొనలేక మనలను ప్రేమించేవారు లేకపోవుట వలనను, మనము ఎవరికి అవసరము లేదు అనుకొనుట వలనను, మనము దేవునికి అవసరము లేదు అని అనుకొనుట వలనను వ్యాకులము చెందవచ్చును.

కారణము ఏదైనా మనలో ఎక్కువమంది మన సమస్యను మనమే పరిష్కరించుకొనగలమని భావించుటచే సమస్యలు తీరుటలేదు. అట్టి భావాలున్నచో వాటిని గూర్చి మరొకసారి ఆలోచించమని పేతురు చెప్పాడు. దేవుడు మనలను గూర్చి చింతించుచున్నాడు గనుక ఆందోళన చెందవలదు ఏ పరిస్థితినైనా మార్చగల మన దేవుడు సమర్థుడని బైబిలు బోధిస్తుంది.

**ఇప్పుడు నిన్ను ఆందోళనకు గురి చేసే విషయాలేమిటి? అవి ఎంత న్యాయమైనా ప్రభువునకు అసాధ్యమేమైనా ఉంటుందా? ఈ విషయమై ఆలోచించుడి.**

## గురువారం ఆగస్టు 18

## దేవుని చూడలేకపోయినను విశ్వాసము కలిగియుండుడి

మనకు సంభవించే విషయాలను గూర్చి ఎవరూ జాగ్రత్త తీసికొనుటలేదని తలంచుట విచారకరమైన విషయమే.

బబులోనులో బంధీలుగా ఉన్న యూదులకు, వారి పరిస్థితిని గూర్చి దేవుడు శ్రద్ద వహించుటలేదనే భావము వారిలో కలిగింది. వారి పాపము వలన దేవుడు వారిని విడిచిపెట్టాడనియు అందువలననే ఇంకను బంధీలుగానే ఉన్నారనే భావము వారిలో ఉంది. అయితే వారికి యెషయా ఆదరణతో కూడిన మాటలను ప్రకటించాడు. యెషయా 40 చాలా చక్కటి భావము కలిగినది.

"గొఱ్ఱెల కాపరివలె ఆయన తన మందను మేపును. తన బాహువుతో గొఱ్ఱెపిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును. పాలిచ్చు వాటిని ఆయన మెల్లగా నడిపించును" (యెషయా 40:11).

చాలా కాలము గతించిపోవుట వలనను, వారు అప్పటికి బబులోను చెరలో ఉన్నందున "ప్రభువా నీవెక్కడున్నావు? మమ్ములను గూర్చి మీరు జాగ్రత్త కనుపరుస్తున్నారని గాని, ఎక్కడ మాకు ఆధారములు దొరుకుటలేదు?

**యెషయా 40:27-31 చదువుడి. యెషయా ఏవిధముగా దేవునిని వర్ణించుచున్నాడు? "యాకోబూ –నా మార్గము యెహోవాకు మరుగైయున్నది. నా న్యాయము నా దేవుని దృష్టికి కనబడలేదు అని నీవేల అనుకొనుచున్నావు" ఇశ్రాయేలూ, నీ వేల ఈలాగు చెప్పుచున్నావు? (యెషయా 40:27) దేవుని గూర్చి ఈవిధముగా వర్ణించుట ద్వారా వారి నమ్మకము ఏవిధముగా ఉందని సూచించుచున్నది?**

..........................................................................................

..........................................................................................

వేరొక గుంపునకు చెందిన ప్రజలు కూడా ఆవిధముగా భావించినట్లు ఎస్తేరు పుస్తకంలో చూడవచ్చును. ఈ పుస్తకములో దేవుని నామము ఒక్కసారి కూడా కనిపించదు. అయితే వారిని నాశనము చేయవలసిందిగా మరెన్నటికి మార్పు చెందని రాజు యొక్క ఆజ్ఞ ఉండగా దేవుడు ఏవిధంగా అడ్డుకొని ప్రజలను నాశనము నుండి కాపాడెనో చూడగలము. ఈ వృత్తాంతము పూర్వకాలములో జరిగిన విషయాలను గుర్తు చేయుటయే గాక భవిష్యత్తులో దేవుని ప్రజలకు శ్రమలు కలుగునని, మరణకరమైన శాసనములివ్వబడునని చెప్పబడింది (ప్రకటన 13:15) అట్టి పరిస్థితులు కడవరి దినాల్లో సంభవించినచో దేవుడు తన ప్రజలను విడిచాడనే ఆందోళన చెందే పరిస్థితులు ఏర్పడును. భయపడవద్దు. ఎస్తేరులో ఏ దేవుడైతే తన ప్రజలను రక్షించాడో అదే దేవుడు కడవరి కాలములోని ప్రజలను రక్షిస్తాడు.

**బానిసలుగా ఉన్న దేవుని ప్రజలను గూర్చి యెషయా యొక్క వివరణను గూర్చి చదివియున్నాము. దేవుడు వారిని విడనాడాడు. మాకు కనిపించుటలేదని భావించే దేవుని ప్రజలకు దేవుని గూర్చి ఎట్లు వివరిస్తావు? వారి చుట్టూ ఉన్న పరిస్థితులను చూచి కాదు గాని విశ్వాస నేత్రాలతో పరిస్థితులను పరిగణించాలని వారికి నీవెట్లు బోధిస్తావు?**

..........................................................................................

..........................................................................................

శుక్రవారం ఆగస్టు 19

## అదనపు అధ్యయనము

ఎలెన్ జివైట్, ప్రవక్తలు మరియు రాజుల గ్రంథము నుండి "రాణియైన ఎస్తేరు దినములలో" పుటలు 598–606 చదువుడి.

"ఎవరైతే ఆయనను వేడుకుంటారో, వారికి పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తానని దేవుడు చెప్పలేదా? ఈ ఆత్మ సత్యవంతుడు మరియు నిజమైన మార్గదర్శకుడు కాడా? దేవుడు చెప్పిన మాటలను వినుటకు కొందరు భయపడుదురు. అది వారి ఊహ మాత్రమే అని వారు అనుకుంటారు. మనకు బోధించమని ప్రభువును ప్రార్థిస్తాము కాని, ఒక ప్రక్క ఆయనంటే భయం కలిగియుండి ప్రార్ధించినది సంభవించదేమో అని అనుమానమైన మనస్సు ఉన్నపుడు దేవుడు చేసిన వాగ్దానములు నెరవేరవని ఎందుకు అనుమానించాలి? ఆవిధముగా మనము ఎన్నడు దేవునిని అనుమాన పడకూడదు. మరియు ఆయనను అవమాన పరచకూడదు. దేవుని చిత్తమును తెలుసుకోవాలని నీవు కోరినపుడు ఆయన చిత్తమును గ్రహించియున్నావు. మనలను మనమే నమ్మకపోవుట వలన ఆయన బోధలను తప్పుగా వివరిస్తున్నాము. ఆ విషయములో కూడా ఆయన యందు నమ్మిక యుంచి ప్రార్ధనా పూర్వకముగా ముందుకు సాగాలి. అప్పుడు ఆయన పరిశుద్దాత్మ సరియైన రీతిలో దేవుని వాక్యమును వివరించి దానిని అనుసరించాలని ఆయనే సహాయపడును" ఎలెన్ జి వైట్, చేవ్రాతలు సంపుటి 6, పుట 225.

"వ్యతిరేక ప్రభావములను ఎదుర్కొనుట ద్వారాను, అనుమానములను చేధించుట ద్వారాను విశ్వాసము బలపడుతుంది. అతి విలువైన వజ్రములకన్నను, ఏ శోధనలనైతే ఎదుర్కొన్నామో మరియు ఆవిధముగా ఎదుర్కొనుట ద్వారా కలిగిన అనుభవము ఎక్కువ విలువైనది" –ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 3, పుట 555.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మనము చూడని విషయాలను నమ్మే వాటిని గూర్చి మీ తరగతిలో చర్చించండి. ఈవిధముగా చేయుట వలన "అదృశ్యమైన వానిని చూచుట" అనే అంశమును ఎట్లు అర్ధము చేసుకొనగలము?
2. బుధవారం పాఠంలోని చివరి ప్రశ్నను గూర్చి మీ తరగతిలో చర్చించండి. ఆ పరిస్థితిలో మనము ఎన్నిసార్లు కనబడుచున్నాము? మనకు ఇష్టము లేకపోయినను ప్రభువు మార్గము ఎల్లపుడు మంచిదని మనము ఎట్లు నమ్మగలము?

❖❖❖

9వ పాఠం ఆగష్టు 20-26

# స్తుతి గాయము చేసే జీవితం

**సబ్బాతు మధ్యాహ్నము :** ఆగష్టు 20

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఫిలిప్పీ 4:4-7; యెహోషువ 5:13-6:20; కీర్తన 145; అపొ.కా.16:16-34; 2దినవృ 20:1-30.**

**కంఠతవచనం : "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి. మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పి 4:4).**

మనము సంతోషముగా ఉన్నప్పుడు ఆనందముతో కోలాహలం చేయడం సులువే. అయితే పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు, ఊహించుటకు వీలుకానంత దుస్థితిలో మనమున్నపుడు కొలిమి మండుచున్నపుడు జీవితము సులభమనిపించదు. అట్టి స్థితిలో మరింత ఎక్కువగా దేవునికి స్తుతి యాగము చేయవలసి యున్నాము. స్తుతి యాగము మన విశ్వాసము కొనసాగుటకు ఒక సాధనము లేక మార్గముగా సహాయపడుతుంది.

మన నిరాశాజనకమైన చీకటి పరిస్థితులను కూడా స్తుతియాగము మార్పు చేయగలదు. అనగా మన చుట్టూ ఉన్న పరిస్థితులను అనుకూలంగా మార్చి వేస్తుందని కాదు గాని ఒక విధంగా అది మనలను, చుట్టూ ఉన్న వారిని, సవాళ్ళను ఎదుర్కొనుటకు వీలుగా మార్పు చెందుటకు సహాయపడుతుంది.

స్తుతి యాగము అనగా క్రియా రూపములో ఉన్న చర్యయైయున్నది. స్తుతియాగము చేయుట అనునది ఎల్లవేళల మనకు స్వాభావికముగా వచ్చిన అలవాటు కాకపోవచ్చును. దానిని అలవాటుగా మార్చుకున్నపుడు మన జీవితాలలో స్వాభావికమైన స్వభావముగా మారిపోతుంది. స్తుతి యాగమునకు మార్పు చేసే మరియు జయించగలిగే శక్తి కలిగి యుంది.

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** స్తుతి యాగము చేయుట అంటే ఏమిటి? కష్ట సమయాలలో ఈ స్తుతి యాగము ఏవిధముగా ఒక ఆధ్యాత్మిక శక్తిగా మారుతుంది? మనలను, చుట్టూ ఉన్న పరిస్థితులను స్తుతియాగము ఏవిధముగా మార్పు చేస్తుంది?

– ఆగష్టు 27, సబ్బాతు దినమున ఈ వారం పాఠము అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** ఆగష్టు 21

## స్తుతి యాగమునకు రూపము

ఒక ప్రముఖ రష్యా దేశపు రచయిత ఫాయిడోర్ డోస్టోవ్‌స్కినకు మరణ శిక్ష

విధించబడినది. ఆ మరణ శిక్షను అమలుపర్చుటకు కొన్ని చివరి క్షణాల ముందు మార్పు చేయబడినది. అయితే అతడు ఎన్నో సంవత్సరాలు జైలు జీవితం అనుభవించాల్సి వచ్చింది. తనకు కలిగిన జైలు అనుభవమును గూర్చి మాట్లాడుతూ ఈ విధముగా వ్రాసాడు. “మనుష్యులందరు నిన్ను ఒంటరివానిని చేసి విడిచి వెళ్ళినా, చివరి వరకు నమ్ము. నీవొక్కడివే విశ్వాసిగా నిలువబడవచ్చు. నీ ఏకాంత జీవితంలో దేవునికి కానుకలు సమర్పించి స్తుతి యాగము చేయి”.

ఈ పాఠముల ద్వారా పౌలు నమ్మశక్యముగాని విధముగా తన పరిచర్యకు వ్యతిరేకతను మరియు హింసను సహించుట చూచి యున్నాము. ఇప్పుడైతే ఆయన ఒక రోమా జైలులో బంధింపబడ్డాడు. అయినప్పటికి నిరుత్సాహపడలేదు. ఆ సమయములో ఫిలిప్పీలో ఉన్న విశ్వాసులను ప్రోత్సహించుటకు వారికి ఎంతో ఉత్కంఠతో ఉత్తరమును వ్రాసాడు.

**ఫిలిప్పి 4:4–7 చదువుడి. పౌలు తానే స్వయముగా జైలులో కూర్చొనియుండగా అటువంటి విషయాలను ఏవిధంగా వ్రాసాడు? “దేవుని సమాధానమును” పొందుట కవసరమైన ముఖ్య విషయాలు ఏమిటని ఈ వాక్యాలు తెలియజేస్తున్నాయి.**

........................................................................................................

........................................................................................................

అన్ని విషయాలు సక్రమముగా ఉన్నపుడు సంతోషముగా ఉండుట సహజమే. అయితే పౌలు ఇక్కడ “ఎల్లప్పుడు సంతోషించుడి” అని మనలను ప్రోత్సహించాడు. ఆ పిలుపు వినుటకు కొంత వింతగాను ఉన్నది. పౌలు వ్రాసిన విషయాన్ని ఉన్నది ఉన్నట్లు తీసుకుంటే విమర్శకు గురయ్యే రెండు విషయాలను ఎదుర్కొనాలి.

మొదటగా ఎల్లప్పుడు మనము సంతోషించాలనుకుంటే, పరిస్థితులు అనుకూలముగా లేనప్పుడు సంతోషించాలి. రెండవదిగా ఎల్లవేళలా సంతోషంగా ఉండాలనుకుంటే సంతోషించుటకు మనసు లేకున్నా నేర్చుకోవాలి.

మనకు అసహజమనుకున్న అనేక సమయాలలో కూడా దేవునికి స్తుతియాగము చేయమని పౌలు పిలుస్తున్నాడు. ఇంకొక విధముగా చెప్పాలంటే సరియైన కారణములేకున్నా సంతోషించమనియు, అదొక విశ్వాస చర్యగా పరిగణించబడుతుంది. విశ్వాసము అనగా కనిపించే పరిస్థితులను బట్టి కాదు గాని దేవుని గూర్చిన సత్యమును బట్టి విశ్వాసమును అనుభవిస్తున్నాము. ప్రకటిస్తున్నాము. ఆవిధముగానే దేవుని గూర్చిన సత్యమును బట్టి మనకు ఆయన చేసిన వాగ్దానములను బట్టి స్తుతియాగము చేయబద్దులమైయున్నాము.

**నేటి కొరకు ఏర్పాటు చేయబడిన వాక్యాలలో దేవుని సత్యమును గూర్చి పౌలు గుర్తించినదేమిటి? అతడు ఏవిధంగా జైలులో స్తుతియాగము చేయగలిగాడు? దేవుని గూర్చిన సత్యము విషయమై మీ తలంపులను బట్టి కొన్ని విషయాలు వ్రాసి ప్రతి దాని కొరకు ఆయనను స్తుతించుడి.**

..........................................................................................

..........................................................................................

సోమవారం ఆగష్టు 22

## గోడలు, కూలిపోవునంతగా ప్రార్థించుట

"ఒక మూల వరకు రంగువేయండి" అనే ఒక ఇంగ్లీషు సామెత ఉన్నది. ఒక గది యొక్క నేల రంగులు వేస్తున్నట్లు ఊహించుకొనండి. ఆవిధముగా నేల మీద రంగులు వేసుకుంటూ ఆ గది యొక్క మూలకు చేరుకున్నట్లయితే అక్కడ నుండి వెలుపలకు రావడం ఎంత కష్టమో ఆలోచించండి. నేల మీద వేసిన రంగును త్రొక్కుకుంటూ, దానిమీద నడిచి రావాల్సిందే రంగు లేక ఆరే వరకు ఓపికతో ఆ మూలనే కనిపెట్టుకొనియుండాలి.

కొన్నిసార్లు మన విశ్వాసము ఒక మూలకు నెట్టివేస్తుంది. నేలమీద వేసిన తడి రంగు ఏవిధంగా రంగు వేసిన వానిని ఒక మూలకు నిలిపివేస్తుందో అదే మనలను బంధించి ఉంచుతుంది. పరిస్థితిని గమనించినపుడు మనము దేవునిని, విశ్వాసమును మరియు నమ్మిన అన్ని విషయాలను తిరస్కరించవలసి వస్తుంది. లేక అక్కడ పరిస్థితులను అధిగమించుట అసాధ్యమనిపించినను మన నమ్మకము సడలిపోకుండా మన విశ్వాసము మనలను బలవంతము చేస్తుంది.

దేవుడు ఇశ్రాయేలీయులను ఒక మూలకు తీసుకువెళ్ళాడు. వారు 40 సం॥లు అరణ్యములో సంచారము చేసిన తరువాత ఖాళీగా ఉన్న శాంతియుతమైన బలమైన ప్రాకారములు గల పట్టణాలుండగా, బలమైన పట్టణము యొద్దకు ఎరికో పట్టణము చుట్టూ నడిచిన తరువాత ఏడవదినము ఇశ్రాయేలీయులందరు గట్టిగా ఆర్భాటముతో కేకలు వేయాలి. వారు ఊదిన బూరల శబ్దముతో పాటు ప్రజలందరు వేసిన కేకల ధ్వని వారికి విజయమును అనుగ్రహిస్తుంది.

**యెహోషువ 5:13; 6:20 చదువుడి. ఇశ్రాయేలీయులకు దేవుడు ఏమి బోధించాలని ప్రయత్నిస్తున్నాడు?**

..........................................................................................

..........................................................................................

ఆర్భాటముగా కేకలు వేయుట వలన ప్రకంపనలు పుట్టి గోడలు కూలిపోవడం జరగదు. దేవుడు ఇశ్రాయేలీయులను కేకలు వేయమని చెప్పినపుడు కీర్తన 66లో వ్రాసిన దావీదు కేకలు వంటివే. “సర్వలోక నివాసులారా, దేవుని గూర్చి ప్రభావము ఆరోపించి ఆయనను స్తోత్రించుడి. (కీర్తన 66:1,2) కేకలు వేయుట స్తుతియాగము చేయుట అని అర్థము. బలమైన గోడలను ఆరు దినములు పరిశీలించిన తరువాత వారంతట వారు ఎట్టి పరిస్థితిలోను గోడలను కూల్చలేరు అనే నిర్ణయానికి వచ్చారు.

**ఈ ఆలోచన మనము హెబ్రీ 11:30 యొక్క భావమును అర్థము చేసుకొనుటకు సహాయపడుతుంది?**

..............................................................................................

..............................................................................................

**మన జీవితములలో దేవుడొక నూతన కార్యమును చేయుటకు సిద్ధముగా ఉన్నపుడు ఆయన ఎరికో యొద్దకు తీసుకొని వెళ్ళును. విజయము సాధించుటకు శక్తి సామర్థ్యము లేదని తెలుసుకొని బోధించును. అవసరమైన ప్రతీది వెలుపల నుండే వచ్చును. అందుచే మన ముందు ఏదున్నా అధిగమించలేనిదైనా దానిపై విజయము సాధించుటకు మన పాత్ర కేవలం దేవునికి స్తుతియాగము చేయుట మాత్రమే. అదే మన అవసరాలకు మూలధారము. ఇదే క్రియారూపకమైన విశ్వాసము.**

**మంగళవారం** **ఆగస్టు 23**

## స్తుతియాగము చేసే జీవితము

మంచి పరిస్థితులలో కూడా దేవునికి స్తుతియాగము చేయుట మనకు సహజ లక్షణము కాకపోవచ్చును. అయితే వ్యతిరేక పరిస్థితులలో అది ఇంకెంత కష్టమో తెలుసా? అయినను మనము స్తుతియాగము చేయవలసియున్నామని పిలువబడితిమి. ఇది ఏదో ఒక సమయానికి పరిమితము కాకుండా, మనము జీవించుచున్న పరిస్థితులలో భాగమయ్యేంత వరకు తర్ఫీదు చేస్తుండాలి. స్తుతియాగము చేయుట ప్రత్యేక విధానములో చేయాలనుటకంటే అది జీవిత విధానమైయుండాలి.

**కీర్తన 145 చదువుడి. దేవుని స్తుతించుటకు గల ఏ కారణాలను దావీదు చూపించుచున్నాడు? ఏ రీతులలో ఈ కీర్తనలోని మాటలు మీ సొంత కీర్తనగా ఉండాలి?**

..............................................................................................

..............................................................................................

చార్లెస్ హేడెన్ స్పర్జన్ అనే ప్రముఖ బ్రిటన్ దేశపు ప్రసంగీకుడు "స్తుతియాగము అభ్యాసము చేయుట" అనే పుస్తకమును రచించాడు. నేడు మనం ఎంచుకొనిన కీర్తన 7వ వచనమును ఆధారము చేసుకొని వ్రాయబడినది. ఈ చిన్న వచనములో మూడు ప్రాముఖ్యమైన విషయాలకు మన గమనములను స్పర్జన్ గారు త్రిప్పుచున్నారు.

1. మన చుట్టు ప్రక్కలను పరిశీలించుట ద్వారా స్తుతియాగము అభ్యాసము చేయబడుచున్నది. మన చుట్టూ ఉన్న ప్రదేశమును చూడనియెడల, దేవుని గొప్పతనమును చూడలేము. అప్పుడు మనము స్తుతియాగము చేయుటకు కారణమవుతుంది. దేవుని స్తుతించుటకు దేవుని సృష్టి సౌందర్యముగా ఉన్నది. ఒక యువ క్రైస్తవుని విశ్వాసము ఎదుగుచుండగా, ఆధ్యాత్మిక లోకములో దేవుని స్తుతించుటకు అదొక కారణమవుతుంది కదా?

2. మనము చూచిన దానిని జ్ఞాపకముంచుకొనుట ద్వారా స్తుతియాగము అభ్యాసము చేయబడుతుంది. స్తుతించే వాతావరణములో మనము జీవించినట్లయితే దానికి కారణమెవరై యుంటారనే విషయాన్ని జ్ఞాపకము చేసుకుంటాము. దేవుని చేత సృష్టించబడిన ఘనమైన విషయాలను గుర్తుంచుకున్నపుడు ఆయన యొక్క మంచితనము, ఆయనను గూర్చిన సత్యము మన మనస్సులలో స్థిరముగా నిలిచియుంటుంది కదా?

3. స్తుతి యాగమును గూర్చి సంభాషించినపుడు దానిని అభ్యాసము చేయుచున్నామని అర్ధము. స్తుతి చేయడము అంటే మన తలలతోచేయుట కాదు. అది మన నోటి నుండి రావలసియుంది. అదే మన చుట్టు ఉన్న వారికి వినబడే విధముగా ఉంటుంది. మాటలతో దేవునిని స్తుతించుటకు ఏ కారణాలను నీవు వెతుకుతావు. అటువంటి స్తుతియాగము ఎటువంటి ప్రభావమును చూపును? మరియు ఎవరిపైన తన ప్రభావము చూపిస్తుంది?

**ఈ మూడు అంశాలగూర్చి మీ సొంత ఊహలలో ప్రాముఖ్యమైన కొన్ని విషయాలను కాగితముపై వ్రాసి నీ జీవితంలో స్తుతియాగము చేయుట అలవాటుగా నీవేమి చేయగలవు?**

..................................................................................................

..................................................................................................

**బుధవారం** **ఆగష్టు 24**

## నమ్మించే ఒక సాక్షి

వినిన వారిపై ఆశ్చర్యకరమైన ప్రభావమును అపొస్తులుల కార్యముల పుస్తకములోని స్తుతి యాగము గొప్ప ప్రభావాన్ని తీసుకొనివచ్చెను. అపో.కా.16:16-34 చదువుడి. కొరడాలతో కొట్టిన తరువాత పౌలును, సీలను చెరసాలలో బంధించారు. గాయములతో

నలిగిపోయిన వీపులపై ఔషధము రుద్దుటకు సహాయకులెవ్వరు లేరు. కాళ్ళను దుంగలకు కట్టి జైలు యొక్క చీకటి గదులలో వారిని బంధించారు. అయితే ఇతర ఖైదీలు కూర్చొని వినుచుండగా పౌలు సీలలు బిగ్గరగా పాటలు పాడుతూ ప్రార్ధనలు చేసారు.

భూకంపము తరువాత పౌలు సీలలు మరియు ఇతర ఖైదీలెవరూ జైలు నుండి పారిపోలేదని తెలుసుకొని జైలు అధికారి "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెననెను" (అపొ.కా.16:30) అని అడిగెను.

**ఈ సంఘటన ద్వారా జైలు అధికారికి రక్షణ అవసరముందని అతడెందుకు తన దృష్టిని దానిపై పెట్టెను. పౌలు సీలయు పాడిన పాటలు, చేసిన ప్రార్ధనలు ఇతర ఖైదీలు కూడా పారిపోకుండా ఉండుటకు జైలు అధికారి, అతని కుటుంబము మారుమనస్సు పొందుటకు ఎటువంటి పాత్రను పోషించెను?**

..............................................................................................

..............................................................................................

మన స్తుతియాగము మన చుట్టూ ఉన్న శాశ్వత గమ్యమువైపు త్రిప్పబడుటకు సహాయపడుతుందనే విషయము చాలా ఆశ్చర్యమును కల్గిస్తుంది. పౌలుసీలయు విచారముతో సణుగుకొనుచు ఆ చీకటి గదిలో బంధింపబడి యుంటే ఎవరైనా ఆ రాత్రి రక్షింపబడియుండేవారా?

తరువాత ఆ జైలు అధికారికి మరియు అతని కుటుంబానికి ఏమి సంభవించినదో తెలియదు. కాని రోము పట్టణములో ఉన్న మరొక జైలులో పౌలు బంధింపబడియుండగా వ్రాసిన ఉత్తరాలను వారు చదివియుండవచ్చునని ఊహించుకొనవచ్చును. "ఏలయనగా మీరు నాయందు చూచినట్టియు, నాయందున్నదని మీరిప్పుడు వినుచున్నట్టియు పోరాటము మీకును కలిగియున్నందుని క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే గాక ఆయన పక్షమున శ్రమపడుటయు ఆయన పక్షమున మీకు అనుగ్రహింపబడెను" (ఫిలిప్పీ 1:29,30). ఈ విషయాన్ని వారు చదువుకొని పౌలు జీవితము ద్వారా వారి జీవితములో కలిగిన మార్పును ఒకసారి జ్ఞాపకము చేసుకొనిన యెడల, పౌలు శ్రమల ద్వారా వారికి సంతోషమును తీసుకొని వచ్చెనని గ్రహించియుండవచ్చును. వారి హృదయాలు ఒక పాటలో నిండియుండవచ్చును. వారు విశ్వాసులుగా నిలిచియుండుటకు పౌలు యొక్క సాక్ష్యము వారికి సహాయపడింది.

**నీ హృదయములోనుండి వచ్చిన స్తుతియాగము ద్వారా ఎవరైనా దేవుని యొక్క ప్రభావము క్రిందకు వచ్చియున్నారని చెప్పుటకు నీకేమైనా సమాచారముందా? ఇతరుల**

**చుట్టూ నీ స్తుతియాగము వినబడేటట్లు నీ హృదయపూర్వకమైన ప్రయత్నము చేయి.**

........................................................................................

........................................................................................

గురువారం ఆగస్టు 25

## విజయమును సాధించే ఒక ఆయుధము

2 దినవృత్తా 20:1–30 చదువుడి. స్తుతియాగము బలమైన ఆయుధముగా పనిచేస్తుందని యెహోషాపాతు కనుగొన్నాడు. అతనికి వ్యతిరేకముగా బలమైన పెద్ద సంఖ్యలో ఉన్న శత్రు సైనికులు దండెత్తి రాగా ఆ విషయము తెలిసిన వెంటనే యెహోషాపాతు కూడా తన సైన్యముతో యుద్ధ సన్నాహాలకు సిద్ధపడలేదు. అతడు యుద్ధములోనికి ప్రవేశించకముందు యూదా ప్రజలు ఉపవాసముండి యెరూషలేమునకు వచ్చినప్పుడు యెహోషాపాతు తాను ఎట్టి స్థితిలో ఉన్నాడో ఎరిగినవాడై నిజమును ఒప్పుకున్నాడు. "మా దేవా నీవు వారికి తీర్పు తీర్చవా? మా మీదికి వచ్చు ఈ గొప్ప సైన్యముతో యుద్ధము చేయుటకును మాకు శక్తి చాలదు. ఏమి చేయుటకును మాకు తోచదు. నీవే మాకు దిక్కు అని ప్రార్థన చేసెను" (2దిన 20:12).

**ఒక పెద్ద సైన్యము మిమ్ములను చేరుటకు సన్నద్ధమైవచ్చుట మీరు చూచినప్పుడు మీ స్పందన తక్షణమే ఏవిధంగా ఉండబోతుంది? (2దిన 20:3–12)లో యెహోషాపాతు ఇచ్చిన జవాబును బట్టి బలమైన ప్రత్యర్థులు ఉన్నపుడు ఏవిధంగా ఎదుర్కొనాలో ఈ సంఘటన ద్వారా ఏమి నేర్చుకున్నారు?**

........................................................................................

........................................................................................

యహాజీయేలు మీదికి యెహోవా ఆత్మ రాగా అతడు చాలా ధైర్యముగా ప్రకటించెను. "ఈ యుద్ధములో మీరు పోట్లాడవలసిన నిమిత్తము లేదు. యూదావారలారా, యెరూషలేమువారలారా మీరు యుద్ధపంక్తులు తీర్చి నిలువబడుడి. మీతో కూడనున్న యెహోవా దయ చేయు రక్షణను మీరు చూచెదరు. భయపడకుడి. జడియకుడి. రేపు వారి మీదికి పోవుడి. యెహోవా మీతో కూడా ఉండును" (2దినవృ 20:17).దాని తరువాత స్తుతి యాగము చేసి దేవుని కొనియాడారు. గొప్ప శబ్దముతో స్తుతించిరి. (2దిన 20:19). దేవుడు వారి పక్షమున యుద్ధము చేయబోవుచున్నను వారు యుద్ధ సన్నద్ధులై శత్రువును ఎదుర్కొనుటకు యుద్ధమునకు వెళ్ళవలసియున్నారు.

అయితే ఇదొక సామాన్యమైన ప్రయత్నము కాకూడదు. యూదా వారు యుద్ధమునకు బయలుదేరుచుండగా యెహోషాపాతు ఒక గానబృందమును నియమించెను. "వారు పాడుటకును స్తుతించుటకును మొదలు పెట్టగా యెహోవా యూదా వారి మీదికి వచ్చిన అమ్మోనీయుల మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి" (2దినవృ 20:22). వారు దేవుని మీద ఉన్న వారి విశ్వాసమును ప్రదర్శించిన వెంటనే దేవుడు అదే క్షణములో కలుగజేసుకొనెను.

"మరియు అతడు జనులను హెచ్చరిక చేసిన తరువాత యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందర నడచుచు – యెహోవా కృప నిరంతరముండును. ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను" (2 దినవృ 20:21).

**నేటి దినమునకు ఏర్పాటు చేయబడిన బైబిలు వాక్యాలను చదవండి. కష్ట సమయాలలోను, శోధనలలోను దేవునితో నీ నడతకు ఈ వాక్యాలలో ఉన్న నియమాలు ఏవిధంగా సహాయపడునో తెలుసుకొనుము.**

..........................................................................................

..........................................................................................

**శుక్రవారం** **ఆగష్టు 26**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, ప్రవక్తలు మరియు రాజుల గ్రంథమునుండి "యెహోషాపాత్" పుట 190–203; పితరులు మరియు ప్రవక్తల గ్రంథము నుండి ఎరికో యొక్క పతనము, పుటలు 487–488 చదువుడి.

"అసాధారణమైన తన ప్రేమను మన యెడల చూపిన దేవునికి మన హృదయములోను, మన పెదవులతోను స్తుతియాగము చేయుటకు తర్ఫీదు పొందుదుము. కల్వరి సిలువ యొద్ద నుండి వెలుగు ప్రకాశించుచుండగా, నిరీక్షణ కలిగియుండుటకు మన జీవములను తర్ఫీదు చేసుకొందుము. సైన్యముల కధిపతియగు యెహోవా మరియు పరలోకపు రాజు యొక్క కుమారులము, కుమార్తెలమని మనమెన్నడు మరువరాదు. దేవుని యందు నిశ్చయముగా నిలిచియుండుట మనకు భాగ్యమని గుర్తుంచుకోవాలి" స్వస్థతా సువార్త పరిచర్య పుట 253.

"నేను దేవుని ఆరాధించుచు ఆయనను ఘనపరచుచుండగా నాతో కలిసి మీరును ఆయనను ఘనపర్చమని కోరుచున్నాను. మీరు చీకటిలో పడిపోయినను దేవుని స్తుతి

యాగము చేయుడు. శోధనలలో ఆయనకు స్తుతియాగము చేయుడు."ప్రభువునందు సంతోషించుడి మరల చెప్పుదును సంతోషించుడి అని పౌలు చెప్పుచున్నాడు. అది మీ కుటుంబములకు చీకటిని, విచారమును తీసికొనివస్తుందా? లేదు ఎన్నడూ ఆవిధముగా జరగదు. అది మీకు గొప్ప ప్రకాశవంతమైన వెలుగును కలుగజేస్తుంది. మహిమ సింహాసనము నుండి నీవు ఆ విధముగా శాశ్వత జీవ కిరణాలను ప్రోగు చేసుకుంటావు. నీ చుట్టూ ఉన్న వారికి ఈ వెలుగును ప్రకాశింపజేయుడి మరియు వెదజల్లుడి. ఈ పనిలో మీరు నిమగ్నులైనపుడు మీ ఇరుగుపొరుగు వారు పరలోక మహిమను కనుగుంటారు."ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 2, పుటలు 593, 594

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. క్రైస్తవుని జీవితములో సామాజికముగా స్తుతియాగము చేయుటలో గల ప్రాధాన్యత ఏమిటి? మీ సబ్బాతు ఆరాధనలో స్తుతి యాగమును గూర్చి ఎట్లు వివరించెదవు? అది మిమ్ములను ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్ళగలుగుచున్నదా? అలా లేనియెడల నీవేమి చేయగలవు?

2. నీవు అంధకారపు లోయలో పడిపోయినను "ప్రభువును స్తుతించుడి" అనగా అర్థమేమిటి? శోధనలలోను, బాధలలోను స్తుతి యాగము మనకెట్లు సహాయపడుతుంది?

3. సంఘ సభ్యులు వారి జీవితాలలో స్తుతియాగము చేయుట ద్వారా ఎటువంటి మార్పులు సంభవించాయో వ్యక్తిగతముగా సాక్ష్యమివ్వమని ప్రోత్సహించండి. ఒక్కొక్కరి అనుభవము నుండి నీవేమి నేర్చుకొనుచున్నావు?

❖❖❖

10వ పాఠం ఆగష్టు 27-సెప్టెంబరు 2

# కొలిమిలో సాత్వికము కలిగి యుండుట

సబ్బాతు మధ్యాహ్నము : ఆగష్టు 27

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : యెహెజ్కేలు 24:15-27; నిర్గమ 32:1-14; మత్తయి 5:43-48; 1 పేతురు 2:18-25; కీర్తన 62:1-8.**

**కంఠతవచనం: "సాత్వికులు ధన్యులు. వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" (మత్తయి 5:5).**

మనము "సాత్వికము" అనే మాటను మోషేను గూర్చి చదివినపుడు గాని లేక ధన్యతలను గూర్చి చదివినప్పుడు గాని వాడుదుము తప్ప తరచుగా వాడము. సాత్వికము గూర్చి తెలుసుకొనుట అంత కష్టమైన విషయము కాదు. గాయమైనప్పుడు ఓర్పుతో సహించుట మరియు దాని విషయమై ఆగ్రహం వెల్లడించకపోవుట సాత్వికము అంటారు. సాత్వికమును గూర్చి అంత ఎక్కువ మాట్లాడరు. లేక సాత్వికము అనే లక్షణాన్ని అన్ని సంప్రదాయాలలో గౌరవిస్తున్నారు. కొన్నిసార్లు బైబిలు ఈ మాటకు "వినయము" అని తర్జుమా చేస్తున్నది. వినయము కలిగియుండుట స్వభావము కాదు గాని అది కూడా ఒక లక్షణమే. ఈ లక్షణాన్ని అన్ని సంప్రదాయాలు గౌరవిస్తున్నాయి

అయితే సాత్వికము, గాయమును సహనముతో ఓర్చుకొనుట, ఆగ్రహమును తెలియపర్చకుండుట అనే లక్షణాలు యేసు యొక్క స్వభావములోను ఆయనను వెంబడించిన వారిలోను చాలా బలముగా కనిపిస్తాయి. అంతమాత్రము చేత దానంతటదే సంపూర్ణ భావము కలిగినది కాదు. వేదన మరియు శ్రమల మధ్య నలిగిపోతున్న వారిలో సాత్వికముగల మనస్సు బలమైన ఆయుధముగా ఉపయోగపడుతుంది. కొలిమి ఒక మంచి ఉదాహరణ. అందులో సాత్వికముతో కూడిన హృదయమునకు గొప్ప స్థానముంది. కొలిమిలో సాత్వికమును గూర్చి నేర్చుకొనుటకు కూడా అనువైన స్థలము. మనము సాత్వికముతో, విరిగి నలిగిన పాత్రలుగా ఉన్నప్పుడు దేవునికి మంచి బలమైన సాక్షులుగా నిలువబడగలము.

**సంక్షిప్తముగా ఈ వారముయొక్క పాఠము :** శ్రమలను ఎదుర్కొనుట మరియు సాత్వికము కలిగియుండుటకు మధ్యగల బాంధవ్యమేమిటి? మన సొంత సాత్వికముతో, విరిగి నలిగిన మనస్సుతో ఇతరులకు ఏవిధముగా ఒక సాక్షిగా ఉండగలము? క్రైస్తవునికి సాత్వికమనునది ఒక బలహీనత కాదు గాని అదొక బలముగా పరిగణింపబడుతుంది?

– సెప్టెంబరు 3, సబ్బాతు దినమున ఈవారము యొక్క పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **ఆగష్టు 28**

## విరిచిన రొట్టె గాను మరియు ప్రవహించు ద్రాక్షారసముగాను ఉండాలి

**పరిశీలించండి : ఆశ్వాల్డు చాంబర్సు ఈ విధముగా చెప్పాడు. మనము ఇతరులకు విరిచిన రొట్టెగాను, ప్రవహించు ద్రాక్షారసముగాను ఉండాలని చెప్పాడు. దీని అర్ధమేమైయుంటుందని నీవు అనుకొనుచున్నావు?**

ఇతరులకు పరిచర్య చేయుటకు గాను కొందరు విరచిన రొట్టెగా ఉన్నదని బైబిలంతటిలోను అనేక ఉదాహరణలు కన్పిస్తున్నవి. వాగ్దాన భూమిలోనికి ఇశ్రాయేలు ప్రజలను నడిపించినపుడు మోషే ఎన్నో విమర్శలకు మరియు వ్యర్ధ ప్రసంగములను ఎదుర్కొనవలసి వచ్చింది. వాటన్నిటిని మోషే సహించాడు. యోసేపు ఐగుప్తు దేశమునకు ప్రభుత్వ అధికారిగా నియమింపబడకముందు నమ్మక ద్రోహమునకు, జైలు శిక్షకు గురయ్యాడు. ప్రతివాని ఉదాహరణలో దేవుడు వారికి ఇబ్బందికరమైన పరిస్థితులను అనుమతించుట ద్వారా వారు ఇతర ప్రజలకు మాదిరిగా ఉండి దేవుని కృపను, ఆయన సంరక్షణను తెలియపర్చారు. దేవుడు మనలను కూడా అదే రీతిలో వాడుకుంటాడు. కొన్ని సందర్భాలలో కోపము తెచ్చుకొనుట లేక గాయపడిన భావాలలో బాధపడుట సులువు గానే సంభవిస్తాయి. అయితే నిన్నటి దినములోని పాఠములో చూచినట్లు సాత్వికము కలిగియుండుట అనునది దేవుడు అనుగ్రహించు సామర్థ్యము మరియు అది సహనముతోను మరియు కోపమును ప్రదర్శించక సహించుటకది తోడ్పడును.

**యెహెజ్కేలు 24:15–27 చదువుడి. ఇక్కడ ఏమి జరుగుచున్నది? యెహెజ్కేలు ఆ కొలిమిలో ఎందుకు ఉంచబడెను?**

............................................................................................................

............................................................................................................

యెహెజ్కేలు 24:24లో దేవుడు ఈవిధముగా చెప్పియున్నాడు. "యెహెజ్కేలు మీకు సూచనగా ఉండును. అతడు చేసినదంతటి ప్రకారము మీరును చేయుదురు. ఇది సంభవించునప్పుడు నేను ప్రభువైన యెహోవానై యున్నానని మీరు తెలిసికొందురు" దేవుడు ఎవరైయున్నాడు. ఆయన సార్వభౌమాధికారము గల ప్రభువని ప్రజలు యెహెజ్కేలు యొక్క

మాదిరిగా గుర్తించబోవుచున్నారు. ఈ సత్యమును వారు అనుభవపూర్వకముగా యెహెజ్కేలు జీవితము ద్వారా, శ్రమల ద్వారా తెలుసుకొనిరి. మన ద్వారా మన ప్రభువు సార్వభౌమాధికారము గల రాజని ఎంత మంది తెలుసుకొనబోవుచున్నారో ఎవరికి తెలుసు?

**కాస్త ముందో లేక వెనుకో మన జీవితాలన్నియు విరగగొట్టబడును. విరగ గొట్టబడుట అనగా ఏమిటో అని అనుభవపూర్వకముగా తెలుసుకున్నారా? ఆ సమయములో నీవు నేర్చుకున్న గుణపాఠములేమిటి? ఇతరులకు సహాయపడుటకు విరిగిన నీ మనస్సును దేవుడు ఏవిధంగా వాడుకొనబోవుచున్నాడు?**

..............................................................................................

సోమవారం ఆగష్టు 29

## కృప కొరకు మధ్యవర్తిత్వము చేయుట

నిర్గమ 32:1-14 చదువుడి. ఇక్కడ మోషే నిర్వహించిన పాత్ర ఏమిటి?

..............................................................................................

..............................................................................................

ఇశ్రాయేలు ప్రజలు బంగారు దూడను ఆరాధించుట ప్రారంభించినపుడు వారు చాలా దూరము వెళ్ళిపోయారని దేవుడు తలంచి వారిని పూర్తిగా నాశనము చేసి, మోషేను ఒక గొప్పజనముగా చేయుదునని ప్రకటించెను. దేవుడు చేసిన ఆ ప్రతిపాదనను అంగీకరించుటకు బదులు తన ప్రజల యెడల దేవుడు తన కృపను చూపమని మోషే బ్రతిమాలగా, దేవుడు తన మొరను ఆలకించెను.

నిర్గమ 32:1-14 రెండు ప్రాముఖ్యమైన అంశాలను లేవనెత్తుచున్నది. మొదటగా దేవుడు తిరుగుబాటు చేసిన ప్రజలందరిని నాశనము చేసి పరీక్షగా మోషేను ఆశీర్వదిస్తానని ప్రతిపాదన చేసాడు. ఈ అవిధేయులైన ప్రజల యెడల మోషేకున్న ప్రేమ, దయ ఎలాటిదో అతడు చూపుటకు దేవుడతనికి ఒక పరీక్ష పెట్టాడు. ఆ పరీక్షలో మోషే తన ప్రేమను మరియు దయను నిరూపించుకున్నాడు. యేసు పాపులకొరకు విజ్ఞాపన చేసినట్లు మోషే అవిధేయులైన తన ప్రజల కొరకు దేవునికి తన విజ్ఞాపన తెలియజేసాడు. ఇక్కడ ఆసక్తికరమైన విషయమొకటి బయలుపర్చబడింది. కొన్నిసార్లు మనము వ్యతిరేకతను ఎదుర్కొనుటకు దేవుడు అనుమతించును. మనము కొలిమిలో పడుటకు అనుమతిస్తాడు. అప్పుడు ఆయన మనము మరియు దీనినంతటిని గమనించుచున్న విశ్వము దారి తప్పిన వారి యెడల ఎంత దయ ఉన్నదో కనుగొనుటకు మనకు అవకాశం లభిస్తుంది.

**ఇశ్రాయేలును నాశనము చేయవద్దని ఏ కారణాలను చూపి మోషే ప్రభువును వేడుకుంటాడు?**

..........................................................................................

..........................................................................................

రెండవదిగా ఈ వాక్యాలను బట్టి వ్యతిరేకత మరియు అవిధేయతను అవకాశముగా తీసుకొని కృపను బయలుపర్చుటకు పిలుపు ఇవ్వబడెను. ప్రజలు ఎప్పుడైతే అనర్హులుగా ఉంటారో ఆ సమయములోనే వారికి కృప అవసరమైయున్నది. అయితే వారు అనర్హులుగా ఉన్న సమయములోనే వారికి తక్కువ ప్రతిపాదన చేసే అవకాశము కూడా ఉంది. అయితే మోషే అక్క మిర్యాము అతనిని విమర్శించినపుడు ఆమెకు కలిగిన కుష్టు వ్యాధి నుండి స్వస్థపర్చమని మోషే ప్రభువుని వేడుకున్నాడు. (సంఖ్యా 12) కోరహు యెడల, అతని అనుచరుల యెడల దేవుడు కోపముగా ఉండి, వారినందరిని నాశనము చేస్తానని చెప్పినపుడు వారి ప్రాణములు కాపాడుమని మోషే సాష్టాంగపడి దేవుని వేడుకుంటాడు. మరుసటి రోజున మోషేకు వ్యతిరేకముగా ఇశ్రాయేలు ప్రజలు సణుగుకొని తిరుగుబాటు చేసినపుడు వారందరిని నాశనము చేస్తానని దేవుడు చెప్పినపుడు మోషే దేవుని యెదుట సాష్టాంగపడి అహరోనును పిలిచి వారందరి నిమిత్తమై దహన బలిని అర్పించమని కోరెను (సంఖ్యాకాండము 16) మోషే తన సాత్వికముతో నిస్వార్థముగా వ్యవహరిస్తూ కొలిమి మధ్యలోనికి వెళ్ళాడు. అనర్హులైన వారి పక్షమున మోషే దేవుని కృప కొరకు ప్రాధేయపడ్డాడు.

**కృపను పొందుటకు బొత్తిగా అనర్హులైన మీ చుట్టు ప్రక్కలున్న ప్రజలను గూర్చి ఆలోచించుడి. వారికి దేవుని యొక్క కృపను నీ సాత్వికముతోను, నిస్వార్థమైన వినయముతోను ఎట్లు బయలుపర్చగలవు?**

**మంగళవారం** **ఆగష్టు 30**

## మనలను గాయపర్చువారిని ప్రేమించుట

ఒకరు ఈ విధముగా అన్నారు. మన శత్రువులను ప్రేమించుట అనగా ముత్యము మురికిలో పాతిపెట్టబడి ఉంటే ఆ మురికిని ప్రేమించమని అర్థము కాదు. దానికి బదులుగా మురికిలో కప్పబడియున్న ముత్యమును మనము ప్రేమించాలి. మనము స్వాభావికముగా ప్రేమింపదగిన వారము కాబట్టి దేవుడు మనలను ప్రేమించుట లేదు గాని ఆయన మనలను ప్రేమించుచున్నాడు కాబట్టి మనము ప్రేమింప దగినవారమయ్యాము.

**మీరు మీ శత్రువులను చూచినపుడు సాధారణముగా మీరేమి చూస్తారు? ముత్యమునా? లేక దాని కప్పియున్న మురికినా?**

.................................................................................................

.................................................................................................

**మత్తయి 5:43-48 చదువుడి. మన శత్రువులను ప్రేమించి వారి కొరకు ప్రార్థించమని యేసు పిలుస్తున్నాడు. ఎందుకు శత్రువులను ప్రేమించాలో మనము అర్థము చేసుకొనుటకు సహాయపడుటకు ఏ ఉదాహరణ యేసు ఇచ్చాడు? ఆయన ఏ విషయాన్ని బోధించాడు?**

.................................................................................................

.................................................................................................

మత్తయి 5:45లో పరలోకమందున్న తన తండ్రిని ఉదాహరణగా యేసు ఉపయోగిస్తూ మనలను గాయపరచిన వారిని లేక ఘోరమైన కొలిమిలోకి నెట్టివేసిన వారిని మనము ఏవిధముగా ప్రేమించాలో బోధించుచున్నాడు. నీతిమంతులకు, అనీతిమంతులకు తన తండ్రి వర్షమనే దీవెనను ఏ బేధము లేకుండా పంపుచున్నాడని యేసు చెప్పుచున్నాడు. అనీతిమంతులకు కూడా దేవుడు వర్షమును అనుగ్రహించుచున్న యెడల మనము వారిని ఏవిధముగా ఆదరించవలసియున్నాము?

మనకు శ్రమను కలిగించే వారి యెడల ఎల్లపుడు ప్రేమ కలిగి వ్యవహరించాలి అని యేసు మనకు చెప్పుట లేదు. శత్రువుల యెడల ప్రేమ కలిగి యుండుట అంటే అది వారి యెడల మనకున్న భావన కాదు గాని, ప్రత్యేకమైన క్రియల రూపములో వారి యెడల జాగ్రత్త తీసుకుంటున్నామని బయలుపర్చవలసియున్నది.

తరచుగా చర్చకు కారణమవుతున్న వాక్యాన్ని యేసు ముగింపు భాగములో ఉపయోగించాడు. “మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు” మత్తయి 5:48.

ఆ సందర్భమును బట్టి గమనించినచో దాని భావము చాలా స్పష్టముగానే ఉన్నది. దేవుడు పరిపూర్ణుడైనట్లు మనుష్యులు కూడా పరిపూర్ణులుగా ఉండగోరిన యెడల దేవుడు తన శత్రువుల యెడల చూపించే ప్రేమను, పోలిన ప్రేమను వారి శత్రువుల యెడల చూపించవలసియున్నది. దేవుని దృష్టిలో పరిపూర్ణులుగా ఉండగోరిన యెడల వారు వారి శత్రువులను ప్రేమించాలి. ఆవిధముగా చేయాలంటే వారి హృదయములో సాత్వికముఉండాలి. సాత్వికం కేవలం దేవుడు మాత్రమే ఇవ్వగలడు.

**సాత్వికమును గూర్చి మనము ఇచ్చిన వివరణను మనస్సులో పెట్టుకొని అవసరమైన సాత్వికమును మన హృదయాలకు ప్రభువు అనుగ్రహించునట్లు ఏ మార్పులు చేసుకొనవలెనో జాబితాను తయారు చేయండి. శత్రువుల యెడల సరియైన వైఖరి మనము కలిగియుండాలి.**

బుధవారం ఆగస్టు 31

## తెరవని ఒక నోరు

కొలిమిలో సాత్వికము చూపించిన గొప్ప శక్తివంతమైన ఉదాహరణ యేసు యొద్ద నుండి వస్తుంది. ఆయన ఈ విధముగా చెప్పినపుడు "నేను సాత్వికుడను దీనమనస్సు గల వాడను గనుక మీ మీద నా కాడి నెత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును" (మత్తయి 11:29). మనము ఊహించలేని భావము ఆయన కలిగి యుండవచ్చును.

**1పేతురు 2:18-25 చదువుడి. బానిసలకు పేతురు ఆశ్చర్యమైన సలహాను ఇస్తున్నాడు. యేసును ఏవిధముగా అన్యాయముగాను, బాధాకరముగాను బాధించారో మనము గమనించినట్లయితే ఆయన యెడల వారు వ్యవహరించిన తీరును బట్టి ఆయన అడుగు జాడలను వెంబడించుటకు వీలుగా ఆయన ఒక మాదిరిని విడిచి వెళ్లాడు (1పేతురు 2:21) పేతురు వివరించినట్లు యేసు యొక్క మాదిరి నుండి కొలిమిలో ఆయన చూపిన సాత్వికము మరియు వినయమునుండి మనము ఏమి నేర్చుకొనియున్నాము?**

..........................................................................................

..........................................................................................

ఒక వ్యక్తి వేరొక వ్యక్తి యెడల అన్యాయముగా వ్యవహరిస్తున్నపుడు ఆ స్థితిని చూడడము చాలా బాధాకరముగా ఉంటుంది. మనలో న్యాయమును గూర్చి లోతైన అవగాహన ఉండుట వలన అన్యాయము జరిగినప్పుడు నీతిపరమైన మరియు న్యాయముగానే కొంత కోపం వస్తుంది.

సాత్వికముతో జీవించడం అంత సులభమైన విషయము కాదు. ప్రతి విషయము మన పరలోకపు తండ్రి స్వాధీనములో ఉందని నమ్మితేనే తప్ప సాత్వికముతో జీవించలేము. అన్ని సమయాలలోను అన్యాయము జరిగినపుడు ఆ పరిస్థితి నుండి మనలను కాపాడేవారు ఉండకపోవచ్చు. యేసు విషయములో కూడా అన్యాయము జరిగియున్నది.

అటువంటి పరిస్థితులలో కూడా మన పరలోకపు తండ్రి మనతో ఉన్నాడనే సత్యము జ్ఞాపకముంచుకొనాలి.

యేసు యొక్క జీవితమును, మాదిరిగా తీసుకొని పేతురు ఇచ్చిన సలహా మేరకు అన్యాయముగా బాధింపబడినపుడు నోరు తెరవకుండా నిశ్శబ్దముగా ఉండటము కూడా దేవుని మహిమకు గొప్ప సాక్ష్యమిచ్చిన దానికి సమానమని పేతురు వివరించుచున్నాడు. అన్యాయము చేయు వారిని సరియైన రీతిలో శిక్షించుటకు బదులు నిశ్శబ్దముగా ఉండుట గొప్ప లక్షణము. ఎందువలనంటే దేవునికి అన్ని విషయాలు ఆయన స్వాధీనములో ఉన్నవి అని నమ్ముచున్నాము. కాబట్టి నెమ్మదిగా ఉండుట కూడా సాక్ష్యమిచ్చే విధానమైయున్నది. కయప మరియు పిలాతు యేసును ప్రశ్నించునపుడు ఆయన నోరు తెరచి అనేక విషయాలను గూర్చి తనను తాను సమర్థించుకొనుటకు మాట్లాడియుండెడి వాడే. కాని యేసు ఆ విధముగా చేయలేదు. ఆయన సాత్వికమునకు ఆయన నిశ్శబ్దమే సాక్ష్యముగా నిలిచింది.

**నీ యెడల న్యాయము జరగనప్పుడు ఆ పరిస్థితిని నీవు ఏవిధముగా పరిష్కరిస్తావు? నీ జీవితమునకు నేడిక్కడ చర్చించిన కొన్ని నియమాలను ఏ విధముగా అనుసంధానము చేసుకొని యేసు స్వభావమును బయలుపర్చగలవు?**

### గురువారం సెప్టెంబరు 1

## మన శైలము మరియు ఆశ్రయపురము

ఆత్మ గౌరవము చాలా తక్కువగా ఉన్నవాళ్ళు ఎవరంటే గర్విష్టులు, అహంకారులు మరియు రెచ్చగొట్టేవారై యుంటారు. వారిలో అంతరంగికముగా లోపించిన విషయాన్ని కప్పిపుచ్చుకొనుటకు పైకి గర్విష్టులుగా ప్రవర్తిస్తూ ఉంటారు. వారిలో సాత్వికము లేక వినయము ఉండదు. ముఖ్యముగా శ్రమలు ఎదురైనపుడు మనందరికి అవసరమైనట్లే వారికిని భద్రత భావము, ఉత్తమమైన యోగ్యతలు, అంగీకరించబడుట మొదలగునవి అవసరమవుతాయి. ప్రభువు ద్వారానే వీటిని పొందగలమని క్లుప్తముగా చూచినప్పుడు సాత్వికము మరియు వినయము అనునవి బలహీనతకు సంబంధించిన లక్షణాలు కాదు. ఎవరి జీవితమైతే బండ మీద స్థిరముగా నిలిచియుంటుందో సాత్వికము మరియు వినయము అనే లక్షణాలు కనిపిస్తాయి.

**కీర్తన 62:1-8 చదువుడి. ఈ సంకీర్తనకు ఉన్న ప్రాతిపదిక ఏమిటి? దావీదు వివరిస్తున్న విషయమేమిటి? ఆ విషయాల నుండి ఎట్టి ఆధ్యాత్మిక నియమాలను నేర్చుకొనగలము? ఆ నియమాలను నీ జీవితమునకు ఏవిధంగా అన్వయించగలవు?**

..........................................................................................

..........................................................................................

"అకారణముగానే మనుష్యులు మనకు విరోధులవుతూ ఉంటారు. లోకము చేత మాత్రమే కాక, తోటి సహోదరుల వలన కూడా దేవుని ప్రజల యొక్క ఉద్దేశాలకు అపార్ధాలు అంటగట్టుదురు. ప్రభువు యొక్క సేవకులను కష్టమైన స్థలములలో బంధిస్తారు. స్వార్ధముతో కూడిన మరియు అవినీతికరమైన మార్గముల ద్వారా లాభమును పొందుటకు గోరంతలను కొండంతలుగా చేసి చూస్తారు. తప్పుడు ప్రచారము ద్వారా ఈ మనుష్యులు చీకటి కార్యములకు ప్రాధాన్యతనిచ్చి అపనమ్మకముతో వ్యవహరిస్తారు. అటువంటి వారిని నమ్ముటకు వీలుండదు. దేవుని సేవకులు క్రీస్తుకు కలిగిన మనస్సును కలిగియుండాలి. వారికి అవమానము సంభవించినదని అనుకొనరాదు. దేవుని సేవకులను ఆవేశపరులని మరియు మతమూఢత్వము గల వారని నిందలు వేస్తారు. అయితే వారు నిరుత్సాము చెందకూడదు. ముందు జాగ్రత్తగా దేవుని యొక్క హస్తములు ఆయన పనిని ఆయన మహిమార్ధమై నడిపిస్తాయి" ఎలెన్ జి వైట్, పై వాటినే చూచుట పుట 177.

**ఇతరులు మీ మీద వేసే నిందలను ఏవిధముగా మీరు స్వీకరించగలుగుచున్నారు? స్వీకరించలేకపోతున్నారా? మీరు ఏవిధముగా ప్రభువునకు అంటి పెట్టుకొని మిమ్ములను మీరు కాపాడుకొనగలరు? ఆయన మీ పాపాలనిమిత్తమే చనిపోయాడు కావున ఆయనే మీకు సహాయము చేస్తాడు?**

**శుక్రవారం** **సెప్టెంబరు 2**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, స్వస్థత సువార్త పరిచర్య నుండి "నిజమైన జ్ఞానమును అన్వేషించుట" పుటలు 453, 454; యుగముల అభీష్టము నుండి "కొండ మీద ప్రసంగము" పుటలు

298-314. సువార్త పరిచర్య నుండి "పనివాడు అతని యోగ్యతలు" పుట 630 చదువడి.

క్రీస్తునందు దాచబడియున్న సాత్వికము ద్వారా మనకు ఎదురయ్యే క్లిష్టపరిస్థితులు బలహీనపడతాయి. మన యజమాని యొక్క వినయమును మనము కలిగియున్న యెడల మనకు ఎదురయ్యే అవమానములను అధిగమించవచ్చును. అది మన మనస్సులపై విచారమును కలుగజేయలేవు. క్రైస్తవునిలో అవసరమైన ఉన్నతమైన లక్షణము ఏమిటంటే ఆత్మ నియంత్రణ కలిగియుండాలి. అతనిలో దేవుని యొక్క స్వభావము నివసించకుండా అది అడ్డుకుంటుంది. క్రీస్తు యొక్క అనుచరులకు వినయముగల లేక తగ్గించుకొనే లక్షణముగల హృదయము వారికి విజయమును అందిస్తుంది. వారు పరలోకపు స్థలములతో సంబంధము కలిగియుందురు. -ఎలెన్ జివైట్, యుగయుగాల అభీష్టము పుట 301.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. వినయము కలిగియుండుట ద్వారా అది మనలను, హృదయము గాయముల నుండి ఏవిధముగా లేవనెత్తును? ఈ విధముగా చేయుటకు వినయమునకు ఏ లక్షణము నీకు సహాయపడుతుంది?
2. మీ సంప్రదాయము ప్రకారము సాత్వికము వినయము నీకున్న లక్షణాలను ఏవిధముగా చూస్తారు? వాటిని గౌరవిస్తారా? ఈ లక్షణాలను అలవర్చుకొని జీవించుటకు మీ సంప్రదాయము ఏవిధముగా అడ్డుతగులుతున్నవి?
3. సాత్వికమునకు మరియు వినయమునకు చెందిన మాదిరికరమైన వ్యక్తులు మీ దృష్టిలో ఎవరైనా ఉన్నారా? ఉన్నట్లయితే వారెవరు? వారి నుండి నీవేమి నేర్చుకొనగలవు?
4. సాత్వికము మరియు వినయము అనే ఈ లక్షణములు బలహీనతకు సూచనగా ఉన్నవి అని కొందరనుకుంటారు. అది నిజమా? నిజమైతే ఎందువలన ఆవిధముగా భావిస్తున్నారు.

❋✶❋

11వ పాఠం సెప్టెంబరు 3-9

# కొలిమిలో వేచి యుండుట

సబ్బాతు మధ్యాహ్నము సెప్టెంబరు 3

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యములు :రోమా 15:4,5; రోమా 5:3-5; 1 సమూయేలు 26; కీర్తన 37:1-11.**

**కంఠతవచనం : "అయితే ఆత్మఫలమేమనగా... ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము" (గలతి 5:22).**

శాస్త్రజ్ఞులు నాలుగు సంవత్సరాల వయస్సున్న పిల్లలతో ఒక ప్రయోగమును నిర్వహించారు. దాని ప్రకారము ఆ పిల్లలు శాస్త్రజ్ఞులు చెప్పినట్లు చెస్తే వారికి "మార్ష్మాలో" అనే ఒక తియ్యని పదార్ధాన్ని తినుటకు ఇస్తారు. ఒక శాస్త్రజ్ఞుడు వేరే పని మీద బయటకు వెళ్తూ, తిరిగి వచ్చేవరకు ఓపికగా ఆ పిల్లలు మార్ష్మాలు (తినుబండారము) తినకుండా వేచియున్న యెడల వారికి రెండు మార్ష్మాలు ఇస్తానని వాగ్దానము చేసాడు. అతను వెళ్ళిపోగానే వారిలోని కొంతమంది పిల్లలు వారికివ్వబడిన మార్ష్మాలును నోటిలో కుక్కుకొని తినేసారు. కొందరు పిల్లలైతే ఆ శాస్త్రజ్ఞుడు తిరిగి వచ్చే వరకు తినకుండా ఎదురుచూస్తున్నారు. అక్కడ వారి మధ్య ఏర్పడిన తేడాను గమనించడం జరిగింది.

ఆ శాస్త్రజ్ఞులు ఆ పిల్లలను అంతటితో విడిచి పెట్టక వారిలో పెద్దవారిగా ఎదిగి ఒక్కొక్కరు ఏవిధముగా తయారయ్యారనే విషయాన్ని వారి పరిశోధన ద్వారా తెలుసుకున్నారు. మొదటి పరిశోధనసమయములో ఆ శాస్త్రజ్ఞుడు తిరిగి వచ్చేవరకు వారికివ్వబడిన తినుబండారాన్ని తినకుండా వేచియున్న పిల్లలు ఇప్పుడు యువకులుగా ఉన్నారు. వారు పరిస్థితులను అనుకూలముగా సర్దుబాటు చేసుకొని జీవించుటకు అలవాటు పడినట్లుగా కనిపించారు. మంచి విద్యార్ధులుగా ఉన్నారు. ఓపిక పట్టని ఇతర పిల్లలతో పోల్చినపుడు వీరు ఎక్కువ నమ్మకముగల ధైర్యముగల వారిగా ఎదిగారు. ఆ పరిశోధనను బట్టి సహనము, ఓర్పు అను లక్షణములు మానవ స్వభావములో ఉన్నతమైన మరియు ప్రాముఖ్యమైన పాత్రను పోషించుచున్నవని తేలింది. అందువలననే మన ప్రభువు ఆ లక్షణాలను అలవర్చుకొని అభివృద్ధిపర్చుకోమని ప్రోత్సహించి యున్నాడు.

ఈ వారము మనము వేచియుండే కొలిమిని గూర్చి అధ్యయనము చేయుదము.

**సంక్షిప్తముగా ఈ పాఠము యొక్క సారాంశము :** కొన్ని సందర్భాలలో కొన్ని విషయాలు నెరవేరుటకు ఎందువలన మనము కనిపెట్టవలసియున్నది? కొలిమిలో ఉండగా సహనమును గూర్చి ఏ పాఠములను నేర్చుకొనగలము.

– సెప్టెంబరు 10, సబ్బాతు దినమున ఈ వారము యొక్క పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం సెప్టెంబరు 4

## సహనముగల దేవుడు

**రోమా 15:4,5 చదువుడి. ఈ వాక్యాలలో దాగియున్న విషయాలేమిటి?**

..........................................................................................

..........................................................................................

మనకు కావాలనుకునే విషయాలలోను మనకు వాగ్దానము చేయబడినను అవి ఇప్పటికి నెరవేరకపోయినను, సాధారణముగా వాటి విషయమై అసహనాన్ని వెలుబుచ్చుతూ ఉంటాము. వేటి కొరకై ఎదురుచూస్తున్నామో అవి లభించినపుడు తృప్తి చెందుదుము. ఫలాన విషయము కావాలనుకున్నా అందుబాటులో లేనపుడు కొంత కలత చెంది అసహనాన్ని ప్రదర్శిస్తాము. అట్టి స్థితిలో ఉన్నప్పుడు దేవుని యందు నమ్మకముతో సహనము కలిగి జీవించడం అసాధ్యమనిపిస్తుంది.

వేచియుండడమనునది దాని అర్ధమును బట్టి చూస్తే అది బాధాకరమైన విషయమే. దీనికి సమానమైన హెబ్రీ పదమును కీర్తన 37:7లో "కనిపెట్టుకొని యుండుము" అని చూడగలము. ఆ మాటలు ఒక హెబ్రీ పదమును తర్జుమా చేయబడిన మాటల నుండి వస్తున్నది. "బాధతో నిండియున్న" "కదిలింపబడిన" "వణికిపోవుచున్న" "గాయపర్చబడియున్న" "విచారముతో నిండియున్న" అనే భావములు అందులో ఉన్నవి. ఓర్పు కలిగి జీవించుటకు నేర్చుకొనడం అంత సులభమైన విషయమేమి కాదు. అది కొన్ని సందర్భాలలో కొలిమిలో పెట్టబడినట్లు అనే భావమును కలిగియుంటుంది.

**కీర్తన 27:14; కీర్తన 37:7; మరియు రోమా 5:3-5 చదువుడి. ఈ వాక్యాలు మనకు ఏమి చెప్పుచున్నవి? ఓర్పు లేక సహనము దేనికి నడిపిస్తుంది?**

..........................................................................................

.........................................................................................

మనము వేచి చూస్తున్నపుడు, రెండు విషయాల మీద మన మనస్సును పెట్టవచ్చును. ఏ విషయాల కొరకు వేచి చూస్తున్నామో వాటి మీద మన దృష్టి పెట్టవచ్చును. లేక ఎవరి హస్తములు వాటిని కలిగి యుంటారో వారి మీద నైనను మన దృష్టిని కేంద్రీకరించవచ్చును. ఇక్కడ గమనించినచో దేని కోసము మనము వేచి చూస్తున్నామో అది ప్రధానమైన విషయము కాదు గాని ఏ వైఖరితో వేచి చూస్తున్నామో అది ప్రాముఖ్యము. ప్రభువు నందు నమ్మకము పెట్టినచో, ఆయన హస్తాలకు జీవితాలను సమర్పించుకున్నచో మన చిత్తమును ఆయన వశము చేసిన యెడల, అప్పుడు ఆయన మనకేది మంచిదో దానిని చేస్తాడని నమ్మగల్గుదుము. అది ఎంత కష్టమైనా, ఎంత సమయము తీసుకున్నా ఆయనను నమ్ముతాము.

**ఏ విషయాల కొరకు నీవు ఆశతో ఎదురు చూస్తున్నావు? దేవుని చిత్తమునకు మరియు ఆయన నిర్దేశించిన సమయమునకు, సమస్తమును ఆయనకు అప్పగించుకొనుటకు మన మెట్లు నేర్చుకొనగలము? ప్రభువునకు సంపూర్ణముగా సమర్పించుకునే వైఖరిని అనుగ్రహించమని ప్రార్థిద్దాము.**

.........................................................................................

.........................................................................................

సోమవారం సెప్టెంబరు 5

## దేవుని యొక్క సమయములో

**రోమా 5:6; గలతీ 4:4 చదువుడి. దేవుడు నిర్ణయించిన సమయమును గూర్చి ఈ వాక్యములు ఏమి నేర్పుచున్నవి?**

ఈ వాక్యాలలో యేసు మన కొరకు సరైన సమయములో చనిపోవుట కొరకు వచ్చియున్నాడని పౌలు చెప్పాడు. అది సరైన సమయమై ఎందుకుంటుందని పౌలు చెప్పుట లేదు. ఈ వాక్యాలను చదివి, పాపమునకు ఒక పరిష్కారమును కనుగొనుటకు యేసు ఈ భూమి మీదకు రావడానికి వేలాది సంవత్సరాలు ఎందుకు వేచియున్నాడు? అంతకుముందు పాపము చాలా చెడ్డదని ఈ విశ్వము అర్థము చేసుకొనలేకపోయిందా? యేసు రెండవసారి వచ్చుటకు ఎందుకింకా వేచి చూస్తున్నాడు అని అడగవచ్చు. ప్రభువు నా ప్రార్ధనకు జవాబు ఇచ్చుటకు ఎందుకింత కాలము వేచియున్నాడని మనము అడుగవచ్చును.

**ఉదాహరణకు దానియేలు యొక్క 70 వారముల ప్రవచనమును గూర్చి అనగా యేసు మెస్సీయ్యాగా రానైయున్నాడనే విషయమును గూర్చి ఆలోచించుడి. దీని కాల పరిమితి ఎంత? దేవుని సమయమును బట్టి ఆలోచించవలసియున్నదనే విషయాన్ని నేర్చుకొనుటకు ఇదేమి చెప్పుచున్నది?**

..................................................................................................

..................................................................................................

వేచియుండవలసిన సమయములను గూర్చి ఎన్నో ఆధ్యాత్మిక కారణములు ఉన్నవని తెలుసుకుంటాము. మొదటగా వేచియుండే సమయములో మన గమనములను సరియైన విషయముపై కేంద్రీకరించులాగునను, మనలను తిరిగి దేవుని యొద్దకు నడిపించుటకు సహాయపడుతుంది.

రెండవదిగా మన కోరికలు మరియు ఉద్దేశములు ఏవిధముగా ఉన్నవో సరిచూసుకొనుటకు వేచియుండు సమయము మనకు సహాయపడుతుంది.

మూడవదిగా పట్టుదలతో లేక నిరంతర కృషితో వేచియుండాలనే విషయాన్ని లేక ఆధ్యాత్మిక సహనము అభివృద్ధి పరచుకొనుటకు సహాయపడుతుంది.

నాల్గవదిగా వేచియుండుట వలన ఆధ్యాత్మికముగా బలపడుటకు మార్గములు తెరువబడును. అనగా విశ్వాసము, నమ్మకము, అభివృద్ధి చెందుతాయి.

ఐదవదిగా పెద్ద దృశ్యములో లోపించిన చిన్న చిన్న భాగములను సక్రమముగా మార్చుటకు వేచియుండే కాలము సహాయపడుతుంది.

ఆరవదిగా మనము ఎందుకు వేచియున్నామో కారణము మనకు ఎన్నటికి తెలియకపోవచ్చును. అందువలననే విశ్వాసము ద్వారా జీవించుటకు నేర్చుకుంటాము. వేచియుండుటకు నీకేమైనా ఇతర కారణాలు కనిపిస్తున్నాయా?

**దేవుడు ప్రతి విషయాన్ని తన సమయమందు చేయుచున్నాడు అని తెల్పుటకు నీకు ఇతర ఉదాహరణలు ఏమైనా తెలుసా? నీవు ఆయనను నమ్మినచో నీకు మేలుకరముగా ఆయన సమయమందు నీ కోరికలు నెరవేర్చును. నా ప్రార్ధనలకు దేవుని యొద్ద నుండి జవాబులు ఆలస్యముగా రావడానికి నేనే కారణమైయున్నానా అనే విషయాన్ని మనము గుర్తించగలుగుచున్నామా?**

మంగళవారం సెప్టెంబరు 6

## దావీదు : వేచియున్న ఒక ఉపమాన పాఠము

1 సమూయేలు 16:1–13లో దావీదును రాజుగా సమూయేలు అభిషేకించెను. అయితే యెష్షయి కుమారునికి తన తండ్రి పొలములో నుండి యెరూషలేములో ఉన్న సింహాసనమును చేరుటకు కొంత సమయము పట్టింది. అనుమానమేమియు లేదు. కొన్నిసార్లు దావీదు కొలిమి మధ్యలో ఉన్నట్లు భావించాడు.

మొదటగా కలవరము చెందియున్న సౌలు మనసుకు ఊరట కలుగు నిమిత్తము బాలుడైన దావీదు సంగీత వాయిద్యమును వాయించవలసివచ్చెను. (1సమూ 16) తరువాత అతడు గొల్యాతును చంపుట ద్వారా ఇశ్రాయేలీయులకు ఒక శూరుడయ్యాడు (1 సమూ 17) అటు తరువాత చాలా సంవత్సరాలు దావీదు తన ప్రాణములను కాపాడుకొనుటకు పారిపోతూ బ్రతికాడు. సౌలు తరువాత దావీదు ఇశ్రాయేలీయులకు రాజు కాబోవుతున్నాడనే విషయము సౌలు మరియు అతని కుమారుడైన యోనాతానుకు తెలుసు (1సమూ 23:17; 24:20). అయితే దావీదుకి దేవుడు నిర్ణయించిన విధి చేరుటకు తనంతట తానుగా ఎట్టి ప్రయత్నము చేయలేదు. నిజము చెప్పాలంటే దావీదు అంత త్వరగా రాజు కాకూడదని కొన్ని వ్యతిరేక సేవలు చేసాడు. అతనిని చంపుటకు సౌలు కుట్రలు పన్నినా దావీదు సౌలుకు అపకారమేమియు చేయక, సౌలు వస్త్రపు చెంగును కత్తిరించుకొనిపోయెను. ఆవిధముగా చేసియుండకూడదని బాధపడ్డాడు (1సమూ 24:5–7) మరొకసారి సౌలు దావీదుకు దొరికినా చంపుటకు దావీదు నిరాకరించాడు (1సమూ 26:7–11).

**1సమూ 26:1–11 చదువుడి. సౌలును చంపుటకు దావీదు ఎందుకు నిరాకరించాడు? దేవునికి మన యెడల ఉన్న ప్రణాళికలను నెరవేర్చుటకు మార్గములు ఆయనకు ఉంటాయి. ఈ సందర్భముగా దావీదు సౌలును చంపకపోవుటను బట్టి ఏ నియమమును గూర్చి ఆ విషయము మనకు బోధిస్తుంది?**

........................................................................................................

........................................................................................................

**ఇప్పుడు 1 సమూ 26:12–25 చదువుడి. సౌలును దావీదు చంపుటకు నిరాకరించుట ద్వారా ఆ సంఘటన సౌలుకు ఎట్టి మానసిక క్షోభ కలుగజేసింది? దేవుని కొరకు వేచియుండుట వల్ల ప్రయోజనాల గూర్చి ఈ సంఘటన ఏమి బోధిస్తుంది?**

దావీదు సింహాసనమును అధిరోహించుటకు ముందు సాగినయాత్రనంతటిని గమనించినచో, దేవుడు నీకు ఇంకను అప్పగించని దానిని బలవంతంగా తీసుకొనవద్దు అనే గుణపాఠము నేర్చుకొనవచ్చు. దేవుని వరాలు ఆయన హస్తాల మీదుగా పొందితే అవి ఎప్పటికి మేలైనవిగా ఉంటాయి. దేవుడు తన సమయాన్ని బట్టి వాటిని అనుగ్రహిస్తాడు. ఈవిధానములో సుదీర్ఘ కాలము వేచియుండవలసి యుంటుందేమో. చిక్కుడు గింజలు గంటల వ్యవధిలోనే మొలకెత్తును. సింధూర వృక్ష విత్తనాలు మొలకెత్తుటకు సంవత్సరాలు పడుతుంది. అయితే బలమైన గాలులు లేచినపుడు సింధూర వృక్షము కూలిపోదు. స్థిరముగా నిలబడుతుంది.

**సౌలును దావీదు చంపియున్నచో ఆ చర్యను సమర్థించుకొనుట సులభమే. అయితే దావీదు చర్యలు దేవుని మీద అతనికున్న నిజమైన విశ్వాసమును తెలియజేయుచున్నవి. నీవు వేచియుండవలసిన విషయాలలో ఈ ఉదాహరణ ఏవిధంగా నీవు నిరుత్సాహపడకుండా సహాయపడుతుంది?**

బుధవారం సెప్టెంబరు 7

## ఏలియా : వేగిరపాటు వలన వచ్చిన సమస్య

కర్మెలు పర్వతము మీద జరిగిన శక్తి ప్రదర్శన అంతమునకు వచ్చినది. (1రాజులు 18) ఆకాశము నుండి అగ్ని కురిసినది. అక్కడ సమావేశమైన జనులందరు నిజ దేవుడు ఎవరో గుర్తించారు. అబద్ద ప్రవక్తలు చంపబడ్డారు. నిజమైన దేవుడెవరో నిరూపించబడ్డాడు. దినములు గడిచే కొలది ఏలియా ఆధ్యాత్మికముగా బలపడుచున్నాడని మీరు తలంచవచ్చును. అయితే అకస్మాత్తుగా వినిన వార్త వలన అతడు భయపడి, చనిపోతే మంచిదనే నిర్ణయానికి వచ్చాడు. మిగిలిన వృత్తాంతమంతటిని 1రాజులు 19:1-9లో చూడుడి. ఆ వాక్యాలలోని చివరి మాటలు ఆందోళన కలిగించేవిగా ఉన్నవి.

"అచ్చట ఉన్న యొక గుహలో చేరి బస చేసెను. యెహోవా వాక్కు ప్రత్యక్షమై – ఏలియా యిచ్చట నీవేమి చేయుచున్నావని అతనినడిగెను" (1రాజులు 19:9) పరిస్థితిని గమనించినట్లయితే ఏలియాకు కలిగిన భయము వలన అనుకూలముగాని స్థలములో దాగుకొనుటకు పారిపోయాడు.

**కర్మెలు పర్వతము మీద ప్రభువు ఎంతో శక్తిని ప్రదర్శించిన తరువాత ఏలియా**

**ఎంతో విశ్వాసముతోను మరియు నమ్మకముతోను నిండియుండవలసింది. అయితే దానికి విరుద్ధముగా ప్రాణమునకు భయపడి పారిపోయాడు. దీనినుండి ఏ గుణపాఠమును నేర్చుకొనగలము?**

.....................................................................................

.....................................................................................

ఈ వృత్తాంత మంతయు ఒక ప్రాముఖ్యమైన విషయాన్ని తెలియజేస్తుంది. మనము విషయములోనైనా వేగిరపడినపుడు మనము తప్పుడు స్థలములోనికి వెళ్ళిపోదుము. ఏలియా విషయములో అతని భయమే అతనిని తొందరపెట్టి, అతడు జన్మించి యుండకపోతే ఎంత బాగుండుననుకొనుచూ ఎడారిలోనికి పారిపోయాడు. దేవునికి మన యెడలున్న ప్రణాళికకు బదులు వాటికి విరుద్ధంగా చేయుటకు వేగిరపడుతుంటాము.

**ఈ క్రింది వాక్యాలను చదవండి. ఈ వాక్యాలలో చూపించబడిన వ్యక్తులు దేవుని చిత్తమునకు విరోధముగా వెళ్ళుటకు కారణాలేమిటి? ఆది 16:1-3; సంఖ్యా 20:10-12; న్యాయాధిపతులు 14:1-3; మత్తయి 20:20,21; లూకా 9:52-56; అపొ.కా.9:1.**

.....................................................................................

.....................................................................................

కోరిక, కోపము, మనోవికారము, అవిశ్వాసము లేక ప్రభువు కొరకు పట్టుదల కలిగియున్నట్లు భావించుట, ఇవన్నియు కూడా మనము ఎక్కడికి వెళ్ళకూడదో అక్కడికి నడిపించుటకు దోహదపడును. ఈ ప్రమాదమునకు గురికానట్టి అతీతులెవ్వరూ ఉండరు. అయితే దీనంతటిని బట్టి నేర్చుకున్నదేమంటే దేవుని యొక్క మంచితనము మీదను, ఆయన కృప మీదను, నమ్మకముతో కూడిన విశ్వాసమును అభివృద్ధి పరచుకొనవలసి ఉంది. దేవుడు మనలను ప్రేమించి, మేలు జరగాలని కోరుకుంటున్నట్లు మనకు తెలుసు. అంతమాత్రాన అదేదో యాంత్రికముగా జరిగిపోయేది కాదు అది విశ్వాసమునునది ఒక వరమై యున్నది. అయితే ఆ వరమును అభివృద్ధి చేసుకొనాలి. పోషించాలి. ఎంతో పట్టుదలతో సంరక్షించవలసియుంది.

గురువారం సెప్టెంబరు 8

## యెహోవాను బట్టి సంతోషించుటకు నేర్చుకొనుట

"యెహోవాను బట్టి సంతోషించుము. ఆయన నీ హృదయవాంఛలను తీర్చును" (కీర్తన 37:4).

కీర్తన 37:4 ఒక అద్భుతమైన వాగ్దానము కలిగియున్నది. నీవు ఎల్లప్పుడు కావాలని కోరుకునే దానిని నీవు పొందుటను గూర్చి ఊహించుకో. అయితే మన హృదయవాంఛలు తీరాలనుకున్నట్లయితే మనకు ప్రభువునందు సంతోషించే హృదయాలుండాలి. అయితే యెహోవాను బట్టి సంతోషించుట అంటే అర్థమేమిటి?

కీర్తన 37:1–11 చదువుడి. కీర్తన 37:4నకు ఉన్న పూర్వ సంబంధం బహుశః కొంత ఆశ్చర్యాన్ని కలిగించునదై యుండవచ్చు. దావీదునకు దేవునికి వ్యతిరేకముగా పని చేయుచున్న మనుష్యులు అతని చుట్టూ ఉన్నారని దావీదు వ్రాసాడు. మనుష్యులు మనకు వ్యతిరేకముగా పని చేస్తున్నపుడు ఆ సందర్భములో సహజముగానే కోపపడవచ్చు లేక మనలను మనము సమర్థించుకొనుటకు ప్రయత్నించవచ్చును. అయితే దావీదు వేరే విధముగా ఉండమని సలహాయిస్తున్నాడు.

**ఈ క్రింది వాక్యాలలో ఈ పరిస్థితిని బట్టి దేవుని ప్రజలకు దావీదు ఇస్తున్న సలహా ఏమిటి?**

కీర్తన 37:1 ..............................................................

కీర్తన 37:5 ............................................................

కీర్తన 37:7 ............................................................

కీర్తన 37:8 ............................................................

**కీర్తన 37:4ను చదువుడి. మీరు చదివినపై వాక్యములను దృష్టిలో పెట్టుకొని, "యెహోవాను బట్టి సంతోషించుట అంటే ఏమిటి?**

"దేవునిని నమ్మండి" అని వేర్వేరు విధములుగా పదేపదే దావీదు చెప్పుచున్నాడు. పనిచేయుటకు ఆయనను నమ్మండి. దేవుడు మీ దేవుడై యున్నాడు. ఇప్పుడు కూడా ఆయన మీ కొరకు పనిచేయుచున్నాడు. అందువలన మీరు కలవరము చెందవద్దు. నీవు మారి, నీ అంతట నీవే విషయాలను పరిష్కరించుకోవాలనుకోవద్దు. మీ పరలోకపు తండ్రి అన్నిటి మీద అధికారము గలవాడు. అందుచేత ఆయనను పరిపూర్ణంగా నమ్మండి.

ఈ సందర్భములోనే దావీదు "యెహోవానుట్టి సంతోషించుడి" అని వ్రాసాడు. దేవుని బట్టి సంతోషించడమంటే ఆయన యెడల పరిపూర్ణ నమ్మకము కలదనియు, దానిని ఆధారము చేసుకొని మనము జీవిస్తున్నామని అర్థము. దేవుడు ఇక్కడున్నాడు. పనిచేయుచున్నాడు. కాబట్టి ఏ విషయములో కూడా మన శాంతిని భంగపరచలేదు.

ఆయనకు మన స్తుతియాగము అర్పించగలము. చిరునవ్వుతో మాట్లాడగలము. ఎవరూ మనలను ఆయన యొద్ద నుండి త్రోసి వేయలేరు. ఆవిధముగా చేయుటకు నేర్చుకున్న యెడల ప్రేమ గల తండ్రిమనకేమి అనుగ్రహించునో దానిని పొందగలము. ముఖ్యముగా ఆయన రాజ్యమును పొందగలము.

**యెహోవాను బట్టి సంతోషించుటకు ఏవిధంగా నేర్చుకొనగలము? దేవుని నడుపుదల కొరకు ప్రార్ధనలో కొంత సమయం గడుపుడి. అప్పుడవన్నియు మీ జీవితంలో నిజమవుతాయి.**

శుక్రవారం సెప్టెంబరు 9

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ పితరులు మరియు ప్రవక్తల నుండి "దావీదునకు అభిషేకము చేయబడెను" పుటలు 637-642 చదువుడి.

మన కొరకు దేవునికున్న ప్రణాళిక ప్రకారము ఎక్కువ కాలము వేచియుండవలసిందేమో. ఆ విధముగా వేచియుండటమంటే, అది కొలిమిలో పడిన అనుభవమును పోలియుంటుంది. దేవునియందు నమ్మకముంచిన యెడల ఓర్పుతో వేచియుండటము సాధ్యమవుతుంది. ఆవిధముగానే వేచియుండనిచో ఊహించిన దానికన్నా ఎన్నో రెట్లు దేవుని దీవెనలను పోగొట్టుకుంటాము. దేవుడు మన పక్షమున పనిచేయుచున్నాడు. ఆయనయందు సంతోషించుట, ఆయనను హృదయపూర్వకముగా నమ్ముటవలన మనమెంతగానో మేళ్ళను పొందుదుము.

మనమెదుర్కొనే ప్రతి శోధనను ఆయన దాని బరువును చూస్తాడు దానిని లెక్కిస్తాడు.

నేను బాధలలో ఉన్నపుడు దేవుని యొక్క లక్ష్యమును గూర్చి తెలుసుకొనవలెను. అయితే మనకు ఏది మంచిదో ఆయనకు తెలుసు. నా యొక్క విశ్వసనీయమైన సృష్టికర్తగా ఆయనకు నన్ను సమర్పించుకుంటాను. నా జీవమును, నా దేహమును ఆయనకే సమర్పించుకుంటాను.

"ఆ హేతువు చేత ఈ శ్రమలను అనుభవించుచున్నాను గాని, నేను నమ్మిన వానిని ఎరుగుదును గనుక సిగ్గుపడను. నేను ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను" (2తిమోతి

1:12). మన జీవాత్మను సరియైన రీతిలో తర్ఫీదు చేసిన యెడల, మన పరలోకపు తండ్రి పై మన పరిపూర్ణ నమ్మకమును ఉంచినచో మన జీవిత పోరాటముల గుండా ప్రయాణించినపుడు మనకు ఎక్కువ సమాధానమును, సంతోషమును కలుగును.

"యేసు యొక్క చేతులకు వేరుగా ఉంటూ భయముతోను లేక ఆందోళనతోను జీవించాలని ఆయన కోరుకొనుట లేదు. ఎక్కువ వేచియుండుటకు మనము నేర్చుకొనవలసి యున్నాము" ఎలెన్ జి వైట్, ఎన్నిక చేయబడిన వర్తమానములు, పుస్తకము 2, పుట 242.

**చర్చించుకొనుటకు ప్రశ్నలు :**

1. మనము ఎదుర్కొనే ప్రతి శోధనను యేసు దాని బరువును చూస్తాడు. దాని కొలతలను గమనిస్తాడు అంటే అర్ధమేమిటి? మనము వేచియున్న సమయములో ఈ విషయమును గూర్చి తెలిసికొనుట వలన మనకు ఏవిధంగా సహాయపడుతుంది?
2. ఓపికతో వేచియుండుట అంటే ఏమిటో మీ తరగతిలో ఉన్న సభ్యులను అడిగి వారి అనుభవమును బట్టి ఇతర సభ్యులకు వివరించమనండి. వారు విన్న సాక్ష్యమును బట్టి ఏమి నేర్చుకొనియుంటారు?
3. ఓర్పును అలవాటు చేసుకొనుటకు ప్రార్ధన ఏవిధంగా సహాయపడుతుంది?

❖❖❖

12వ పాఠం సెప్టెంబరు 10-16

# మొలకెత్తే విత్తనమువలె మరణించుట

**సబ్బాతు మధ్యాహ్నము :** సెప్టెంబరు 10

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఫిలిప్పీ 2:5-9; రోమా 12:1,2; 1సమూ 2:12-3:18; 1సమూ 13:1-14; జెకర్యా 4:1-14.**

**కంఠతవచనం : "గోధుమగింజ భూమిలోపడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును. అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును" (యోహాను 12:24).**

"గోధుమ గింజ మొలకెత్తేటప్పుడు చనిపోవడము అనే ఒక ఆసక్తిని రేపే సాదృశ్యము ద్వారా యేసు మాట్లాడుతూ, మనము దేవుని చిత్తమునకు అప్పగించుకున్నట్లయితే మన పరిస్థితి కూడా ఆవిధముగానే ఉంటుందని వివరిస్తున్నాడు. మొదటగా గోధుమ గింజ క్రింద రాలిపోతుంది. కంకినుండి రాలిపోయిన గోధుమ గింజకు ఎక్కడ ఎప్పుడు ఏవిధముగా నేల మీద పడిపోయినదో అనే విషయములో దాని ప్రమేయమేమీ లేదు.

రెండవది : అక్కడ వేచియుండవలసి వస్తున్నది. ఆ గింజ భూమిలో పడినపుడు, దాని భవిష్యత్తు ఏమైయుంటుందో దానికే మాత్రం తెలియదు. భవిష్యత్తులో తన జీవితము ఏవిధముగా ఉండనైయున్నదో అది ఊహించుకొనలేదు. ఎందువలనంటే అది కేవలం ఒక గింజ మాత్రమే కనుక.

మూడవది : అక్కడ మరణించడం సంభవిస్తుంది. ఆ గోధుమ గింజ తనకున్న క్షేమకరమైన, సౌకర్యవంతమైన స్థితిని విడనాడితేనే గాని, అది ఒక గోధుమ మొక్కగా వృద్ధి చెందలేదు. అది జరగాలంటే ఆ గింజ చావాలి. అనగా అది ఒక గింజ దశనుండి, ఫలము ఫలించే మొక్కగా మార్పు చెందాలంటే, గింజదశలో దానికున్నటువంటి అన్ని లక్షణాలను అది విడిచి పెట్టవలసియున్నది.

**సంక్షిప్తముగా ఈ పాఠము యొక్క సారాంశము :** మన యెడల దేవునికున్న చిత్తము మనకు మంచిదనుకున్న యెడల, దానిని అంగీకరించుటకు ఎందుకంత కష్టపడవలసి వస్తుంది? సమర్పించుకొనే విషయములో క్రీస్తు మనకు విడిచి పెట్టి వెళ్ళిన మాదిరి ఏమిటి? గోధుమ గింజ సాదృశ్యమును మన జీవితాలకు అన్వయించడాన్ని మీరు ఏవిధముగా చూస్తున్నారు?

– సెప్టెంబరు 17, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం సెప్టెంబరు 11

## సేవ చేయుట కొరకు లొంగిపోవుట

**ఫిలిప్పీ 2:5-9 చదువుడి. ఈ వాక్యాలలో ఏ ప్రాముఖ్యమైన వర్తమానముంది?**

.....................................................................................

.....................................................................................

నేటి మన సంప్రదాయ మరియు సంస్కృతి సమాజములో మన హక్కుల కొరకు పోరాడమని మన మీద ఒత్తిడి తీసుకొని వస్తున్నది. సాధారణముగా ఆవిధముగానే పరిస్థితులు ఉండాలి. అయితే మన యెడల దేవునికున్న చిత్తము నెరవేరాలంటే, తండ్రియైన దేవునికి సేవ చేయాలనుకుంటే, స్వేచ్ఛగా మన హక్కులను విడనాడాలని యేసు బోధిస్తున్నాడు. ఆవిధముగా చేయుట ద్వారా దాని ప్రభావము దేవుని రాజ్యము మీద ఉంటుంది. అయితే హక్కులను విడిచి పెట్టడమనే ప్రక్రియ కొంచెము కష్టమైనది. అందులో మనము కొలిమిలో పెట్టబడిన వారముగా ఉన్నామనే అసౌకర్యము కూడా ఉంది.

ఇదే విషయాన్ని యేసు ఏవిధముగా చేసాడో చూడండి (ఫిలిప్పీ 2:5-8) దేవుని చిత్తమునకు తనను తాను అప్పగించుకొనుటకు యేసు మూడు మెట్లను అనుసరించినట్లు ఈ వాక్యాలు చెప్పుచున్నవి. ఆదిలోనే పౌలు మనలను "క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి" (ఫిలిప్పీ 2:5) అని హెచ్చరిస్తున్నాడు.

మనలను రక్షించే స్థితిలో ఉండుటకు తండ్రితో తనకున్న సమానవత్వమును యేసు విడిచి పెట్టి మానవునిగా ఈ భూమి మీదకు మానవునికున్న అన్ని పరిమితులతో వచ్చాడు (ఫిలిప్పి 2:6,7).

యేసు ఒక ప్రముఖ వ్యక్తిగా, ఘనమైన మానవునిగా ఈ భూమి మీదకు రాలేదు గాని ఇతర మానవులకు ఒక సేవకుడుగా వచ్చెను (ఫిలిప్పి 2:7).

మానవులకు సేవకునిగా, యేసు సుదీర్ఘకాలము సుఖసంతోషాలతో జీవించలేదు గాని "మరణము పొందునంతగా విధేయత" చూపించాడు. ఘనమైనది మరియు మహిమకరమైన విధముగా కూడా మరణించలేదు. "మరణము పొందునంతగా" అనగా "సిలువ మరణము పొందునంతగా విధేయత చూపించెను" (పిలిప్పి 2:8).

**మన జీవితాలలో ఏ విషయాలలో యేసు మనకు మాదిరిగా ఉండగలడు? సమానత్వము మరియు హక్కులు మంచివైనపుడు వాటిని కాపాడుకొనవలసియున్నది. వాటిని విడిచి పెట్టాలనే సలహాను నీవెట్లా వివరిస్తావు? ఇప్పుడు ఫిలిప్పీ 2:9 చదువుడి. దేవుని**

**యొక్క చిత్తమునకు సమర్పించుకోవాలనే విషయాన్ని అర్ధము చేసుకొనుటకు ఈ వాక్యము ఏవిధముగా సహాయపడుతుంది?**

...................................................................................

...................................................................................

**పరిశుద్ధాత్మ నుండి మనకు జ్ఞానము వచ్చునట్లు ప్రార్థించండి. నా చుట్టూ ఉన్న వారికి, నా సంఘమునకు, నా కుటుంబమునకు సేవ చేయుటకు వీలుగా నేను యేసు యొక్క చిత్తమునకు సమర్పించుకొనకుండా ఇప్పుడు కలిగియున్న ఏ వాక్కు నాకు మరియు యేసునకు మధ్య అడ్డుగా నిలుచుచున్నది? మంచి సామర్థ్యముతో ఇతరులకు సేవ చేయుటకు నాకు ఎదురయ్యే ఇబ్బందులను నేను ఎట్లు సహించగలను?**

**సోమవారం** **సెప్టెంబరు 12**

## దేవుని చిత్తమును తెలుసుకొనకముందు మరణము సంభవిస్తుంది

అనేక మంది క్రైస్తవులు వారి జీవితముల యెడల దేవునిచిత్తము ఏమైయున్నదో తెలుసుకొనుటకు మనః పూర్వకముగా ఆయనను వెదకుచున్నారు. “నా జీవితము యెడల దేవుని చిత్తమేమైయున్నదో నేను తెలుసుకోగలిగితే ఆయనకు నా సమస్తమును అర్పించుకుంటాను” ఈ విధముగా దేవునికి వాగ్దానము చేసిన తరువాత కూడా ఆయన చిత్తమేమిటో అనే విషయము మనలను కలవరపెడుతూ ఉంటుంది. ఈ రకమైన కలవరమునకు కారణము రోమా 12:1,2లో చూడగలము. ఇక్కడ దేవుని చిత్తమును ఏవిధముగా తెలుసుకోగలమో అనే విషయములో ఒక ప్రాముఖ్యమైన సలహాను ఇస్తున్నాడు. నీ యెడల దేవుని చిత్తము ఏమైయున్నదో తెలుసుకొనగోరిన యెడల నీవు ముందుగా నిన్ను నీవు ఆయనకు సమర్పించుకొనవలసి యున్నది.

రోమా 12:1,2 చదువుడి. మన దేవుని చిత్తము ఏమైయున్నదో “పరీక్షించి తెలుసుకొనగలము” అని పౌలు వ్రాసాడు (రోమా 12:2). అప్పుడు ఈ క్రింది విషయాలు సంభవిస్తాయి.

1. మన యెడల దేవుని యొక్క కృపను గూర్చి మనకు నిజమైన అవగాహన కలుగుతుంది (రోమా 12:1).

2. మనము దేవునికి సజీవ యాగముగా సమర్పించుకుంటాము (రోమా 12:1)

3. మన మనస్సులు మారి నూతన మగును (రోమా 12:2)

కేవలం మార్పు చెందిన మనస్సు మాత్రమే నిజముగా దేవుని యొక్క చిత్తమును

అర్ధము చేసుకుంటుంది. ఈ మార్పు చెందదమనునది ముందుగా మన స్వార్ధము మరణించుటతో ముడిపడి ఉంటుంది. క్రీస్తు మన కొరకు శ్రమలను ఎదుర్కొని యున్నాడు. అది సరిపోదు. ఆయన మరణించవలసియున్నది.

**నీ జీవితములో పూర్తిగా మరణించని విషయాలేమైనా ఉన్నవేమో చూపించమని పరిశుద్ధాత్మను అడుగుము. నీవు దేవునికి సజీవయాగముగా మారుటకు ఏ విషయాలను నీవు విడిచి పెట్టవలసిందని పరిశుద్ధాత్మ నిన్ను కోరుచున్నాడు?**

..............................................................................................

..............................................................................................

"మన జీవితములో కొన్ని విషయాలు మన స్వార్ధముతో పాటు మరణించకపోయిన యెడల అప్పుడు దేవుడు కొన్ని వేదనలను (కొలిమిలు) అనుమతించి వాటి ద్వారా మన గమనమును ఆయన ఆకర్షిస్తాడు. మనము పొందే శ్రమలను మన పాపమును ఎదిరించుటకు సహాయపడుటయే గాక, మన కొరకు యేసు ఏవిధంగా శ్రమను అనుభవించాడో అనే విషయాన్ని అర్ధము చేసుకుంటామో, దానిని బట్టి మన హృదయాలను అంత సమీపంగా ఉండునట్లు ఆయనకు సమర్పించుకుంటాము" అని ఎలిజబెత్ ఇలియట్ వ్రాసెను. ఇంకా వివరిస్తూ సిలువను గూర్చి పొందే అనుభవము రక్షకునికి కలిగిన అనుభవముతో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉంటుంది. అయినప్పటికి ఆయన శ్రమలలో అనుభవము పొందుటకు అవకాశము ఇస్తున్నాడు. మనము పొందే ప్రతి శ్రమ ద్వారా ఆయన శ్రమానుభవములోనికి పిలుచుచున్నాడు. ప్రేమ కొరకు వెదకుట, పుట 182.

**రోమా 12:1,2 చదివి ప్రార్ధించుడి. నీవు సజీవయాగముగా సమర్పించుకొనక ముందు ఏమి విడిచి పెట్టవలసి యున్నావో ఆలోచించుకో.**

**మంగళవారం** **సెప్టెంబరు 13**

## వినుటకు సమ్మతించుట

"తరువాత యెహోవా ప్రత్యక్షమై నిలిచి ఆ రీతిగా –సమూయేలు; సమూయేలూ అని పిలువగా సమూయేలు –నీ దాసుడు ఆలకించుచున్నాడు ఆజ్ఞ యిమ్మనెను" (1సమూయేలు 3:10).

పరిశుద్ధాత్మ మిక్కిలి నిమ్మళముగా మాట్లాడే స్వరమును నీవు ఎప్పుడైనా విని ఆ స్వరమును విననట్లు దాటిపోయావా? అటు తరువాత ప్రతీది తప్పు జరుగుట వలన అయ్యో! నేను ఆ స్వరమెందుకు వినలేదని ఎపుడైనా తలంచావా?

ముందుగా సమూయేలు ఒక వృద్ధుని గూర్చి, దుర్మార్గులైన అతని ఇద్దరు కుమారులను గూర్చి మాట్లాడెను. అతని ఇద్దరు కుమారులు దేవుని మాట వినలేదు. అయితే ఒక చిన్న బాలుడు విన్నాడు. తీవ్రమైన హెచ్చరికలు దేవుని యొద్ద నుండి వచ్చినను, ఎవరైతే వారి నడవడిని మార్చుకొనవలసి యున్నదో వారు మాత్రము మారలేదు.

**వారి వృత్తాంతమును 1 సమూ 2:12-3:18లో చదువుడి. దేవుని మాట విన్న వారు వినని వారు మధ్య ఎటువంటి తేడాను చూడగలము?**

..............................................................................................

..............................................................................................

ఏలీ కుమారుల మనస్సులలో వేరే విషయాలుండుట వలన వారు దేవుని మాటలను వినలేదు. దేవునికి ఏమి కావాలో తెలుసుకొని ఏలీ తన కుమారులతో మాట్లాడినను వారిని ఏమీ చేయలేకపోయెను. ఏలీ కుమారుల యొక్క జీవిత విశేషములను దేవుని చిత్తమునకు అప్పగించుకోవడానికి వారికిష్టము లేదు. యవనస్థుడైన సమూయేలుకును మరియు ఏలీ కుమారులకు మధ్య ఉన్న తేడాను చూడవచ్చు.

దేవుడు ఎవరినైనా పిలిచినపుడు ఆ స్వరమును వినుటకు 'సంసిద్ధులై ఉండాలి" అని చార్లెస్ స్టాన్లీ అనే బోధకుడు చెప్పాడు. పరిశుద్ధాత్మ కేవలం సమాచారమును అందచేయుటకు మాత్రమే మాట్లాడదు. తిరిగి సమాధానమును ఆశించి ఆయన మాట్లాడును. ఎప్పుడు మాట్లాడాలో ఆయనకు తెలుసు. సమయమును వృధా చేయడు. విరుద్దమైన విషయాలను మాట్లాడడు. ఇవన్ని నిజమే గనుక దాని అర్ధము ఆయన సాధారణముగా నిశ్శబ్దముగా ఉంటాడు. ఆయన మాటలను వినుటకు మనకు అవసరమైనంత సమయాన్ని ఇస్తాడు. చివరిగా ఆయనకు విధేయతను చూపించే వరకు మన కొరకు ఆయన వేచి యుంటాడు. "ఆశ్చర్యకరమైన ఆత్మ నిండిన జీవితము" పుటలు 179,180.

**మనము సంసిద్ధముగా ఉన్నామా? అని స్టాన్లీ గారు అడుగగా దాని అర్ధమేమిటి? దేవునికి నీవు బహిరంగముగా అందుబాటులో ఉన్నపుడు పరిశుద్ధాత్మను వినకుండా చేసే విషయాలు ఏమిటి? నీ జీవితములో దేవుని స్వరమును వినుటకు నీవేమి నేర్చుకొనవలసియున్నావు?**

**బుధవారం** **సెప్టెంబరు 14**

## స్వశక్తినే నమ్ముకొనుట

ఏదేను తోటలో హవ్వ పాపము చేసినప్పుడు, దేవుని యొక్క మాటను

అనుమానించింది. కాబట్టి ఆమె పాపము చేసింది అనుకొనుటకు వీలులేదు. అక్కడ ఆమె సమస్య ఏమిటంటే తనంతట తాను అది మంచిది. ఆవిధముగా ఆమె చేయుట సరియైనదే అని అనుకొనుటకు ఆమెకు తగినంత జ్ఞానముందని అనుకొనుట వలన అక్కడ ఆ సమస్య ఏర్పడినది. ఆమె తీసుకొనిన నిర్ణయము సరియైనదే అని నమ్మింది. దేవుని వాక్యమును నమ్ముటకు బదులు మనము తీసుకొనిన నిర్ణయాల మీద ఆధారపడినపుడు, అన్ని సమస్యలు మన మీదకు వచ్చుటకు వీలుగా తెరలేపినట్లవుతుంది.

సౌలు తన స్వశక్తినే నమ్ముకొని తీసుకున్న నిర్ణయాల వలన ఒక దాని వెంట మరొకటిగా ప్రమాదములు ఎదురయ్యాయి. సౌలును దేవుడు నిర్ణయించిన రాజుగా సమూయేలు అభిషేకించెను (1సమూయేలు 10:1) అటు తరువాత అతడు ఏవిధముగా నడుచుకోవాలో చెప్పాడు (1సమూ 10:8) అయితే సౌలు అవిధేయత చూపించాడు.

**తరువాత భాగమును 1సమూ 13:1-14 చదువుడి. సౌలు యొక్క పతనానికి అతనే కారకుడయ్యాడనుటకు సౌలు చేసిన పని ఏమిటి?**

....................................................................................................

....................................................................................................

రాజుగా సౌలు నియమింపబడిన తరువాత అతడు తన స్వశక్తినే నమ్ముకొని అతి త్వరలోనే పతనానికి దారితీసాడు. అతడు తీసుకున్న మూడు విధానపరమైన నిర్ణయాలు వాటంతట అవి తప్పుడు నిర్ణయాలు కాకపోయినను వాటిలో ప్రమాదకరమైన విత్తనాలున్నవి. అతడు తీసుకున్న నిర్ణయాలు దేవునికి వేరుగా ఉండి స్వతంత్రముగా తీసుకొన్నాడు. సౌలు పొందిన పతన క్రమమును చూడుడి.

1. "జనులు (తన సైన్యముతో సహా) నా యొద్ద నుండి చెదరిపోవుటయు మరియు సమూయేలు అతని యొద్ద లేకపోవుటయు నేను చూచితిని" అని సౌలు చెప్పెను. (1సమూ 13:11) సౌలు అక్కడ చాలా ఒత్తిడిలో ఉన్నాడు. అక్కడ ఏమి సంభవించుచున్నదో తన కనులారా చూచి దానిని సమీక్ష చేసుకున్నాడు.

2. "నేను చూచాను" అని చెప్పిన సౌలు ఇపుడు "నేనే చెప్పాను" అనే స్థితికి వెళ్ళాడు. ఫిలిష్తీయులు వచ్చి నా మీద పడుదురు లేక జయించెదరు" అని అతడు ఊహించెను (1సమూ 13:12) "పరిస్థితులను తన కళ్ళతో ఏమి చూసాడో దాని ప్రకారము నిర్ణయాన్ని తీసుకున్నాడు.

3. సౌలు "నేను చెప్పాను" నుండి నేను భావించాను అనే స్థితికి వెళ్లాడు. వెంటనే అతడు దహనబలి అర్పించెను (1సమూ 13:12) సౌలు ఏమి తలంచాడో వాటి ప్రకారం తన భావములు మారిపోయాయి.

మన మందరము ఈవిధంగానే చేస్తున్నాము. మన మానవ కనుదృష్టి మీదే ఆధారపడుతున్నాము. అది మనలను సొంత ఆలోచన మీద ఆధారపడుటకు నడిపిస్తుంది. తరువాత మనసొంత భావాల మీద ఆధారపడుతున్నాము. ఆ భావాలను క్రియా రూపములోనికి మార్చుదము.

**సౌలు ఎందుచేత తన సొంత నిర్ణయాల మీద ఆధారపడి యున్నాడని మీరనుకొనుచున్నారు? మనము బలహీనులమని తెలిసి కూడా మన మీద ఆధారపడుటకు మనం నిర్ణయించుకుంటాము. దేవుని ఆజ్ఞలకు విధేయులగుటకు ఏమి చేయగలము?**

గురువారం సెప్టెంబరు 15

## ప్రత్యామ్నాయములు

మనము మన స్వశక్తి మీద ఆధారపడుట వలన దేవుని చిత్తమునకు మనలను సమర్పించుకోవడంలో అశ్రద్ధ చూపిస్తామని నిన్నటి పాఠములో చదువుకున్నాము. దేవునికి బదులు ఇతర ప్రత్యామ్నాయాల మీద ఆధారపడుటకు ప్రయత్నిస్తారు. కొందరు అధైర్యము చెంది కృంగినపుడు వారిని వారు సంతోషపర్చుకొనుటకు బజారుకు వెళ్ళి ఏమైనా వస్తువులు కొనుక్కుంటారు. కొందరు తగిన గుర్తింపు లేనపుడు గొప్ప పేరును సంపాదించాలని ప్రయాసపడుదురు. భార్యాభర్తల మధ్య ఒకరికొకరు పడనప్పుడు వేరే వారి నుండి ఆప్యాయతను మరియు ఆనందమును పొందాలని ప్రయత్నిస్తారు.

మనము ఉపయోగించే కొన్ని వస్తువులు మనలో ఒత్తిడిని తగ్గిస్తాయి. అయితే అవి సమస్యను మాత్రము తీర్చలేవు. లేక రెండవసారి అదే సమస్య ఎదురైతే దానిని ఏవిధముగా ఎదుర్కొనాలో అవి బోధించలేవు. కేవలం దైవ సంబంధమైన సహాయము మాత్రమే సమస్యలను తీర్చగలవు. ప్రతి విషయములోను దేవుని మీద ఆధారపడుటకు బదులు, ప్రత్యామ్నాయము వెదకుచూ మన సమస్య పరిష్కారము కొరకు వాటిని నమ్ముకుంటాము.

దేవునికి బదులు మనము మూడు ప్రత్యామ్నాయముల మీద ఆధారపడతాము.

1. మనకు దేవుని యొద్ద నుండి పరిష్కార మార్గము అవసరమైనపుడు, మానవుని యొక్క తెలివితేటల మీద ఆధారపడుదుము.

2. దేవుని పరిష్కారములు మనకు అవసరమైనప్పుడు, మన సమస్యలకు అడ్డము వేయుటకు ప్రయత్నించుదుము.

3. దేవునిని ప్రక్కన పెట్టి వాస్తవాల నుండి పారిపోవుటకు చూస్తాము. దైవశక్తి కొరకు దేవునితో మాట్లాడవలసి యున్నది.

మనము ప్రత్యామ్నాయములను వెదకుచున్నపుడు, అది కాదు మనకు కావలసిందని ఆలోచించుటకు జెకర్యా మనకు సహాయపడగలడు. చాలా కాలము తరువాత దేవుని ప్రజలు బబులోను చెర నుండి విడుదల పొంది స్వదేశమునకు తిరిగి వచ్చారు. వారు తిరిగి వచ్చిన వెంటనే దేవుని మందిర నిర్మాణం ప్రారంభించారు. దానికి చాలా వ్యతిరేకత వచ్చింది (ఎజ్రా 4–6లో చూడండి). ఆ సమయంలో జెరుబ్బాబెలు నుండి ప్రోత్సాహకరమైన వర్తమానమును జెకర్యా తెచ్చి పునర్నిర్మాణ పని జరిగించాడు.

**ఈ విషయాలను జెకర్యా 4లో చదివి 4:6లో ఉన్న దాని విషయమై దేవుని యొక్క భావమేమిటి? పరిశుద్ధాత్మ ద్వారా పునర్నిర్మాణ కార్యక్రమము సాగియున్నదా? మనము చేసే పనులకు, పరిశుద్ధాత్మునికి మధ్య ఎటువంటి బాంధవ్యముండాలని ఇది మనకు బోధిస్తుంది?**

..........................................................................................

..........................................................................................

మందిర నిర్మాణ విషయములో తలెత్తిన వ్యతిరేకతను దేవుడు ఆపలేదు. లేక ఒత్తిడిలో ఉన్న జెరుబ్బాబెలును కూడా ఆయన విడువలేదు. వ్యతిరేకత నుండి దేవుడు అన్ని వేళలా మనల్ని కాపాడకపోవచ్చు. వ్యతిరేకత రావచ్చును. దానిని దేవుడు శ్రమగాను, కొలిమిగాను ఉపయోగించుట వలన అది మనలను దేవుని మీద ఆధారపడునట్లు నేర్పుతుంది.

**ఒత్తిడి వచ్చినపుడు, నీ మొదటి స్పందన ఏమిటి? ఆహారమా? టెలివిజనా? ప్రార్థనా? దేవునికి సమర్పించు కొనుటా? ఏ విషయాలలో మీకు మార్పు అవసరమో మీ జవాబు మీకు ఎటువంటి పాఠమును నేర్పిస్తుంది?**

**శుక్రవారం** **సెప్టెంబరు 16**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తల నుండి "ఏలీ మరియు అతని కుమారులు"పుటలు 575–580 మరియు సౌలు యొక్క అహంకారము పుటలు 616–626 చదువుడి.

మన స్వకీయ కోరికలను, ఆశలను మనము చంపుకొనినప్పుడు దేవుని చిత్తమునకు సమర్పించుకొనుట సాధ్యమగును. ఆవిధముగా చేయుట ద్వారా ఇతరులకు సేవ చేసే మార్గములు తెరుచుకుంటాయి. బలియాగముగా మారనంతవరకు దేవుని కొరకు జీవించలేము. దేవుని యొక్క స్వరమును వినుటకు సంసిద్ధులమై ఉండాలి. నిజముగా మన చిత్తమును

దేవుని చిత్తమునకు సమర్పించుకున్నపుడు మన మీద మనము ఆధారపడుట వలన ఎదురయ్యే ప్రమాదాలను గూర్చి ఆలోచించాలి. దేవుని శక్తికి, ఆయన వాక్యమునకు ప్రత్యామ్నాయములను వెదకరాదు. క్రీస్తును పోలిన జీవితము మన హృదయములో ఉన్నపుడు దేవుని చిత్తానికి సమర్పించుకొనుట సాధ్యమగును. ఆయన మీద ఆధారపడి జీవించునట్లు దేవుడు మనకు కొన్ని వేదనలను లేక కొలిమిని అనుమతిస్తాడు.

"ఏలి యొక్క నిర్లక్ష్యమును ఆ దేశములో నివసించిన ప్రతి తండ్రికి మరియు ప్రతి తల్లికి వివరించుట జరిగింది. తన కుమారుల యెడల ఏలీ చూపిన అపవిత్రమైన ప్రేమ ఫలితముగా, చెడిపోయిన తన కుమారులలో పాపమనే పంటను కోసియున్నాడు. దుర్మార్గమును అనుమతించిన తల్లిదండ్రులు, దుర్మార్గమును ప్రోత్సహించి, దాని ప్రకారము జీవించిన పిల్లలు దేవుని యెదుట అపరాధులుగా నిలిచారు. వారు చేసిన పాప ఫలితముగా పాప ప్రాయశ్చిత్తముగా వారర్పించిన దహన బలులను దేవుడు అంగీకరించలేదు" –ఎలెన్ జి వైట్, చైల్డు గైడెన్సు, పుట 276.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఒక తరగతిగా దేవుని కుమారుడు మన పాపాల నిమిత్తమై మరణించుటకు మానవుడుగా ఈ భూమి మీదకు రావడమనునది నమ్మశక్యము గానిదిగా ఉంది. దానిని బట్టి ఒకడు తన్నుతాను తగ్గించుకొనుట మరియు స్వార్ధమునకు మరణించుట అంటే అర్ధమేమిటి? అది ఇతరులకు ఏ మేలు చేయును? యేసు చేసినట్లు మనమేవిధముగా ఏమి చేయలేకపోయినను, ఆ నియమాలు మనముందున్నవి. వాటిని ఏవిధంగా అనుసరించగలము?
2. మరుసటి క్షణము ఏమి సంభవిస్తుందో తెలియని స్థితిలో ఉన్నవారు దేవునికి సమర్పించుకొనుట అంటే అదొక భయంకర అనుభవముగా భావిస్తారు. అట్టివారికి మీరేవిధముగా సలహాలివ్వగలరు?
3. దేవునికి సమర్పించుకొనుటలో ఇతరులకు ఎదురవుతున్న కష్టాలను గూర్చి ప్రార్ధన చేయండి. అట్టి వారి కొరకు మీరేమి చేయగలరు?

❖❖❖

13వ పాఠం సెప్టెంబరు 17-23

# శ్రమల కొలిమిలో క్రీస్తు

సబ్బాతు మధ్యాహ్నము సెప్టెంబరు 17

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యములు : లూకా 2:7, 22-24; మత్తయి 2:1-18; యోహాను 8:58, 59; లూకా 22:41-44; మత్తయి 27:51,52; రోమా 6:23; తీతు 1:2.**

**కంఠతవచనము : "ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు -ఏలీ ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను. ఆ మాటకు నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము" (మత్తయి 27:46).**

శ్రమలను గూర్చి మనము ఎప్పుడు ఆలోచించినా ఈ ప్రశ్న ఎదురవుతుంది. మొట్టమొదట పాపము మరియు శ్రమలు ఏవిధముగా వచ్చినవి? దైవ ప్రేరేపణ ద్వారా ఈ ప్రశ్నకు మనకు మంచి జవాబులేవున్నవి. మానవులు పాపము లేకుండా ఉన్నపుడు దేవుడు వారికిచ్చిన స్వేచ్ఛను వారు దుర్వినియోగము చేసారు. అందువలన అవి ప్రవేశించినవి. ఈ జవాబు మరొక ప్రశ్నకు చోటిచ్చినది. ఈ మానవులు పాపములో పడిపోతారని దేవునికి ముందుగానే తెలుసా? అవును దేవునికి తెలుసు. ఈ సందర్భముగా సి.ఎస్.లూయిస్ ఈ విధముగా వ్రాసాడు. మానవులు పాపములో పడుదురని దేవునికి ముందుగానే తెలిసియున్నను నరులను గూర్చి "ఈ నష్టము భరించుట యోగ్యమైనదిగా ఆయన తలంచెను".

ఆ మాత్రము నష్టము భరించుట యోగ్యమైనదేనా? ఎవరి కొరకు భరించాలి? అవును మన కొరకే ఆయన భరించుచు పరలోకములోని సింహాసనము మీద ఆయన కూర్చున్నాడా? ఆవిధముగా కాదు గాని, దేవుడు తాను చేసిన సృష్టిలో తెలివైన వారున్నారు. వారికివ్వబడిన స్వేచ్ఛ పవిత్రమైనది లేక దైవసంబంధమైనది. అందుచేత ఆ స్వేచ్ఛను తెలివైన మానవులకు ఇవ్వకుండా దేవుడు ఉండలేకపోయాడు. మానవులుగా మనకివ్వబడిన స్వేచ్ఛను దుర్వినియోగము చేసినప్పుడు దానివలన కలిగిన వేదన యొక్క తీవ్రతను దేవుడు తానే భరించుటకు తీర్మానించుకున్నాడు. ఆయన పడిన ఆ శ్రమను యేసు యొక్క జీవితము మరియు మరణములో చూస్తున్నాము. యేసు మన దేహములో వచ్చి శ్రమను అనుభవించి పరలోకమునకును మరియు భూమికిని మధ్య

శాశ్వతకాలము నిలిచియుండు బంధమును సృష్టించెను.

**సంక్షిప్తముగా ఈ వారము యొక్క పాఠము :** మన పక్షమున క్రీస్తు ఏమి శ్రమపడ్డాడు? ఆయన పొందిన శ్రమలనుండి ఏమి నేర్చుకొనగలము?

– సెప్టెంబరు 24, సబ్బాతుదినమున ఈ వారము యొక్క పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **సెప్టెంబరు 18**

## తొలి దినములు

యేసు ఈ లోకములో జీవించిన కాలములో ఆయన తొలి సంవత్సరములను గూర్చి బైబిలు ఎక్కువ సమాచారమును ఇవ్వలేదు. అయితే ఆయన ఎటువంటి పరిస్థితులలో జీవించియున్నాడో అనే విషయాన్ని కొన్ని వచనములు వివరించుచున్నవి.

**లూకా 2:7, 22,24 (లేవీ 12:6-8 కూడా చూడుడి) మత్తయి 2:1-18 ఆరంభము నుండి యేసు తన జీవితము ఏ రీతిగా గడిపెనో అనేవిషయాలను గూర్చి ఈ వాక్యములేమి చెప్పుచున్నవి?**

..............................................................................................

..............................................................................................

అవును. ఆ కాలములో యేసు ఒక్కడే పేదరికములో జీవించడముకాదు. అప్పటిలో పేదరికము అంతటా ఉన్నది. అయితే ఆయన బాల్యదశ నుండి కూడా ఆయనను చంపాలని చూసిన వారు కూడా ఉన్నారు. ఆయన జీవితమును ఇంకొంచెం లోతుగా అర్థం చేసుకొనుటకు తొలి సంవత్సరాలలో ఏమి సంభవించినదో అనే విషయాలను తెలుసుకొనుటకు వేరే కోణములో చూడవలసియున్నాము.

**యోహాను 1:46 చదువుడి. యేసు ఎదుర్కొనిన శ్రమలను గూర్చి ఈ వాక్యము ఏ విషయాన్ని తెలియజేయుచున్నది?**

..............................................................................................

..............................................................................................

మానవులు పాపములో ప్రవేశించకముందు ఆదామవ్వలు తరువాత యేసు ఒక్కరే ఈ భూమి మీద పాపములేకుండా జీవించియున్నాడు. ఆయన తనలో పాపము లేని స్థితిలో, పవిత్రుడుగా, పాపము నిండిన లోకములో ఉన్నాడు. యేసు బాల్యదశ

నుండి పవిత్రుడైయుండి తన చుట్టూ పాపముండుట వలన దాని మధ్య జీవించడమనునది ఆయనకు అధిక వేదనతో కూడుకొనినదైయుంది. మనలో పాపము పేరుకుపోయి ఉన్నను మనము కూడా మన చుట్టూ ఉన్న పాపమునకు గురికాకుండునట్లు దానికి దూరముగా ముడుచుకొని పోవుటకు ప్రయత్నించినపుడు పాపము మన మీద ఎదురు దాడి చేసే ప్రయత్నం చేస్తుంది. పవిత్రుడైన క్రీస్తు పాపము నెదుర్కొనుటకు ఎంతో శ్రమపడి ఉంటాడు. పాపపు ఛాయలు ఆయనను కళంకము చేయలేకపోయినవి. ఆ విషయములో ఆయనకు ఇతరులకు మధ్య తేడా గమనించాలి. పాపములో పడకుండా తనను తాను కాపాడుకొనుటకు ఎంత వేదన చెందాడో గమనించు.

**మన చుట్టూ ఉన్న పాపముల విషయమై ప్రతి ఒక్కరు "నేను పాపములో పడకుండా జాగ్రత్తపడుచున్నానా లేక పాపమునకు లొంగిపోతున్నానా అని ప్రశ్నించుకొనవలసియున్నది. పాపము మనలను ఇబ్బంది పెట్టుచున్నదా? దాని విషయములో నేను కఠినముగా వ్యవహరిస్తున్నానా? ఆలోచించండి.**

సోమవారం	సెప్టెంబరు 19

## మనుష్యులలో ఆయన తృణీకరింపబడినవాడు నీచముగా ఎంచబడినవాడు

**యేసు దేవుడైయున్నాడు. ఆయన భూమ్యాకాశములు, వాటిలోని సమస్తమును సృజించాడు. లోక పాపముల నిమిత్తమై తన్నుతాను అర్పించుకొనుటకు ఈ లోకానికి నరావతారిగా వచ్చాడనే విషయాలను మనసులో పెట్టుకొని ఇక్కడివ్వబడిన వాక్యాలను చదువుడి. (మత్తయి 12:22-24; లూకా 4:21-30; యోహాను 8:58,59) యేసు ఈ భూమి మీద ఎదుర్కొన్న శ్రమలను గూర్చి అర్థం చేసుకొనుటకు ఈ వాక్యాలు ఎట్లు సహాయపడును?**

..........................................................................................

..........................................................................................

ఆనాటి నాయకులు మొదలుకొని సామాన్యప్రజల వరకు యేసు యొక్క జీవితమును గూర్చి, చేసిన కార్యాలను గూర్చి, ఆయన బోధలను అపార్థము చేసుకొని, ఆయనను తృణీకరించారు. కొందరైతే ఆయనను నీచముగా ఎంచారు. చెడు అలవాట్లకు అలవాటుపడిన కుమారుడని ఆ తల్లిదండ్రులు ఎంత ప్రేమించినను ఆయనను అంతకన్నా ఎక్కువ

ద్వేషించారు. యేసు ఈ భూమి మీదున్నపుడు తిరస్కారమును ఎదుర్కొన్నాడు. అది ఆయనకు ఎంతో వేదనను కలిగించియండవచ్చును.

**మత్తయి 23:37 చదువుడి. క్రీస్తు మనుష్యుల చేత తృణీకరించబడినపుడు ఆయన ఏవిధంగా బాధపడ్డాడో అనే విషయమును గూర్చి ఈ వాక్యమేమి చెపుతుంది? నీవు ఆ వాక్యాన్ని చదువుచుండగా తనను గూర్చి బాధపడినాడా? లేక వేరే కారణము బట్టి బాధపడ్డాడా? అది వేరే కారణమైతే అదేమైయుంటుంది?**

..............................................................................................

..............................................................................................

“తృణీకరించబడుట వలన కలిగే బాధను మనమందరము ఏదో ఒక సమయములో అనుభవించియుందుము. బహుశ మనము కూడా క్రీస్తు పొందిన బాధనే పొందియుంటాము. తృణీకరింపబడినందుకు బాధ నొందలేదు గాని, మనలను తృణీకరించిన వారు మనలను గూర్చి ఏమనుకుంటున్నారో అనే బాధపడుచున్నాము. అయితే యేసు విషయములో ఆయనను తృణీకరింపబడుట వలన దానివలన కలిగే పర్యవసానముల గూర్చి ఆయనకు తెలుసు. అందుచేత ఆయన వ్యసనపడియుంటాడు. క్రీస్తు నిరపరాధి కాబట్టి సాతానుడు ఆయనపై చేసే దాడులను ఆయన బాధతో భరించెను”–ఎలెన్ జి వైట్, ఎన్నిక చేయబడిన వర్తమానములు, పుస్తకము 3, పుట 129.

**తృణీకరింపబడినందుకు నీకు కలిగే బాధను భరించుటకు నీవు క్రీస్తు నుండి ఏమి నేర్చుకోగలవు? ఆయన మాదిరి నీకేమి చూపిస్తుంది? నీ సొంత జీవితానికి దానినెట్లు అన్వయించుకుంటావు?**

**మంగళవారం** **సెప్టెంబరు 20**

## గెత్సెమనెలో యేసు

“అప్పుడాయన–నా ప్రాణము మరణమగునంతగా దుఃఖములో మునిగియున్నది. మీరిక్కడ ఉండి మెలకువగా నుండుడని వారితో చెప్పెను” (మార్కు 14:34).

యేసు ఈ భూమి మీద తన 33 సం॥రాల జీవితము, ఏ విషయములో బాధపడినను, అది సిలువకుముందు చివరి గంటలలో ఆయన ఎదుర్కొనిన బాధతో సమానమైనది కాదు. క్రీస్తు యేసును జగత్తు పునాది వేయకమునుపే లేక అనాది కాలములోనే (ఎఫెసి 1:1–4;

2తిమో 1:8,9; తీతు 1:1,2) లోక పాపములను మోసికొనిపోవుటకు అర్పణగా యేసు తన ప్రాణమును అర్పించుటకు ప్రణాళిక వేయబడెను. అనాది కాలములో వేయబడిన ఆ ప్రణాళిక అంతయు జరుగును.

**గెత్సెమనెలో క్రీస్తు పొందిన వేదనను గూర్చి ఈ క్రింది వాక్యాలేమి వివరిస్తున్నవి? మత్తయి 26:39; మార్కు 14:33-36; లూకా 22:41-44.**

.......................................................................................

.......................................................................................

వారు ఆయనను చూడగలిగేటట్లు మరియు వినగలిగేటట్లు ఉన్నంత దూరము వారి నుండి వెళ్ళెను. అటు తరువాత ఆయన భూమి మీద సాగిలపడెను. పాపమును బట్టి ఆయన తన తండ్రి నుండి వేరుచేయబడెనని భావించెను. తన తండ్రికిని తనకును మధ్య ఏర్పడిన ఆ అగాధము చాలా వెడల్పుగాను చాలా చీకటిగాను, చాలా లోతుగాను ఉన్నది. దాని ముందు ఆయన ఆత్మ వణికెను. ఆ వేదన నుండి తప్పించుకొనుటకు తన దైవశక్తిని వినియోగించకూడదు. మానవుని యొక్క పాపఫలితములకు బదులుగా ఆయన శ్రమ పడవలసినదే. ఆజ్ఞాతిక్రమమునకు వ్యతిరేకముగా దేవుని యొక్క ఉగ్రతను మనుష్యుడుగానే యేసు సహించవలసివచ్చెను.

క్రీస్తు అంతకుముందెపుడు నిలువబడనట్టి స్థితిలో నిలువబడెను. ఆయన ఎదుర్కొనిన వేదనను ప్రవక్తయొక్క మాటలలో వివరించబడినది.

"ఖడ్గమా, నా గొఱ్ఱెల కాపరి మీదను, నా సహకారి మీదను పడుము. ఇదే సైన్యములకధిపతియగు యెహోవా వాక్కు - గొఱ్ఱెలు చెదరిపోవునట్లు కాపరిని హతము చేయుము. చిన్నవారి మీద నా హస్తము నుంచుదును. ఇదే యెహోవా వాక్కు" (జెకర్యా 13:7). పాపాత్ముడైన మానవునికి బదులుగా, హామీగా దైవ తీర్పు ప్రకారము క్రీస్తు శ్రమపడవలసిందే. న్యాయమంటే ఏమిటో దానికి ఆయన అర్థము చెప్పెను. ఇంతవరకు ఇతరుల కొరకు విజ్ఞాపన చేసేవాడు. కాని ఇపుడైతే తన కొరకు విజ్ఞాపన చేసే వారుంటారేమో అని ఎదురు చూసాడు" -ఎలెన్ జివైట్, యుగయుగాల ఆకాంక్ష పుట 686.

**గెత్సెమనెలో యేసునకు ఏమి సంభవించుచున్నదో చర్చించండి. ఆయన మీద లోక పాపములయొక్క భారము పడుట ఆరంభమైనది. అది ఏవిధముగా ఉంటుందో ఊహించండి. అంతకు పూర్వము గాని లేక ఆ సమయంలో గాని ఆయన ఒక మానవునిగ పొందినంత వేదనను ఏ మనిషి పొందలేదు. మన యెడల దేవునికున్న ప్రేమను ఇది మనకు ఏవిధంగా**

వర్ణిస్తుంది? దీనినుండి నీవు పొందే నిరీక్షణ ఏమిటి?

బుధవారం సెప్టెంబరు 21

## సిలువ వేయబడిన దేవుడు

రోమా దేశములో ఎవరికైనా కఠినమైన మరణ శిక్ష విధించాలంటే సిలువ వేసే పద్ధతిని వారనుసరించేవారు. అది భయంకరముగా మరణించుటకు గుర్తుగా ఉంది. ఆవిధముగా ఎవరైనా చంపబడినారంటే అది భయంకరమైన వార్తగా ఉండెడిది. అటువంటి రీతిలో దేవుని కుమారుడు సిలువ వేయబడ్డాడు. దేవుని కుమారుడైన యేసు మనవలె మానవ రక్తమాంసములతో జన్మించాడనే విషయాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. కొరడా దెబ్బల వలనను, కాళ్ళు చేతులకు మేకులు కొట్టుట వలనను, సిలువపై వ్రేలాడదీయబడిన ఆయన దేహము యొక్క బరువుకు దేహము తెగిపోయి గాయాలుగా ఏర్పడుటవలనను, ఆయనకు భరించరాని శారీరకమైన నొప్పి కలిగింది. ఘోరమైన నేరాలు చేసిన వానికి సహితము ఇంత తీవ్రమైన విధముగా శిక్షించడము జరగలేదు. కాని ఆయన యెడల చాలా దురుసుగా ప్రవర్తించారు. ప్రతి విషయములోను నిరపరాధియైన యేసు, అటువంటి ఘోరమైన మరణదండనను ఎదుర్కొనడం చాలా అన్యాయము.

అయినప్పటికి మనకు తెలిసినట్లుగా, అక్కడ సంభవించుచున్న విషయాలతో పోల్చుకుంటే ఆయన పొందిన శారీరక శ్రమలు తక్కువనే అనుకోవాలి. ఇదొక నిరపరాధియైన మనుష్యుని చంపుటకు మించినదైయుంది.

**యేసు యొక్క మరణము చుట్టూ సంభవించిన సంఘటనలను గమనించినచో ఆ సమయములో ఆ దృశ్యాన్ని చూసిన ప్రజలకు అర్ధమైన దానికన్నా ఇంకా ఎక్కువ జరుగుతుందా? అక్కడేమి సంభవించినదో బయలుపర్చుటకు సహాయపడే ప్రతి సంఘటనలో ఉన్న ప్రత్యేకత ఏమి?**

మత్తయి 27:45 ..........................................................................

మత్తయి 27:51,52 ..................................................................

మార్కు 15:38 ..........................................................................

అక్కడ మరణమే కాకుండా చాలా స్పష్టముగా వేరేదేదో సంభవించుచున్నది. అది ఎంత అన్యాయమైనదైనప్పటికి ఒక నిరపరాధి శిక్షింపబడుచున్నాడు. లేఖనాల ప్రకారము

పాపమునకు వ్యతిరేకముగా ఉన్న దేవుని ఆగ్రహము మన పాపము యేసుపై కుమ్మరింపబడెను. సిలువ మీద యేసు పాపమునకు వ్యతిరేకముగా అనగా సర్వలోక పాపానికి వ్యతిరేకముగా నీతిమంతుడైన దేవునికి ఉన్న న్యాయమైన ఆగ్రహమును ఎదుర్కొన్నాడు. ఆ విధముగా యేసు బహు లోతైన, అంధకారమైన మరియు తీవ్రమైన బాధను ఏ మానవుడు అనుభవించనంతగా ఆయన అనుభవించాడు. యేసు శిక్షను ఎదుర్కొనిన ఆ అనుభవమును లోకములో ఏ మానవుడు అనుభవించలేదు.

**నీకెదురౌచున్న ఎటువంటి శ్రమలలోనైన, నీ కొరకు క్రీస్తు సిలువ మీద పొందిన శ్రమల నుండి నీవు ఎటువంటి ఆకర్షణ మరియు నిరీక్షణను పొందుచున్నావు?**

గురువారం సెప్టెంబరు 22

## శ్రమలను ఎదుర్కొనిన దేవుడు

మనము ఒక దానికి అలవాటుపడి ఉండవచ్చును. ఈ లోకములో మనమున్నంతవరకు శ్రమపడుతూనే ఉంటాము. పాపములో పడిన మనుష్యులముగా అది మన విధియైయుంటుంది. బైబిలు వేరే విధముగా మనకు ఏమీ వాగ్దానము చేయుటలేదు.

**మనము చర్చించుచున్న అంశమునకు సంబంధించి ఈ వాక్యాలు మనకు ఏమి వివరిస్తున్నవి? అపొ.కా. 14:22; ఫిలిప్పీ 1:29; 2తిమోతి 3:12.**

..........................................................................................

..........................................................................................

మనము శ్రమల మధ్యలో జీవిస్తున్నప్పటికి రెండు విషయాలు మన మనస్సులో ఉంచుకోవాలి. మొదటగా ఏ మానవుడు కూడా శ్రమలు పొందలేనంతగా, మన ప్రభువైన క్రీస్తు శ్రమలను అనుభవించాడు. సిలువ యొద్ద ఆయన “నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను సహించెను” (యెష 53:4). మనందరి నిమిత్తమై ఆయన శ్రమ నొందెను అనే విషయాన్ని తోటి మానవులుగా మనకు తెలుసు. పాపరహితుడైన ఆయన మన కొరకు పాపముగా చేయబడెను (2కొరింథి 5:21).

రెండవది. మనము శ్రమ పడుచుండగ క్రీస్తు యొక్క శ్రమల ఫలితమును గుర్తుంచుకోవాలి. అనగా క్రీస్తు మన కొరకు చేసిన దాని ద్వారా ఏ వాగ్దానము చేసెనో దానిని గుర్తుంచుకోవాలి.

**యోహాను 10:28; రోమా 6:23; తీతు 1:2 మరియు 1 యోహాను 2:25 చదువుడి. మనకు చేయబడిన వాగ్దానములేమిటి?**

..........................................................................................

..........................................................................................

ఇక్కడ ఎన్ని శ్రమలున్నప్పటికి, యేసు మన పక్షమున శిక్షను తానే అనుభవించి నందుకు, ఆయనకు వందనస్తులమైయుండాలి. ఇప్పుడే యేసునందు విశ్వాసము ద్వారా మనము ఆయనయందు స్థిరముగా నిలువబడగలము. నిత్యజీవము మనకు వాగ్దానము చేయబడినది. క్రీస్తు యొక్క పరిపూర్ణ జీవితాన్ని బట్టి, బలియాగమును బట్టి మనకు వాగ్దానము చేయబడెను. మనమనుభవించే శ్రమలు, నిరుత్సాహములు నష్టాలు ఇవన్నియు శాశ్వతమైనవి కాదు. మన ఉనికిలో అవి ఏదో కొద్ది కాలము మాత్రమే ఉండెడివి. దీనికి విరుద్ధముగా మనకు నూతన ఆకాశము నూతన భూమి వాగ్దానము చేయబడెను. అక్కడ ఇక పాపముండదు. నష్టముండదు. శ్రమలుండవు. మరీ ముఖ్యముగా మరణమెన్నటికి ఉండదు. ఇవన్నియు కూడా క్రీస్తు మన కొరకు అనుభవించిన శ్రమలను బట్టి "అతడు తనకు కలిగిన వేదనను చూచి తృప్తినొందును" (యెష 53:11)

**శుక్రవారం** **సెప్టెంబరు 23**

**అదనపు అధ్యయనము**

ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము నుండి "గెత్సేమనె" పుటలు 585–697 మరియు "కల్వరి" పుటలు 741–757.

"మూడుసార్లు ఆ ప్రార్థన చేసాడు. మూడుసార్లు మానవత్వం –ప్రాణమును అర్పించకముందు కృంగిపోయింది. ఇప్పుడైతే లోక విమోచకుని యొద్దకు మానవ చరిత్ర వచ్చుచున్నది. ఆజ్ఞను అతిక్రమించిన వారిని, ఆవిధముగానే విడిచి పెడితే వారు నిత్య నాశనానికి పాత్రులవుతావు. అది చూస్తాడు రక్షకుడు. ఇంకా రక్షకుడు మానవుని నిస్సహాయ స్థితిని చూస్తాడు. ఆయన పాపమునకున్న బలమును చూస్తాడు. పతనమైపోతున్న లోకము యొక్క స్థితి ఆయన దృష్టికి వస్తుంది. దానికొరకు దాచిపెట్టబడిన నాశనము ఎదురుచూస్తున్నది. అందుచేత ఆయన ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆయనకు ఎంత భారమైనను మానవుని రక్షించుటకే ఆయన నిశ్చయించుకున్నాడు. ఆయన రక్తముతో తన బాప్తిస్మమును అంగీకరించాడు. పరలోకపు ఆవరణములను ఆయన విడిచి పెట్టాడు.

అక్కడ అంతా పవిత్రత, సంతోషము మరియు దేవుని యొక్క మహిమ ఉంటుంది. తప్పిపోయిన గొఱ్ఱెలను వెదకి రక్షించుటకు, పాపములో పడిపోయిన ఈ ఒక్క లోకమును రక్షించుటకు ఆయన ఈ లోకానికే వచ్చియున్నాడు. "ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోకుండా ఉండునుగాక, నేను దానిలోనిది త్రాగనియెడల మానవుని స్థితి మారదు. నీ చిత్తమే నెరవేరునుగాక" అని ప్రార్ధించెను – ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము, పుటలు 690, 693.

## చర్చనీయాంశములు

1. ఏ మానవుడు ఎన్నడూ ఎదుర్కొనని శ్రమలను క్రీస్తు ఎదుర్కొన్నాడని క్రీస్తు రూపములో దేవుడే శ్రమ పొందెనని ఏవిధముగా అర్ధము చేసుకొనగలము?

2. ఈ వారము పాఠములో క్రీస్తు అనుభవించిన శ్రమలను గూర్చి ఒక తరగతిగా చర్చించండి. క్రీస్తు పొందిన శ్రమలు ఏవిధముగా అవి మానవులు ఎదుర్కొనే శ్రమలుగా వున్నవి? క్రీస్తు ఆ శ్రమలను ఏవిధంగా ఎదుర్కొన్నాడు?

3. మీ కిష్టమైన బైబిలు వాగ్దానములేమిటి? శ్రమలలోను మరియు వేదనలోను ఏవిధముగా ఆ వాగ్దానములకు అంటిపెట్టుకొని ఉంటారు?

❖❖❖

# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# 2022 నాల్గవ త్రిమాసము

# నిత్య జీవము

వాస్తవానికి మరణమును గురించి మనము భయపడవలసిన విషయము కాదు. ఎందువలనంటే క్రీస్తు మన కొరకు చనిపోయాడు. మరియు మరణమునకున్న శక్తిని జయించాడు. (ప్రకటన 1:18) అని ఆయన మనకు వాగ్దానము చేసెను. ఆదామవ్వలు పాపములో పడిపోవుట వలన మరణము మానవ జాతియంతటికి చుట్టు ముట్టింది. అంతే కాకుండా ప్రాణమున్న ప్రతి దానిని మ్రింగివేసింది. రాబోవు త్రిమాసములో యేసునందు అనుగ్రహించబడిన నిరీక్షణను ఆధారము చేసుకొని బాధాకరమైన మరణము అనే అంశమును గురించి అధ్యయనము చేయబోవుచున్నాము.

## 1వ పాఠము : ఒక పరిపూర్ణమైన విశ్వములో తిరుగుబాటు

**ఈ వారమునకు సంబంధించిన అంశములు**

**కంఠత వచనం "......................................" యెషయా 14:12**

**ఆదివారం : సృష్టి : ప్రేమ తెలియజేయబడినది (1యోహాను 4:8,16)**

**సోమవారం : స్వేచ్ఛాచిత్తము : ప్రేమకు ఆధారము (1యోహాను 4:7-16)**

**మంగళవారం : అగమ్యగోచరమైన కృతజ్ఞత (మేలు మరచుట) (యెహేజ్కేలు 28:12-19)**

**బుధవారం : గర్వమునకు చెల్లించవలసిన మూల్యము (యెషయా 14:12-15)**

**గురువారం : అపనమ్మకము వ్యాపించుట (ప్రకటన 12)**

## 2వ పాఠం - ఒక పాపలోకములో మరణము

**కంఠత వచనం "......................................" రోమా 5:12**

**ఆదివారం : ఒత్తిడిలో (ఆది 2:16,17)**

**సోమవారం : సర్పము వలన మోసము చేయబడిరి (ఆది 3:1-7)**

**మంగళవారం : నీవు చావనే చావు (ఆది 3:4)**

**బుధవారం : పాపము వలన పర్యవసానములు (ఆది 3:7-19; రోమా 5:12)**

**గురువారం : మొదటి సువార్త వాగ్దానము (ఆది 3:15,21)**

SEVENTH - DAY **ADVENTIST** CHURCH



SUBHAVAARTHA TELEVISION

**బైబిల్ అంటే... కేవలం ఒక మతానికి లేదా ఒక విశ్వాసానికి పరిమితమైన గ్రంథం కాదు.**

# ఎడ్వెంటిస్టుల ప్రార్థనా పిలుపు

## ADVENTISTS PRAYER CALL MINISTRY

వాలంటీర్స్ / పాస్టర్లు సభ్యులను దర్శించు సమయమందు, వారి ప్రార్థనా విన్నపములను ఈ నంబర్ **9963467040** కి ఫోన్ చేసినచో వెంటనే వారి కొరకు ప్రార్థన చేయబడును

**ప్రార్థన సమయం :** ఉదయం 10 గంటల నుండి
సాయంత్రం 5 గంటల వరకు



పాస్టర్ షడ్రక్ సామ్యేల్ గారిచే "లేఖనాలు పరిశోధించుడి" కార్యక్రమము ప్రతి సోమవారం సా।। గం।। 7.30 ని।।ల నుండి గం।। 8.30 ని।।ల వరకు. సెల్ : 09444448864



పాస్టర్ జి.ఎలిషారావు గారు
సెల్ : 9491708701

## "దేవుని నిజమైన వెలుగు"

కార్యక్రమము ప్రతి శనివారం
ఉ।। 7 గం।।ల నుండి
ఉ।। 7.30 గం।।ల వరకు



పాస్టర్ విజయ్ చెరుకూరి గారు
సెల్ : 7093131171



**డా।। శరత్ బాబు గారిచే "కడవరి కాలం" కార్యక్రమము**

ప్రతి సోమవారం సా।। 6 గం।।ల నుండి 6.30 ని।।ల వరకు
ప్రతి శుక్రవారం(తెల్లవారుజామున) ఉ।। 2.30 ని।।ల నుండి 3 గం।।ల వరకు
సెల్ : 080 - 55259395

పై వర్తమానములు శుభవార్త టెలివిజన్ ఛానల్‌లో వీక్షించండి! ఆశీర్వాదాలు పొందండి!!



Pr. G. Elisha Rao
Cell :9491708701

## *GOD'S TRUE LIGHT*

*(English With Hindi Translation)*

**SUBHSANDESH TELIVISION**

*Every Thursday Morning 9:00-9:30 AM*



Pr. Vijay Cherukuri
Cell :7093131171